www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 17-3-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 332 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, పాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 9.54 తదుపరి నవమి; నక్షత్రం: మృగశిర సా. 4.48 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా. 1.41-3.22; దుర్ముహూర్తం: సా. 4.47-5.35; అమృతఘడియలు: ఉ. 7.44-9.23; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రేస్ వాకర్ రామ్‌కు ఒలింపిక్ బెర్త్



న్యూఢిల్లీ: భారత రేస్ వాకర్, ఆసియా క్రీడల కాంస్య పతక విజేత రామ్ బాబు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. స్లొవేకియాలో జరుగుతున్న డుడిన్స్కా 50 మీట్ పురుషుల 20 కిమీ. రేస్‌లో రామ్ గంటా 20 నిమిషాల (1:20:00 సె) టైమింగ్‌తో పూర్తి చేసి మూడో స్థానంతో కాంస్యం సొంతం చేసుకొన్నాడు. ఈ క్రమంలో ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ మార్క్ గంటా 20.10 సెకన్లలోపే రామ్ రేస్‌ను పూర్తి చేశాడు. పారిస్ కోటా సాధించిన ఏడో భారత అథ్లెట్‌గా రామ్ నిలిచాడు.

రష్మిక జోడీకి డబుల్స్ టైటిల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ ఇండోర్ టైటిల్‌ను తెలుగమ్మాయి శ్రీవల్లి రష్మిక జోడీ కైవసం చేసుకుంది. రష్మిక కెరీర్‌లో ఇది ఐదో ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శనివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో అన్‌సీడెడ్ జంట రష్మిక-వైదేహి చౌధురి 6-3, 7-5తో నాలుగో సీడ్ య హ్సువాన్ లీ (తైపీ)-సొహ్యాన్ పార్క్ (దక్షిణ కొరియా) జోడీకి షాకిచ్చి విజేతగా నిలిచింది. ఇక, రష్మిక సింగిల్స్‌లోనూ సత్తా చాటుతూ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది. సెమీఫైనల్లో రష్మిక 6-3, 6-4తో పొలినా లాట్సెంకో (రష్యా)పై విజయం సాధించింది.

లక్ష్యసేన్‌కు నిరాశ

● సెమీస్‌లో క్రిస్టీ చేతిలో పరాజయం
● ఆల్ ఇంగ్లండ్‌లో ముగిసిన భారత్ పోరు



బర్మింగ్‌హామ్: సహచరులంతా నిష్క్రమించినా, సెమీఫైనల్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌కు ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో చివరకు నిరాశే ఎదురైంది. రెండేళ్ల క్రితం ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన లక్ష్య.. ఈసారి ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ లక్ష్యసేన్ 12-21, 21-10, 15-21తో ఇండోనేసియాకు చెందిన వరల్డ్ నెంబర్ 9 జోనాథన్ క్రిస్టీ చేతిలో పోరాడి ఓడాడు. గంటకు పైగా సాగిన హోరాహోరీ ఫైట్‌లో తొలిగేమ్ ఓడినా.. రెండో గేమ్ నెగ్గి మ్యాచ్ తనవైపు తిరిగేలా చేసుకున్నాడు. కానీ, నిర్ణాయక ఆఖరిగేమ్‌లో విరామం తర్వాత పదేపదే తప్పిదాలకు పాల్పడి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. కాగా, భారత్ తరఫున ప్రకాశ్ పదుకొనె, పుల్లెల గోపీచంద్ మాత్రమే ఈ టోర్నీలో విజేతలుగా నిలిచారు.

ఇదీ.. పంత్ ఫిట్‌నెస్ సీక్రెట్!

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వికెట్ కీపర్ రిషబ్ పంత్.. కోలుకొని మళ్లీ క్రికెట్‌లోకి అడుగుపెట్టడం నిజంగా అద్భుతమే. ఐపీఎల్‌లో ఆడేందుకు బీసీసీఐ అతడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వాస్తవంగా రిషబ్ కోలుకోవడానికి రెండేళ్లు పడుతుందని డాక్టర్లు అంచనా వేశారు. కానీ, 15 నెలలకే అతడు మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించి అందరినీ అబ్బురపరిచాడు. రిషబ్ ఇంత వేగంగా కోలుకోవడానికి అతడు చిన్న వయసులో జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేయడం ఎంతో దోహదం చేసిందని ఎన్‌సీఏ సిబ్బందిలో ఒకరు చెప్పారు. పునరావాసంలో మానసికంగా దృఢంగా ఉండడంతోపాటు తాను కోలుకొంటాననే బలమైన నమ్మకంతో పంత్ సాధన చేశాడని తెలిపారు. 2022 డిసెంబరులో డెహ్రాడూన్ వెళ్తుండగా పంత్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే.

అర్ధరాత్రి అమ్మాయిల హాస్టల్‌లోకి ప్రవేశించి..

వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య సీరియస్
ఒలింపిక్స్ శిబిరం నుంచి గెంటివేత

స్టార్ లిఫ్టర్ అచింత నిర్వాకం



న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడల స్వర్ణ పతక విజేత అచింత షూలీ అనుచితంగా ప్రవర్తించాడు. పటియాలాలోని జాతీయ క్రీడా సంస్థ (ఎన్ఐఎస్) మహిళల హాస్టల్లోకి అతడు అర్ధరాత్రి ప్రవేశించి కలకలం సృష్టించాడు. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎల్ఎఫ్) అచింతపై వేటు వేసింది. పారిస్ ఒలింపిక్స్ సన్నాహక శిబిరం నుంచి అతడిని గెంటి వేసింది. 22 ఏళ్ల షూలీ గురువారం అర్ధరాత్రి మహిళల హాస్టల్లోకి ప్రవేశిస్తుండగా భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. అంతేకాదు.. ఈ ఘటనను సెక్యూరిటీ సిబ్బంది వీడియో కూడా తీశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన అచింత.. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల 73 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. 'ఇటువంటి క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించబోం. సన్నాహక శిబిరం నుంచి వెంటనే వెళ్లిపోవాలని అచింతను ఆదేశించాం' అని వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య అధికారి ఒకరు శనివారం వెల్లడించారు. అచింత సంఘటన గురించి భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) పటియాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీత్ కుమార్‌కు అధికారులు వెంటనే తెలియజేశారు. జరిగిన ఘటనపై వీడియో సాక్ష్యం ఉన్నందున..ఎలాంటి విచారణకు సాయ్ ఆదేశించలేదు. 'వీడియోను వినీత్ కుమార్‌తో పాటు ఢిల్లీలోని సాయ్ ప్రధాన కార్యాలయానికి పంపాం. దాంతో శిబిరం నుంచి అచింతను వెంటనే తొలగించాలని లిఫ్టింగ్ సమాఖ్యను సాయ్ ఆదేశించింది' అని సాయ్ వర్గాలు తెలిపాయి. సమాఖ్య ఆదేశంతో శుక్రవారమే అతడు శిబిరాన్ని వీడాడు. పటియాలలో పురుషులు, మహిళా అథ్లెట్లకు వేర్వేరుగా హాస్టళ్లున్నాయి.

'పారిస్' రేసు నుంచి అవుట్!

శిబిరం నుంచి గెంటివేత దరిమిలా..అచింతకు పారిస్ ఒలింపిక్స్ దారులు మూసుకుపోయాయి. విశ్వ క్రీడలకు క్వాలిఫయింగ్ టోర్నీ అయిన వరల్డ్ కప్ ఈనెలలో థాయ్‌లాండ్‌లో జరగనుంది. క్రమశిక్షణ చర్యల ఫలితంగా అతడు వరల్డ్ కప్ జట్టునుంచీ అవుటయ్యాడు. వాస్తవానికి పారిస్ ఒలింపిక్స్ అర్హత ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 27వ స్థానంలో ఉన్న షూలీ..కాంటినెంటల్ కోటాలో పారిస్ బెర్త్ దక్కించుకొనే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ కోటా దక్కినా, తాజా ఘటనతో అతడిని పారిస్ క్రీడలకు ఎంపిక చేయకపోవచ్చు.

ఎవరిదో కిరీటం?



రాత్రి 7.30 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్18లో

ఢిల్లీ X బెంగళూరు | డబ్ల్యూపీఎల్ ఫైనల్ నేడు

న్యూఢిల్లీ: వరుసగా రెండోసారి ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఈసారి ఎలాగైనా విజేతగా నిలవాలనే పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో ఆదివారం జరిగే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టైటిల్‌పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. గతేడాది జరిగిన తొలి సీజన్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో ఢిల్లీ 7 వికెట్లతో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకొంది. కానీ, ఈసారి మాత్రం మెగ్ లానింగ్ సారథ్యంలోకి క్యాపిటల్స్ నిలకడైన ప్రదర్శన చేసింది. లీగ్ దశలో ఆడిన ఎనిమిది మ్యాచుల్లో ఆరు గెలిచి మొత్తం 12 పాయింట్లతో టేబుల్ టాపర్ హోదాలో నేరుగా ఫైనల్‌కు చేరుకుంది. లానింగ్ ముందుండి నడిపిస్తుండగా.. ఆల్‌రౌండర్లు మరిజానె కాప్, జొనాసెన్, క్యాప్సీ జట్టు విజయాల్లో కీలకంగా మారారు. ఓపెనర్ షఫాలీ వర్మ నుంచి జట్టు మరో ధనాధన్ ఇన్నింగ్స్ ఆశిస్తుండగా.. మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్ వెన్నెముకగా నిలుస్తోంది. కోట్లా పిచ్ స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉండడంతో రాధా యాదవ్‌తోపాటు క్యాప్సీ, జొనాసెన్‌పై ఎక్కువ భారం పడనుంది.

జెయింట్ కిల్లర్‌గా..: మరోవైపు డిఫెండింగ్ చాంప్ ముంబైను ఎలిమినేట్ చేసి తొలిసారి టైటిల్ ఫైట్‌కు చేరిన బెంగళూరు.. ఇదే జోరులో కప్ కూడా సొంతం చేసుకోవాలనుకొంటోంది. చాలెంజర్స్ ఫైనల్ చేరిందంటే.. ఎలిస్ పెర్రీ ఆల్‌రౌండ్ నైపుణ్యం వల్లే అనడంలో సందేహం లేదు. ప్లేఆఫ్స్ చేరాలంటే తప్పనిసరిగా నెగ్గాల్సిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పెర్రీ 6 వికెట్లతో ముంబై పనిబట్టింది. ఇక, ఎలిమినేటర్‌లో ఎలిస్ (66) అర్ధ శతకంతో ముంబైకి ఎదురు నిలిచింది. అయితే, ఆమెకు కెప్టెన్ స్మృతి మంధాన, సోఫీ డివైన్, రిచా, మోలినెక్స్ నుంచి ఇంకొంత సహకారం అందాల్సి ఉంది. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన ఢిల్లీని నిలువరించాలంటే బౌలర్లు రేణుక, శ్రేయాంక, వేర్‌హమ్ తప్పక రాణించాలి. అంతిమ సమరంలో ఢిల్లీ ఫేవరెట్‌గా కనిపిస్తున్నా.. ఎలిమినేటర్‌లో బెంగళూరు పోరాడిన తీరు చూస్తే ఫైనల్ రసవత్తరంగా సాగే అవకాశాలున్నాయి. కాగా, ఈ రెండు ఫ్రాంచైజీల పురుషుల జట్లు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ సాధించలేదు. కానీ, మహిళల లీగ్ ద్వారా ఒక జట్టు కలైతే నెరవేరనుంది.

అన్ని మ్యాచ్‌లూ భారత్‌లోనే

ఐపీఎల్ రెండో దశ యూఏఈలో అన్న వార్తలు అబద్ధం

బీసీసీఐ కార్యదర్శి జై షా



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఐపీఎల్‌పై అనేక ఊహాగానాలు వెలువడుతున్నాయి. మెగా లీగ్ రెండో దశను యూఏఈలో నిర్వహిస్తారనే ప్రచారం నెట్టింట భారీగా జరుగుతోంది. అయితే, వీటిని బీసీసీఐ కార్యదర్శి జై షా తోసిపుచ్చాడు. 'లీగ్ మొత్తం భారత్‌లోనే జరుగుతుంది. మిగతా మ్యాచ్‌ల గురించి సమాలోచన చేస్తున్నాం. త్వరలోనే పూర్తిస్థాయి షెడ్యూల్‌ను విడుదల చేస్తామ'ని షా శనివారం మీడియాకు తెలిపాడు. కాగా, టోర్నీని ఎక్కడికీ తరలించే ప్రసక్తే లేదని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్ కూడా చెప్పాడు. రెండో దశను యూఏఈలో నిర్వహిస్తారంటూ వస్తున్న ఊహాగాలు నిరాధారమైనవన్నాడు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 7 వరకు జరిగే తొలి 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే బీసీసీఐ ప్రకటించింది. రెండో దశ మ్యాచ్‌ల వివరాలను ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడ్డాక ప్రకటిస్తామని బోర్డు ఇప్పటికే తెలిపింది. కాగా.. 2019లో సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇదే పరిస్థితి తలెత్తినా ఐపీఎల్ మొత్తాన్ని ఇక్కడే నిర్వహించారు. ఇప్పుడు కూడా అదే తరహాలోనే మెగా లీగ్‌ను జరిపే ప్రయత్నాల్లో బీసీసీఐ ఉన్నట్టు కనిపిస్తోంది.

మే 26న ఫైనల్: ఐపీఎల్ ఫైనల్ మే 26 జరిగే అవకాశాలున్నాయని కోల్‌కతా నైట్‌రైడర్స్ మెంటార్ గౌతమ్ గంభీర్ మాటలను బట్టి తెలుస్తోంది. టీమ్ మీటింగ్ సందర్భంగా జట్టు ఆటగాళ్లతో మాట్లాడుతూ.. 'మే 26న, మనం అక్కడ ఉండాలి' అని గంభీర్ అన్న వీడియోను ఫ్రాంచైజీ తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీంతో గౌతీ ఫైనల్ గురించే ఆ తేదీని ప్రస్తావించాడన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సీఎస్‌కేకు ఎదురు దెబ్బ

పేసర్ పథిరన ఐదు వారాలు ఐపీఎల్‌కు దూరం!



చెన్నై: ఐపీఎల్‌లో తమ తొలి మ్యాచ్‌కు వారం కూడా లేదు. ఈ నేపథ్యంలో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు గట్టి దెబ్బ తగిలింది. గాయం నుంచి కోలుకోని ఆ జట్టు స్టార్ పేసర్ పథిరన నాలుగు నుంచి ఐదు వారాలు టోర్నీకి దూరంగా ఉండనున్నట్టు సమాచారం. ఈనెల ఆరున సిల్హెట్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టీ20 సందర్భంగా పథిరనకు కండర గాయం అయింది. దాంతో ఆ మ్యాచ్ మధ్యలోనే వైదొలగిన శ్రీలంక పేసర్.. దానిని నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. గతసారి సీఎస్‌కే విజేతగా నిలవడంలో పథిరన కీలక భూమిక పోషించాడు. 12 మ్యాచుల్లో అతడు 19 వికెట్లు సాధించాడు. కాగా..ఈనెల 22న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో చెన్నై సూపర్ కింగ్స్ తన పోరును ఆరంభించనుంది.

బిజినెస్

దక్షిణాదిలో బీమాపై పెరిగిన అవగాహన

మ్యాక్స్‌లైఫ్ ఎండీ ప్రశాంత్ త్రిపాఠి

హైదరాబాద్: దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రజల్లో బీమా ప్రయోజనాలపై అవగాహన బాగా పెరిగింది. ప్రముఖ మార్కెటింగ్ డేటా అండ్ అనలిటిక్స్ కంపెనీ కాంటార్‌తో కలిసి తాము జరిపిన ఒక సర్వేలో ఈ విషయం తేలినట్టు మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ, సీఈఓ ప్రశాంత్ త్రిపాఠి తెలిపారు. దీనికి సంబంధించి ఇండియా ప్రొటెక్షన్ కోటియంట్ సర్వే 6.0 (ఐపీక్యూ6.0) పేరుతో రూపొందించిన నివేదిక వివరాలను ఆయన వివరించారు. దేశంలోని 25 నగరాల నుంచి 4,700 మందిని ఆన్‌లైన్‌లో సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. దేశవ్యాప్తంగా సగటున నూటికి 45 మందికి బీమా ప్రయోజనాలపై అవగాహన ఉంటే.. దక్షిణ భారత్‌లో ఇది 49గా ఉందన్నారు.

గత ఏడాది విడుదలైన ఐపీక్యూ 5.0తో పోలిస్తే అఖిల భారత స్థాయిలో మూడు శాతం, దక్షిణాదిలో రెండు శాతం పెరిగింది. బీమా ప్రయోజనాలపై దక్షిణాది రాష్ట్రాల్లో బెంగళూరు, హైదరాబాద్ ప్రజలకు ఉన్నం త అవగాహన మరెవరికీ లేదని త్రిపాఠి చెప్పారు. ఐపీక్యూ 6.0 సర్వే కోసం హైదరాబాద్ నుంచి పాల్గొన్న వారిలో 65 శాతం మంది హెల్త్ చెకప్స్ మీద, 61 శాతం మంది ఫిజికల్ ఫిట్‌నెస్ మీదా దృష్టి పెడుతున్నట్టు తేలినట్టు చెప్పారు.

జూన్ వరకు నియామకాల జోరు

నౌకరీ హైరింగ్ ఔట్‌లుక్ సర్వే

ముంబై: కంపెనీలు వైట్ కాలర్ ఉద్యోగుల నియామకాలు, రీప్లేస్‌మెంట్ల జోరు పెంచాయి. ఈ ఏడాది జూన్ నెలాఖరు వరకు ఈ జోరుకు ఢోకా ఉండదని 'నౌకరీ హైరింగ్ ఔట్‌లుక్ సర్వే' తెలిపింది. నౌకరీ డాట్‌కామ్ దేశంలోని దాదాపు 1,200 నియామక సంస్థల సీఈఓలతో మాట్లాడి ఈ సర్వే రూపొందించింది. ఈ సర్వేలో పాల్గొన్న నియామక సేవల సంస్థ సీఈఓల్లో 92 శాతం మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నియామకాల మార్కెట్ సాధారణ స్థితికి చేరి స్థిరంగా ఉందని నౌకరీ డాట్‌కామ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ చెప్పారు. ప్రస్తుతం కొన్ని సమస్యల్లో ఉన్నా ఐటీ ఉద్యోగ నియామకాలూ పెరుగుతున్నాయి. అయితే ఈ నియామకాలు ఐటీ కంపెనీల్లో కంటే ఐటీయేతర కంపెనీల ఐటీ విభాగాల్లో పెరగడం విశేషం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ		విజయవాడ	420
హైదరాబాద్	400	విశాఖపట్నం	425
17వ తేదీ		వరంగల్	402
చిత్తూరు	463		
గోదావరి	420	దజను గుడ్లు రూ.72	


ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	గోదావరి	106
వరంగల్	104	విజయవాడ	106
కరీంనగర్	104	గుంటూరు	110
మహబూబ్‌నగర్	104	ఒంగోలు	110
కర్నూలు	104	చిత్తూరు	121
విశాఖపట్నం	103		

2034 నాటికి రూ.108 లక్షల కోట్లు

భారత రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై క్రెడాయ్ అంచనా



న్యూఢిల్లీ: వచ్చే పదేళ్లలో (20234 నాటికి) భారత స్థిరాస్తి రంగ మార్కెట్ పరిమాణం 1.3 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.108 లక్షల కోట్లు) స్థాయికి పెరగవచ్చని ది కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) అంచనా వేసింది. 2047 నాటికి 5.17 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.430 లక్షల కోట్లు) ఎగబాకవచ్చని 'వికసిత భారత్ నిర్మాణం- భారత్‌లో స్థిరాస్తి రంగ పరివర్తన పాత్ర' పేరుతో శనివారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ సైజు రూ.24 లక్షల కోట్ల (30,000 కోట్ల డాలర్లు) స్థాయిలో ఉంది. అందులో నివాస, వాణిజ్య ప్రాపర్టీ విభాగాల వాటా నిష్పత్తి 80:20 గా ఉందని రిపోర్టు వెల్లడించింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- మున్ముందు సంవత్సరాల్లో భారత ఆర్థిక వ్యవస్థపై స్థిరాస్తి రంగం గణనీయ ప్రభావం చూపనుంది. 2034 నాటికి భారత జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా 13.8 శాతానికి చేరుకోనుంది. 2047 నాటికి 17.5 శాతానికి పుంజుకోవచ్చని అంచనా.
- గృహాల ప్రాజెక్టుల విభాగంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 61 శాతం ఇళ్ల ధర రూ.45 లక్షల పైమాటే. సగటు గృహ విస్తీర్ణం కూడా ఏటా 11 శాతం చొప్పున పెరుగుతోంది.
- 2030 నాటికి దేశంలో 7 కోట్ల అదనపు గృహ యూనిట్ల డిమాండ్ నెలకొనవచ్చని అంచనా. అప్పటికల్లా రూ.45 లక్షలకు పైగా ఖరీదు చేసే గృహాల డిమాండ్ వాటా 87.4 శాతానికి పెరగవచ్చని అంచనా.
- భారత రియల్ ఎస్టేట్ రంగం మొత్తం ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఉద్యోగాల కల్పన, ప్రభుత్వం, బ్యాంకింగ్ ఆదాయాలు, తలసరి ఆదాయం వృద్ధిపై గణనీయ ప్రభావం చూపనుంది.
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించే దిశగా సాగుతున్న భారత ప్రయాణంతో పాటు జీడీపీ వేగవంత వృద్ధిలో స్థిరాస్తి రంగం కీలక పాత్ర పోషించనుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఆర్ ఇరానీ అన్నారు.
- వికసిత్ భారత్ సాధనలో రియల్టీ రంగం వృద్ధికి కేంద్ర బిందువు కానుందని క్రెడాయ్ చైర్మన్ మనోజ్ గౌర్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ప్రతికూలతల్లోనూ భారత్ గణనీయ వృద్ధిని నమోదు చేస్తోందని.. మన ఆర్థిక వ్యవస్థతో పాటు ఆయా రంగాల చురుకైన పనితీరుకు ఇదే నిదర్శనమని క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ శేఖర్ జీ పటేల్ పేర్కొన్నారు.

లంచం ఆరోపణలపై అమెరికాలో అదానీపై దర్యాప్తు



అజూర్ పవర్ గ్లోబల్ పైనా కూడా..

న్యూఢిల్లీ: లంచం ఆరోపణలకు సంబంధించి భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో పాటు అదానీ గ్రూప్‌పై అమెరికాలో దర్యాప్తు జరుగుతున్నట్లు బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది. అదానీ గ్రూప్‌నకు చెందిన ఓ సంస్థ లేదా ఆ సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తులు (గౌతమ్ అదానీ సహా) ఓ ఎనర్జీ ప్రాజెక్టు విషయంలో వారికి అనుకూలంగా వ్యవహరించేందుకు అధికారులకు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతున్నట్లు రిపోర్టు పేర్కొంది. యూఎస్ అటార్నీ ఆఫీస్ ఫర్ ది ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్‌తో పాటు వాషింగ్టన్‌లోని జస్టిస్ డిపార్ట్‌మెంట్స్ ఫ్రాడ్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ దర్యాప్తు సాగుతున్నట్లు తెలిసింది. అదానీ గ్రూప్‌తో పాటు దేశీయ పునరుత్పాదక ఇంధన సంస్థ అజూర్ పవర్ గ్లోబల్ లిమిటెడ్‌పైనా దర్యాప్తు జరుగుతోంది. అయితే, ఈ విషయంపై తమకెలాంటి సమాచారం లేదని అదానీ గ్రూప్ అంటోంది. బ్రూక్లిన్, వాషింగ్టన్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ల ప్రతినిధులతో పాటు అజూర్ పవర్ కూడా ఈ విషయంపై స్పందించేందుకు నిరాకరించింది.

సాధారణంగా ఏదైనా ఆరోపణలపై జరిగే ప్రాథమిక దర్యాప్తు కోర్టులో కేసు విచారణకు దారితీయాలనేం లేదు. అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడటంతో పాటు అక్రమ విధానాల్లో కంపెనీల షేర్ల ధరను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందని అమెరికన్ షార్ట్ సెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ గత ఏడాది జనవరి 24న విడుదల చేసిన నివేదికలో ఆరోపించింది. దాంతో అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. నివేదిక విడుదలైన నెల రోజుల్లోనే గ్రూప్ మార్కెట్ విలువ సగానికి పతనమైంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ)ను సైతం రద్దు చేసుకోవాల్సి వచ్చింది. అంతేకాదు, ఈ వివాదం రాజకీయంగానూ చర్చనీయాంశమైంది. దాంతో, ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు సుప్రీంకోర్టు స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసింది. అంతేకాదు, క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీని సైతం దర్యాప్తు చేయాలని ఆదేశించింది. కానీ, అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల్లో ఏ ఒక్కటీ ఇప్పటివరకు రుజువు కాలేదు.

నిర్మాణ హక్కుల బదిలీ అంటే..?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీకి సంబంధించి క్లిష్టమైన అంశాల్లో నిర్మాణ హక్కుల బదిలీ ఒకటి. ఈ లావాదేవీ గతంలో అంటే వ్యాట్ లేదా సర్వీస్ ట్యాక్స్ పరిధిలో లేదు కాబట్టి జీఎస్‌టీలో దీనికి సంబంధించి కొంత గందరగోళం ఉంది. దీనిని సులభంగా అర్థం చేసుకోవటానికి నిర్మాణ హక్కుల బదిలీ అంటే ఏమిటి? దీని మీద ఎంత పన్ను చెల్లించాలి? పన్ను చెల్లించాల్సిన బాధ్యత ఎవరిది? వంటి విషయాలు మీకోసం.

ఏదేనీ ఒక అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతుందంటే.. ఆ నిర్మాణం జరిగే స్థలం బిల్డర్ స్వంత స్థలం అయ్యి ఉండవచ్చు లేదా స్థల యజమానితో బిల్డర్ అగ్రిమెంట్ కుదుర్చుకుని ఉండవచ్చు. దీన్ని సాధారణ పరిభాషలో చెప్పాలంటే జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ అంటారు. అంటే బిల్డర్, స్థల యజమానులు వేర్వేరు అయినప్పుడు.. ఆ స్థలంలో బిల్డర్ నిర్మాణం చేపట్టటానికి, నిర్మాణం జరిగిన ఫ్లాట్లు బిల్డర్ అమ్ముకోవటానికి వీలు కల్పిస్తూ స్థల యజమాని ఆ బిల్డర్‌కు తగిన హక్కులు బదిలీ చేస్తారు. దీనికి ప్రతిగా బిల్డర్ ఆ అపార్ట్‌మెంట్‌లోని కొన్ని ఫ్లాట్స్ ఆ స్థల యజమానికి బదిలీ చేసే విధంగా తీర్మానం చేసుకుంటారు. ఇలా స్థల యజమాని బిల్డర్‌కు ఇచ్చే హక్కును డెవలప్‌మెంట్ రైట్ అంటారు. ఈ డెవలప్‌మెంట్ రైట్‌ను స్థల యజమాని బదిలీ చేయటం అంటే ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్ అనేది జీఎస్‌టీ చట్టంలో పన్ను వర్తించే సేవ కిందకు వస్తుంది. అలాగే కొన్ని షరతులతో చెల్లించాల్సిన పన్ను నుంచి మినహాయింపు కూడా ఇవ్వటం జరిగింది. అంటే పన్ను మినహాయింపు కోసం ఇచ్చిన షరతులు పాటించకపోతే బదిలీ చేసిన హక్కులకు సంబంధించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ముందుగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్ మీద పన్ను చెల్లించాల్సిన బాధ్యతను 2019 ఏప్రిల్ 1 నుంచి స్థల యజమాని నుంచి బిల్డర్‌కు బదిలీ చేశారు. అంటే బిల్డర్.. రివర్స్ చార్జ్ మెకానిజమ్ కింద స్థల యజమాని బదులు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే పైన చెప్పినట్లు దీనికి పన్ను మినహాయింపు పొందటానికి ఒక నిబంధన ఉంది. బిల్డర్ తన కింద వచ్చిన ఫ్లాట్స్ అన్నిటినీ కంప్లీషన్ సర్టిఫికెట్ రావటానికి పూర్వమే అమ్మి ఉండాలి. అలా అమ్మిన పక్షంలో బిల్డర్ డెవలప్‌మెంట్ రైట్‌కు సంబంధించి ఎలాంటి పన్ను కట్టాల్సిన అవసరం లేదు. లేదంటే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి అమ్ముడుపోకుండా మిగిలి ఉన్న ఫ్లాట్స్‌ను బట్టి దామాషా పద్ధతిలో డెవలప్‌మెంట్ రైట్స్‌కు సంబంధించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే పన్ను కట్టాల్సి వస్తే డెవలప్‌మెంట్ రైట్‌కు ఎంత విలువ లెక్కించాలి, పన్ను శాతం ఎంతో చూద్దాం.

ఉదాహరణకు ఒక బిల్డర్, స్థల యజమాని అపార్ట్‌మెంట్ నిర్మాణానికి గాను అగ్రిమెంట్ చేసుకున్నారు. మొత్తం ఒక లక్ష చదరపు అడుగుల కార్పెట్ ఏరియా వచ్చే విధంగా 100 ఫ్లాట్స్ కట్టేటట్లు, స్థల యజమాని బదిలీ చేసే డెవలప్‌మెంట్ రైట్స్‌కు ప్రతిగా బిల్డర్ 40,000 చదరపు అడుగులు లేదా 40 ఫ్లాట్స్ స్థల యజమానికి ఇచ్చేటట్లు, మిగతా 60,000 చదరపు అడుగులు లేదా 60 ఫ్లాట్స్ బిల్డర్ ఉంచుకునే విధంగా ఒప్పందం జరిగింది. అంటే దీని ప్రకారం డెవలప్‌మెంట్ రైట్స్‌కు సంబంధించిన విలువ 40 ఫ్లాట్స్ కాబట్టి, చట్ట ప్రకారం ఈ 40 ఫ్లాట్స్ విలువ మీద బిల్డర్ రివర్స్ చార్జ్‌లో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ విలువను లెక్కించటానికి గాను అగ్రిమెంట్ జరిగిన తర్వాత ముందుగా అమ్ముడుపోయే ఫ్లాట్ విలువను ఆధారం చేసుకోవాలి. ఉదాహరణకు బిల్డర్ మొదటి ఫ్లాట్‌ను సాధారణ కొనుగోలుదారునికి చదరపు అడుగు రూ.5,000కు విక్రయించాడనుకుందాం. ఈ లెక్కన స్థల యజమాని వాటా 40 వేల చదరపు అడుగుల విలువ రూ.20 కోట్లు అవుతుంది. దీనిపై 18 శాతం చొప్పున అంటే రూ.3.6 కోట్లు పన్ను రూపేణా బిల్డర్ ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే ఇందుకు మినహాయింపు పొందాలంటే.. బిల్డర్ తన వాటాలో వచ్చిన 60 వేల చదరపు అడుగుల కంప్లీషన్ సర్టిఫికెట్ రావటానికి పూర్వమే అమ్మాలి. అలాకాకుండా బిల్డర్ వాటాకు వచ్చిన 60 వేల చదరపు అడుగుల్లో 12 వేల చదరపు అడుగులు కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి మిగిలి ఉందని అనుకుందాం. అంటే తన వాటాలో 20 శాతం మిగిలిపోయింది కాబట్టి తాను కట్టాల్సిన రూ.3.6 కోట్లలో 20 శాతం అంటే రూ.72 లక్షలు పన్ను కింద చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ బిల్డర్‌కు మరల కొంత మినహాయింపు ఇచ్చారు. కంప్లీషన్ సర్టిఫికెట్ రావటానికి ముందు.. చివరగా అమ్మిన ఫ్లాట్ విలువ ప్రకారం మిగిలిపోయిన 12 వేల చదరపు అడుగులు లెక్కించి ఆ విలువపై 5 శాతం పన్ను లెక్కించాలి. ఈ రెండింటిలో ఏది తక్కువైతే అది చెల్లించవచ్చు.

ఉదాహరణకు కంప్లీషన్ సర్టిఫికెట్ డిసెంబరు 31న వచ్చిందనుకుందాం. దానికంటే ముందు నవంబరులో బిల్డర్ తన వాటాలోని ఒక ఫ్లాట్‌ను సాధారణ కొనుగోలుదారునికి చదరపు అడుగు రూ.7,000 చొప్పున అమ్మాడనుకుందాం. దీని ప్రకారం కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చినప్పుడు మిగిలిపోయిన 12 వేల చదరపు అడుగుల విలువను లెక్కించి దాని మీద 5 శాతాన్ని పన్ను కింద లెక్కించాలి. ఈ విధంగా చూస్తే కట్టాల్సిన పన్ను రూ.42 లక్షలు అవుతుంది. అప్పుడు బిల్డర్ పైన చెప్పిన రూ.72 లక్షలకు బదులు రూ.42 లక్షలు కడితే సరిపోతుంది. అంటే దామాషా పద్ధతిలో 18 శాతం లేదా మిగిలిన ఫ్లాట్స్ విలువలో 5 శాతం, ఏది తక్కువ అయితే అది కట్టాల్సి ఉంటుంది. అంటే డెవలప్‌మెంట్ రైట్స్‌కు సంబంధించి పన్ను చెల్లించటానికి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చేంత వరకు సమయం ఉంటుంది. కాబట్టి సర్టిఫికెట్ వచ్చిన తర్వాత అమ్ముడుకాకుండా మిగిలిన ఫ్లాట్స్ ఏమైనా ఉంటే పైన చెప్పినట్లు పన్ను మదింపు చేసి ప్రభుత్వానికి బిల్డర్ చెల్లించాల్సి ఉంటుంది.

పైన చెప్పిన నియమ నిబంధనలు 2019 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత జరిగే జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్‌కు మాత్రమే వర్తిస్తుంది. అది కూడా రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్స్‌కు మాత్రమే వర్తిస్తాయి. అలాగే దీనితో సంబంధం లేకుండా బిల్డర్, స్థల యజమానికి బదిలీ చేసే 40 ఫ్లాట్స్‌కు బిల్డర్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని స్థల యజమాని కొన్ని నియమాలకు లోబడి క్రెడిట్ తీసుకోవచ్చు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 17-3-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ



భద్రత కోసం.. బాగు కోసం..



భవిత కోసం..

భారత చైతన్య యువజన పార్టీ

రైతు చైతన్యం - యువజన పోరాటం



- ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పూర్తిగా ఉచిత విద్య, వారంలో అయిదు రోజులే బడి
- ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందరికీ ఉచిత వైద్యం
- రాష్ట్రంలోని ప్రతి రైతుకి ఒక ఆవు
- ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాల సాగు భూమి
- యువతకు ఉద్యోగ, ఉపాధి భవిష్యత్తు గ్యారెంటీ
- దేవాదాయ శాఖ పూర్తిగా రద్దు, అన్ని దేవాలయాల్లో టోల్ గేట్లు రద్దుచేసి తిరుమల సహా అన్ని ప్రధాన దేవాలయాల్లో మీరాశి వ్యవస్థ పునరుద్ధరణ
- తిరుపతి నుంచి తిరుమలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, తిరుమల సహా రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో VIP బ్రేక్ దర్శనం రద్దు చేసి.. ముఖ్యమంత్రి నుంచి సాధారణ పౌరుడు వరకు అందరికీ ఒకే వరుసలో దర్శనం
- విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 44% రిజర్వేషన్లు
- వికలాంగులకు 5111/-, హిజ్రాలకు 2555/- పింఛను
- విద్యా, ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు
- సిపిఎస్ రద్దు, ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో అయిదు రోజులే పని దినాలు

రైతుకి ఓటేద్దాం.. భవితకు బాటేద్దాం..

SCAN FOR FULL MANIFESTO

FOR FULL MANIFESTO

Link: https://bcyparty.org/manifesto.php

ఏం చేశారు పదేళ్లు - పది లక్షల కోట్ల దోపిడి తప్ప!

సంప్రదాయ రాజకీయానికి స్వస్తి.. ప్రజా రాజకీయానికి పునాది.. సామాన్యుడే ప్రజా ప్రతినిధి..

జనాభాలో 80% ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల చేతికి అధికారంతోనే ఆంధ్ర ప్రదేశ్ లో అసలైన సామాజిక సాధికారత, అసలైన అభివృద్ధి, అసలైన పేదరిక నిర్మూలన సాధ్యం

బీసీ యువజన పార్టీకి వేసే ప్రతీ ఓటు.. రాష్ట్ర శ్రేయస్సు కోసం, సామాన్య పాలకుల కోసం, ప్రజా జవాబుదారీ కోసం, రాష్ట్రంలో రాజకీయ మార్పు కోసం!

Party Contact : 8886312345, 6305973496, 6281942310

దిక్సూచి
DIKSUCHI

ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ సెట్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాఫూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ జూనియర్ గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థ నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ సెట్) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

తెలంగాణ బీసీ గురుకులాల వివరాలు: రాష్ట్రంలోని 261 బీసీ జూనియర్ గురుకుల కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. వీటిలో బాలురకు కేటాయించిన 130 కళాశాలల్లో మొత్తం 11360 సీట్లు; బాలికలకు కేటాయించిన 127 కళాశాలల్లో మొత్తం 10560 సీట్లు ఉన్నాయి. నాలుగు 'కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ)' గురుకులాలు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లతోపాటు ఒకేషనల్ కోర్సులు - అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ప్రీ స్కూల్ టీచర్ ట్రెయినింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులకు ఐఐటీ, నీట్, ఎంసెట్, సీఏ/సీపీటీ, క్లాట్ కోచింగ్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డిజిటల్ క్లాస్‌లు ఉంటాయి.

సెట్ వివరాలు: దీనిని 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఒకేషనల్ కోర్సులు సహా అన్ని గ్రూప్‌ల అభ్యర్థులకు ఇంగ్లీష్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ అభ్యర్థులకు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ అభ్యర్థులకు బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్; ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ అభ్యర్థులకు మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒకేషనల్ కోర్సుల్లో సీజీఏ, పీఎస్‌టీటీ, సీజీటీ కోర్సులకు మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ నుంచి; ఏసీపీ, టీ అండ్ హెచ్ కోర్సులకు బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ నుంచి; ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, పీటీ కోర్సులకు బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉంటుంది. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. గ్రూప్ కోర్సులకు జిల్లాస్థాయి మెరిట్ ప్రకారం, ఒకేషనల్ కోర్సులకు రాష్ట్ర స్థాయి మెరిట్ ప్రకారం ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- **సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 28
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in



నోటిఫికేషన్స్

ఏపీ ఈసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

అర్హత: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (టీఎస్/ఏపీ) నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఫార్మసీ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ ఈసెట్ 2024 వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200.

- ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం(సివిల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కెమికల్/ మెటలర్జికల్/మైనింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- బీఎస్సీ(మేథమెటిక్స్) అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 100, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాగ్నసీ, ఫార్మకాలజీ అంశాలనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; బీసీ అభ్యర్థులకు రూ.550; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **ఏపీ ఈసెట్ 2024 తేదీ:** మే 8

ఏయూ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏయూఈఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీటెక్ (సెల్ఫ్ సపోర్ట్ మోడ్) డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన తరవాత మరో రెండేళ్లు చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొత్తం 510 సీట్లు ఉన్నాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్ 360, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ 60, మెకానికల్ 30, సివిల్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

ఏయూఈఈటీ 2024 వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. మేథమెటిక్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 24
- **ఏయూఈఈటీ 2024 తేదీ:** మే 5
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cza15Pvలో చదవండి.



కష్టమైనా ఇష్టంతో చేశా

నటి అనుశ్రీ

బాబీ సింహా, మకరంద్ దేశ్ పాండే, అనుశ్రీ ప్రధాన పాత్రల్లో యాట సత్యనారాయణ దర్శకత్వంలో, గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన చిత్రం 'రజాకార్'. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో అనుశ్రీ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'రజాకార్' ఈ నేల కథ. సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులు చాలా ఎమోషనల్ అవుతున్నారు. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకుల కళ్లలో దేశభక్తి కనిపించింది. వందేమాతరం, భారత్ మాతాకీ జై అనే నినాదాలు థియేటర్స్‌లో మార్మోగడం చూసి, ఇలాంటి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా అనిపించింది. ఈ చిత్రంలో నిజాం భార్యగా కనిపించా. కథ చెప్పినపుడు ఈ పాత్ర పోషించడం సవాల్‌గా అనిపించింది. ఈ పాత్ర కోసం మూడు నెలలు పాటు మెథడ్ ట్రైనింగ్ కూడా తీసుకున్నా. 'రజాకార్'లో నటించడం చాలా గొప్ప అనుభవం. చాలా మంది ప్రముఖ నటులతో కలిసిపని చేసే అవకాశం దక్కింది. బాబీ సింహ, రాజ్ అర్జున్‌తో పాటు మకరంద్ దేశ్ పాండే లాంటి అద్భుతమైన యాక్టర్స్ తో స్క్రీన్ పంచుకోవడం గొప్ప అనుభూతి. మోడలింగ్ నుంచి కెరీర్ మొదలుపెట్టాను. 2018లో చత్తీస్‌ఘడ్ నుంచి మిస్ ఇండియా పోటీల్లో కూడా పాల్గొన్నాను" అని చెప్పారు.

ఫ్యామిలీ స్టార్ ప్యాకప్



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారంతో ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో హీరోయిన్లు కలసి దిగిన ఫొటోను మేకర్స్ విడుదల చేశారు.

వేసవిలో గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి



చీకటి ప్రపంచంలో సామాన్యుడి నుంచి అసామాన్యుడిగా ఎదిగిన ఓ వ్యక్తి కథతో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. 1960ల నాటి గోదావరి జిల్లాల నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో విశ్వక్‌సేన్ హీరోగా నటించారు. నేహా శెట్టి కథానాయికగా నటించగా, అంజలి మరో కీలక పాత్ర పోషించారు. మే 17న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్‌రాజా, రచన, దర్శకత్వం: కృష్ణ చైతన్య.

అందరికీ కనెక్ట్ అవుతుంది



క్రియేటివ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ సమర్పణలో తెరకెక్కుతోన్న చిత్రం 'తులసివనం'. అక్షయ్, ఐశ్వర్య, వెంకటేష్ కాకమాను, విష్ణు ప్రధాన పాత్రల్లో నటించారు. అనిల్ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ ప్రముఖ ఓటీటీ వేదికగా మార్చి 21 నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా శనివారం చిత్ర బృందం ట్రైలర్‌ను లాంచ్ చేసింది. ఈ సందర్భంగా డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ "సినిమా చిత్రీకరణ విషయంలో క్లారిటీ చాలా ముఖ్యం. 'తులసివనం'లో ఆ క్లారిటీ వుంటుంది" అని అన్నారు. డైరెక్టర్ అనిల్ రెడ్డి మాట్లాడుతూ "ఇది అందరూ రిలేట్ చేసుకునే కథ" అని అన్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: స్వాగత్ రెడ్డి, నీలిత పైడిపల్లి. సంగీతం: స్మరన్.

శ్రీశాంత్ విలన్‌గా యమధీర



కన్నడ ఇండస్ట్రీలోని ప్రముఖ నటుల్లో ఒకరైన కోమల్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'యమధీర'. ఇండియన్ క్రికెటర్ శ్రీశాంత్ ఇందులో నెగెటివ్ రోల్ పోషిస్తున్నారు. శంకర్ ఆర్ దర్శకత్వం వహిస్తున్నారు. వేదాల శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. నాగబాబు, ఆలీ, సత్య ప్రకాష్, మధు సూదన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను ప్రముఖ నటుడు, ప్రొడ్యూసర్ అశోక్ కుమార్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ గారు మాట్లాడుతూ "శ్రీ మందిరం ప్రొడక్షన్స్‌లో తొలి చిత్రంగా వస్తున్న 'యమధీర' చాలా బాగా ఆడాలి. అలాగే మరెన్నో చిత్రాలు శ్రీ మందిరం ప్రొడక్షన్స్‌లో రావాలి. క్రికెటర్ శ్రీశాంత్ ఫాస్ట్ బౌలర్‌గా మైదానంలో చూపే దూకుడు ప్రతినాయకుడి పాత్రలో చూపించే అవకాశం ఉంది" అని అన్నారు. ప్రొడ్యూసర్ వేదాల శ్రీనివాస్ మాట్లాడుతూ "సినిమాల మీద ప్యాషన్ తో శ్రీమందిరం ప్రొడక్షన్స్ స్టార్ట్ చేశాను. ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు:వరుణ్ ఉన్ని

హే హలో.. నమస్తే!



తొలిసారిగా పతంగుల పోటీతో వస్తున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్ 'పతంగ్'. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మిస్తున్నారు, ప్రణీత్ ప్రతిపాటి దర్శకుడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులోని ' హే హలో నమస్తే' లిరికల్ వీడియోను విడుదల చేశారు. దీనికి మంచి స్పందన వస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో వంశీ పూజిత్ మాట్లాడుతూ 'అందరం కొత్తవాళ్లం నటించిన సినిమా ఇది. జోస్ జిమ్మి స్వరపరిచిన ఈ పాటకు రెస్పాన్స్ బాగుంది' అన్నారు. ఈ సినిమాకు కథే హీరో అని మరో కథానాయకుడు ప్రణవ్ కౌశిక్ చెప్పారు. గీత రచయిత శ్రీమణి మాట్లాడుతూ 'అందరం కలసి చేసిన కొత్త ప్రయత్నం ఇది. మా అందరికీ పేరు తెచ్చే సినిమా అవుతుంది' అని తెలిపారు. తన ప్రతిభను నిరూపించుకోవడానికి ఈ సినిమా ఒక మంచి అవకాశం అన్నారు సంగీత దర్శకుడు జోస్ జిమ్మి.

లవ్‌గురుగా విజయ్ ఆంటోనీ

తమిళ నటుడు విజయ్ ఆంటోనీ తొలిసారిగా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ జానర్‌లో నటిస్తున్న సినిమా 'లవ్‌గురు'. మృణాళిని రవి కథానాయిక. వినాయక్ వైద్యనాథన్ దర్శకుడు, రంజాన్ సందర్భంగా ఏప్రిల్ 11న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ 'అమ్మాయిలను హ్యాండిల్ చేయడం అబ్బాయిలకు పెద్ద సమస్య. ఈ సినిమాలో నేను లవ్‌గురుగా కొన్ని టిప్స్ చెబుతుంటాను. అలాగే



నేను ప్రేమించిన యువతితో ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించానన్నది వినోదభరితంగా చూపించాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో 500కి పైగా థియేటర్లలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. 'బిచ్చగాడు' చిత్రం తర్వాత విజయ్‌కి అంత పేరు తెచ్చే సినిమా ఇదని దర్శకుడు వినాయక్ చెప్పారు. హీరోయిన్ మృణాళిని మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను లీల అనే పాత్ర పోషించాను. అందులో పర్‌ఫెక్ట్‌గా నటించడం కోసం కలైరాణి దగ్గర ట్రైనింగ్ తీసుకున్నాను' అన్నారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/31xjzs6 లో చదవండి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 17-3-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

అమ్మో.. అన్ని రోజులా?

59 రోజుల షెడ్యూల్‌తో అభ్యర్థులు అవాక్కు!

మే 13 వరకూ కార్యకర్తలను పోషించాల్సిందే

నాలుగో విడత పోలింగ్‌తో నాయకుల్లో ఆందోళన

రోజుకు రూ.5 లక్షల నుంచి 25 లక్షల ఖర్చు

ఇప్పుడు ఎన్ని కోట్లయినా చాలవేమోనని ఆందోళన

3





నోటిఫికేషన్	నామినేషన్ల గడువు	పరిశీలన	ఉపసంహరణ	పోలింగ్	ఓట్ల లెక్కింపు	దేశంలో ఓటర్లు
ఏప్రిల్ 18	ఏప్రిల్ 25	ఏప్రిల్ 26	ఏప్రిల్ 29	మే 13	జూన్ 4	97.89 కోట్లు

మోగింది భేరి



మే 13న రాష్ట్రంలో ఎన్నికలు

తెలంగాణలో లోక్‌సభకూ అదే రోజు

నడి వేసవిలో నాలుగో దశలో ఇరు రాష్ట్రాల్లో పోలింగ్

అటు విపక్షాలు, ఇటు ప్రజలూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎన్నికల షెడ్యూలు వచ్చేసింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు యుద్ధ భేరీ మోగింది. 2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే... ఈసారి వారం ఆలస్యంగా, శనివారం ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించింది. 2019లో తొలి విడతలో, ఏప్రిల్ 11వ తేదీనే ఏపీలో పోలింగ్ ముగిసింది. ఈసారి మాత్రం నాలుగో విడతలో... మే 13వ తేదీన పోలింగ్ జరగనుంది. దేశవ్యాప్తంగా జరిగే లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటే... జూన్ 4వ తేదీన ప్రజా తీర్పు వెల్లడి కానుంది.

10 11

ఇక ఫామ్-7, 8 దరఖాస్తులకు నో చాన్స్!

నామినేషన్ల తేదీకి 10 రోజుల ముందు వరకు కొత్త ఓటు నమోదుకు అవకాశం

రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య	4,09,37,352
మొత్తం ఎన్ని పోలింగ్ స్టేషన్లు	46,165
ఎంత మంది ఓటర్లకు ఓ పోలింగ్ స్టేషన్	887
ఎన్నికల విధుల్లో ఎందరు సిబ్బంది	3,82,218
బందోబస్తుకు ఎందరు పోలీసులు	2,18,515

హోరాహోరీ!

హైటెన్షన్ ఎన్నికలకు రెడీ.. 'అధికార' అరాచకాలపై యుద్ధం

జట్టుగా టీడీపీ, జనసేన, బీజేపీ.. ఒంటరిగా అధికారపక్షం వైసీపీ

'అభివృద్ధి-సంక్షేమం' టీడీపీ మంత్రం.. 'నొక్కుడు'పైనే వైసీపీ నమ్మకం

జాబితా విడుదల చేసిన జగన్.. కూటమి అభ్యర్థులు దాదాపు ఖరారు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రతి ఐదేళ్లకూ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. కానీ... ఈసారి జరుగుతున్నది 'హైటెన్షన్ ఎలెక్షన్'గా విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన కేసులు, కక్షలతో సాగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రీ ఈ తరహా పాలన సాగించలేదు. దీంతో... కార్యకర్త నుంచి అధినేత దాకా విపక్ష టీడీపీలో కసిగా పోరాడేందుకు సిద్ధమయ్యారు. షెడ్యూలు

మిగతా 10వ పేజీలో...

ఎన్నికల విధుల్లో టీచర్లు

వారు లేకుండా ఎన్నికలా?

ప్రభుత్వోద్యోగుల్లో 60 శాతం వారే

సచివాలయ ఉద్యోగులు ఇంకు పెట్టే విధులకే

వలంటీర్లు ప్రచారంలో పాల్గొనరాదు: సీఈవో

7 దశల్లో సార్వత్రికం

ఏప్రిల్ 19 నుంచి జూన్ 1దాకా లోక్‌సభకు ఎన్నికలు

జూన్ 4న దేశవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు

ఏపీ సహా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకూ

ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ

తక్షణమే నియమావళి అమల్లోకి

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి దగ్గరే ఓటు

లోక్‌సభ కాగానే కశ్మీరు అసెంబ్లీ ఎన్నికలు

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమరానికి భేరీ మోగింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల పర్వానికి తెరలేచింది. లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిసా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు ముహూర్తం కుదిరింది. ఎన్నికల షెడ్యూల్‌ను

మిగతా 11వ పేజీలో...



ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా సీఈసీ, కమిషనర్లు

ఎన్నికలకు మేం సిద్ధం

పదేళ్లలో దేశాన్ని మలుపు తిప్పాం: మోదీ ట్వీట్

ఇదే చివరి అవకాశం

నియంతృత్వం బారి నుంచి దేశాన్ని కాపాడుకోవాలి: ఖర్గే

లోక్‌సభకు ఏ దశలో ఎన్ని?

దశ	తేదీ	స్థానాలు
తొలిదశ	ఏప్రిల్ 19	102 స్థానాలు
2వ దశ	ఏప్రిల్ 26	89 స్థానాలు
3వ దశ	మే 7	94 స్థానాలు
4వ దశ	మే 13	96 స్థానాలు
5వ దశ	మే 20	49 స్థానాలు
6వ దశ	మే 25	57 స్థానాలు
7వ దశ	జూన్ 1	57 స్థానాలు

అంతలో ఎంత మార్పు?



ఆశకు అంతుండాలి. డబ్బు సంపాదనకు అలవాటు పడిన రాజకీయ నాయకులు, అధికారులను.. సమాజం కూడా ఒక స్థాయి వరకే మన్నిస్తుంది. అత్యాశకు పోయినప్పుడే ఇలాంటి తిప్పలు వస్తాయి. ఇప్పుడు కవిత విషయంలో కూడా జరుగుతున్నది ఇదే.

పదేళ్లపాటు తండ్రి కేసీఆర్ ఏకఛత్రాధిపత్యంగా పాలించిన తెలంగాణ రాష్ట్రంలో సంపాదించుకోవడానికి అవకాశాలే లేనట్టుగా, సంపాదించుకున్నది చాలదు అన్నట్టుగా కవిత ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో లిక్కర్ వ్యాపారంలోకి కూడా చొరబడ్డారు. ఫలితమే ఈ అరెస్ట్.

ఈడీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే కవితకు న్యాయస్థానాలలో ఉపశమనం లభించకుండా శుక్రవారం నాడు అరెస్టు చేశారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు గానీ తాము అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో మరచిపోతే ఎలా? ఒక్కగానొక్క కూతురు పెళ్లి ఘనంగా నిర్వహించుకొనే అవకాశం రేవంత్‌కు ఇవ్వలేదే? అందుకే కర్మ మనల్ని వదలదని అంటారు.

ఒకప్పుడు బోఫోర్స్ తరహాలో ప్రతిపక్షాలు అన్నీ ఏకమై కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టగల పరిస్థితి ఇప్పుడు లేదు. ఒకప్పుడు బోఫోర్స్ వ్యవహారానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలతో ప్రజలు కూడా స్వరం కలిపారు. జాతి జాగృతమై నాటి ప్రధాని రాజీవ్ గాంధీని ఓడించింది.

కవిత అరెస్టు నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు చలోక్తులు విసురుతున్నారు. చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడు హైదరాబాద్‌లో ధర్నాలు చేసిన వారిని ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ కవితను ఢిల్లీకి తీసుకుపోయారు కనుక అక్కడ ధర్నాలు చేసుకోండని ఎగతాళి చేస్తున్నారు.

ప్రజలతో మమేకం అవుతూ సంస్థాపరంగా పార్టీ బలోపేతంపై దృష్టి పెడితే ఎన్ని ఒడిదుడుకులనైనా ఎదుర్కోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఇందుకు ఉదాహరణ. కేసీఆర్ కూడా ఒకప్పుడు చంద్రబాబు అనుచరుడే కనుక ఆయనను చూసి నేర్చుకొనే ప్రయత్నం చేస్తే ఈ దుస్థితి నుంచి బయటపడవచ్చు.

కొత్త పలుకు

ఆర్కే విశ్లేషణ 2లో...





విశాఖ సభలో టీ-సీఎం రేవంత్, షర్మిల అభివాదం

వైఎస్ వారసురాలు షర్మిలే!

రాహుల్‌ను పీఎం చేయడం వైఎస్ కల.. ఆ కల కోసం పనిచేస్తున్న షర్మిల

పోలవరం ప్రాజెక్టు పూర్తి కాలేదు, హోదా రాలేదు, రాజధాని లేదు..

నీలం, ఎన్టీఆర్, వైఎస్ వంటి నేతలు ఏలిన గడ్డ ఇది

ఆంధ్రులకు అన్యాయంపై వారు ఢిల్లీని నిలదీశారు.. ఇప్పుడేమో వంగి దండాలు

మోదీని నిలదీసే నేతలు లేరు.. విశాఖ ఉక్కు జోలికి ఎవరినీ రానివ్వం

సాటి తెలుగువాడిగా ఆంధ్రకు అండగా ఉంటా.. విశాఖ 'ఉక్కు' సభలో రేవంత్

4

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

కేసుల నుంచి బయటపడేందుకు, చిన్నాన్న హంతకులను కాపాడేందుకే ఢిల్లీకి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే ప్రత్యేక హోదా: షర్మిల

సిద్ధమైన 'ప్రజాగళం' వేదిక



చరిత్రాత్మకంగా 'ప్రజాగళం'

భారీ స్థాయిలో ఏర్పాట్లు.. నేడు చిలకలూరిపేటలో కూటమి తొలి బహిరంగ సభ

వందల ఎకరాల్లో ప్రాంగణం సిద్ధం.. లక్షల మందికి పసందైన భోజనాలు

ఎక్కడికక్కడ తాగునీరు, మజ్జిగ.. వేల మంది పోలీసులతో భద్రత

ఎలాంటి ఇబ్బందీ లేకుండా పార్కింగ్.. బొప్పూడిలో తమ్ముళ్ల ఉరిమే ఉత్సాహం

హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ, జనసేన అధినేతలు బాబు, పవన్

9

నా.. నా.. నా.. నై!

వైసీపీ జాబితాలో సొంత వారికే వీరతాళ్లు.. 49 మంది రెడ్లకు సీట్లు

బీసీలకు దక్కింది 48 స్థానాలే.. రాష్ట్ర జనాభాలో వీరిదే అగ్రస్థానం

కేటాయింపుల్లో మాత్రం అత్తెసరే.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్‌డ్ స్థానాలే

మాటల్లో అదరగొట్టిన జగన్.. చేతల్లో తుస్సుమన్న గన్

సర్వేలంటూ 13 జాబితాలు విడుదల.. చివరికి అభ్యర్థులు కరువు

అభ్యర్థి లేక అనకాపల్లి సీటు ఖాళీ.. 'సామాజిక న్యాయం' ఉత్తిదే

10

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

అంతలో ఎంత మార్పు?

పదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 'తెలంగాణ బాపు'గా కొంతకాలం పాటు పిలిపించుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఈ విధంగా అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకుపోతారని ఆనాడు ఎవరైనా ఊహించారా? కవిత అరెస్టు న్యాయమా? అన్యాయమా? అన్న విషయం పక్కన పెడితే ఈ దుస్థితికి ఆమె స్వయంకృతాపరాధమే కారణం. పదేళ్లపాటు తండ్రి కేసీఆర్ ఏకఛత్రాధిపత్యంగా పాలించిన తెలంగాణ రాష్ట్రంలో సంపాదించుకోవడానికి అవకాశాలే లేనట్టుగా, సంపాదించుకున్నది చాలదు అన్నట్టుగా ఆమె ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో లిక్కర్ వ్యాపారంలోకి కూడా చొరబడ్డారు. ఫలితమే ఈ అరెస్ట్. కవిత అరెస్టు అన్యాయం, అక్రమం, అప్రజాస్వామికం అని కేటీఆర్, హరీశ్‌రావు వంటి వారు గగ్గోలు పెట్టడం గురివింద సామెతను గుర్తుకుతెస్తున్నది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని


> **అసెంబ్లీ ఎన్నికలకు ముందు కవిత అరెస్టును ఆపడానికి ప్రయత్నించి ఉండకపోతే అధికారం కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురయ్యేది కాదన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పుడు అటు అధికారం కోల్పోయారు, ఇటు కుమార్తె అరెస్టును నిలువరించలేక పోయారు. తోటకూర కాడలు దొంగిలించిన నాడే మందలించి ఉంటే.. అన్నట్టుగా కుటుంబ సభ్యులను ప్రారంభంలోనే కట్టడి చేసి ఉంటే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి దాపురించి ఉండేది కాదు. తెలంగాణ సమాజాన్ని తాను మాత్రమే కాచి వడపోశానని చెప్పుకొనే కేసీఆర్, తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం అత్యంత ప్రధానం అన్న వాస్తవం ఎందుకు గ్రహించలేక పోయారో? ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. తనలోని అహాన్ని విడనాడి ఆత్మపరిశీలన చేసుకుంటూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించ గలిగితే ప్రజలు మళ్లీ ఆయనను ఆదరించే అవకాశం లేకపోలేదు. ప్రజలతో మమేకం అవుతూ సంస్థాపరంగా పార్టీ బలోపేతంపై దృష్టి పెడితే ఎన్ని ఒడిదుడుకులనైనా ఎదుర్కోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఇందుకు ఉదాహరణ.**

ఓటుకు నోటు కేసులో అరెస్టు చేసి జైలుకు పంపలేదా? ఎమ్మెల్సీ రాజ్యసభ ఎన్నికల సందర్భంగా గతంలో అనేక సందర్భాలలో శాసనసభ్యులకు, ఇతరులకు డబ్బు ముట్టజెప్పడం జరిగింది. అంతేకాదు తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన పలువురు శాసనసభ్యులకు భారీ మొత్తాల్లో డబ్బు ఆశ చూపి బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం నిజం కాదా? అయినా రేవంత్ రెడ్డి మాత్రమే కనీవినీ ఎరుగని నేరానికి పాల్పడినట్టుగా ప్రచారం చేసి కొన్ని నెలల పాటు జైలులో నిర్బంధించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా ఈ కేసుతో ముడి పెట్టారు. ఈడీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే కవితకు న్యాయస్థానాలలో ఉపశమనం లభించకుండా శుక్రవారం నాడు అరెస్టు చేశారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు గానీ తాము అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో మరచిపోతే ఎలా? ఒక్కగానొక్క కూతురు పెళ్లి ఘనంగా నిర్వహించుకొనే అవకాశం రేవంత్ రెడ్డికి ఇవ్వలేదే? ఎనిమిది గంటలకు మించి పెరోల్‌పై బయట ఉండకూడదని కోర్టులో బలంగా వాదించలేదా? అందుకే కర్మ మనల్ని వదలదని అంటారు. ఒకప్పుడు తెలంగాణ నా అడ్డా అని గర్జించిన కేసీఆర్ కుటుంబాన్ని ఇప్పుడు తెలంగాణలోనే కష్టాలు వెంటాడుతున్నాయి. అదేమిటోగానీ ప్రత్యేక రాష్ట్రాల కోసం ఉద్యమించి ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన పలువురు నాయకులు కేసుల్లో ఇరుక్కున్నారు. జార్ఖండ్ రాష్ట్రం కోసం పోరాడిన శిబూ సోరెన్ జైలుకు కూడా వెళ్లారు. నిన్నటి వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కుమారుడు హేమంత్ సోరెన్ కూడా ప్రస్తుతం జైల్లో ఉన్నారు. జేఎంఎం ముడుపుల కేసులో నాటి ప్రధాని పీవీ నరసింహారావు కూడా కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. ఇప్పుడు భారత రాష్ట్ర సమితి వంతు వచ్చింది. కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాలను సొంత జాగీర్లు చేసుకొని పాడి ఆవులుగా మార్చుకొనే ప్రయత్నం చేయడమే ఈ అనర్థాలకు కారణం కాదా? ఆశకు అంతు ఉండాలి. డబ్బు సంపాదనకు అలవాటు పడిన రాజకీయ నాయకులు, అధికారులను.. సమాజం కూడా ఒక స్థాయి వరకే మన్నిస్తుంది. అత్యాశకు పోయినప్పుడే ఇలాంటి తిప్పలు వస్తాయి. ఇప్పుడు కవిత విషయంలో కూడా జరుగుతున్నది ఇదే. 2014 నుంచి నిన్న మొన్నటి వరకు అధికారంలో కొనసాగిన కల్వకుంట్ల కుటుంబం అడుగడుగునా అధికార దర్పం ప్రదర్శించింది. డబ్బు సంపాదనకు అలవాటు పడింది. తొలి ఐదేళ్లు పెద్దగా ఆరోపణలు లేకుండా పనిచేసిన కేసీఆర్ కూడా రెండవ పర్యాయం రెవెన్యూ తదితర విషయాలలో అడ్డగోలుగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే కవిత రాష్ట్ర సరిహద్దులు దాటి ఢిల్లీ వరకు వెళ్లారు. లిక్కర్ కుంభకోణంలో ఇరుక్కున్నారు. ఈ కేసులో అరెస్టు కావడమే అవమానం అనుకుంటే ఒక మహిళ అయి ఉండీ లిక్కర్ వ్యాపారంలో వేలు పెట్టడం వల్ల కవితకు సానుభూతి కూడా దక్కక పోవచ్చు. కవిత అరెస్టు సందర్భంగా అక్కడి పరిస్థితులను గమనిస్తే కేసీఆర్ కుటుంబం ఒంటరి అయినట్టుగా భావించాల్సి ఉంటుంది. ఇది జరుగుతున్న సమయంలోనే కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి మంతనాలు జరిపారు. కర్మ ఫలాన్ని అనుభవించి తీరాల్సిందే అంటే ఇదే. అగ్రనేతలలో కేటీఆర్, హరీశ్‌రావు మాత్రమే కవిత ఇంటికి వెళ్లారు. తాను ఇప్పటికీ అధికారంలో ఉన్నట్టుగా భావిస్తున్నారేమో తెలియదు గానీ ఈడీ అధికారులతో కేటీఆర్ అభ్యంతరకరంగా వ్యవహరించారు. సహనం నశించిన ఒక మహిళా అధికారి 'ఇతడిని కూడా అరెస్టు చేయండి' అనడాన్ని మనం విన్నాం. రాష్ట్రంలోనే కాదు జాతీయ స్థాయిలో కూడా కేసీఆర్‌కు ఇప్పుడు సంఘీభావం ప్రకటించే వారు కనిపించడం లేదు. తాము శాశ్వతంగా అధికారంలోనే ఉంటామని విర్రవీగే నాయకులకు, వారి కుటుంబ సభ్యులకు కవిత ఉదంతం ఒక హెచ్చరిక. మొత్తమ్మీద తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహర్జాతకుడనే చెప్పాలి. ఈ అరెస్టు ఏదో శాసనసభ ఎన్నికలకు ముందు జరిగి ఉంటే కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ లభించి ఉండేది కాదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి ఉండేవారు కారు. కవిత అరెస్టును కేసీఆర్ అండ్ కో ఎంత వరకు ఉపయోగించుకొని ఉండేవారో తెలియదు గానీ బీఆర్ఎస్‌తో తమకు అవగాహన లేదని చెప్పుకొనే మహదావకాశం భారతీయ జనతా పార్టీకి దక్కేది. ఈ రెండు పార్టీల మధ్య లాలూచీ ఉందన్న అభిప్రాయాన్ని తొలగించగలిగి ఉంటే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించి ఉండేది. అలా జరగలేదు కనుకే కాంగ్రెస్ లాభపడగలిగింది. అదను చూసి దెబ్బ కొట్టాలని అంటారు. కవితను అరెస్టు చేయడం కూడా ఇప్పుడు బీజేపీకి మేలు చేయకపోవచ్చునన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పుడు ఈ అరెస్టు కేసీఆర్ అండ్ కోకు ఉపయోగపడే అవకాశం ఉందని కూడా అంటున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన నాటి నుంచి కేసీఆర్‌కు కష్టాలు మొదలయ్యాయి. ఫాంహౌజ్‌లో జారిపడి తుంటి విరగ్గొట్టుకున్నారు. మరోవైపు పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు పక్క చూపులు చూడటం మొదలెట్టారు. దీంతో సరిగ్గా ఊపిరి తీసుకోలేని పరిస్థితికి కేసీఆర్ చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఢిల్లీ నుంచి వచ్చిన ఈడీ అధికారులు కవితను అరెస్టు చేయడం కేసీఆర్‌కు కొత్త ఊపిరి పోసినట్టే. నగరంలో ప్రధాని నరేంద్ర మోదీ రోడ్ షో జరుగుతున్న సమయంలోనే కవిత అరెస్టు జరగడం కాకతాళీయం కాకపోవచ్చు. బీఆర్ఎస్‌తో తమకు ఎటువంటి అవగాహనా లేదని తెలంగాణ సమాజానికి స్పష్టమైన సంకేతం ఇవ్వడం కోసమే కేంద్ర పెద్దలు ఈ సమయాన్ని ఎంచుకున్నారని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ కూడా వెలువడింది. లిక్కర్ కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే క్రమంలో తొలి మెట్టుగా కవిత అరెస్టు జరిగిందన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే కేజ్రీవాల్‌కు బెయిల్ లభించింది. ఇండియా కూటమిలో కేజ్రీవాల్ కీలకంగా ఉన్న విషయం విదితమే.

ఎదుర్కోగల మొనగాడేడీ?

మరోవైపు ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బయట పెట్టాల్సి రావడం కూడా కేంద్ర పెద్దలకు చికాకు కలిగిస్తోంది. అనేక కేసులలో విచారణ ఎదుర్కొంటున్న లాటరీ కింగ్ మార్టిన్ కూడా భారీ మొత్తంలో ఎలక్టోరల్ బాండ్స్ కొనుగోలు చేయడం, మరికొన్ని కంపెనీలు తమ వార్షిక లాభాలను మించి బాండ్లు కొనడం, సీబీఐ, ఈడీ దాడుల తర్వాత మరికొన్ని కంపెనీలు బాండ్లు కొనడం వంటి అంశాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. జాతీయ స్థాయిలో ఈ అంశం చర్చనీయాంశం అయింది. నిజానికి ఈ బాండ్ల వ్యవహారం లోక్‌సభ ఎన్నికలకు ముందు బయటపడటం కేంద్ర పెద్దలను ఆత్మరక్షణలో పడేయాలి. అయితే ఒకప్పుడు బోఫోర్స్ తరహాలో ప్రతిపక్షాలు అన్నీ ఏకమై కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టగల పరిస్థితి ఇప్పుడు లేదు. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలతో పాటు మరికొన్ని రాష్ట్రాలలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు కూడా ప్రధాని మోదీని ధిక్కరించే పరిస్థితి లేదు. కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా బలహీనపడింది. ప్రజలు కూడా ఎలక్టోరల్ బాండ్స్ వంటి అంశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇస్తారని భావించలేం. బోఫోర్స్ వ్యవహారానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలతో ప్రజలు కూడా స్వరం కలిపారు. జాతి జాగృతమై నాటి ప్రధాని రాజీవ్ గాంధీని ఓడించింది. ఇప్పుడు ఉత్తరాది ప్రజలు జైశ్రీరాం స్మరణతో తన్మయత్వం చెందుతున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా సొంత రాష్ట్రానికే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలను కూడగట్టే నాయకుడే లేకుండా పోయారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఒక్కరే ఇంకా కేంద్రానికి వ్యతిరేకంగా గొంతెత్తుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని జాతీయ పార్టీగా ప్రకటించి, పార్టీ పేరును కూడా భారత రాష్ట్ర సమితిగా మార్చుకున్న కేసీఆర్ కూడా సొంత రాష్ట్రంలోనే ఓడిపోయారు. ప్రజలు అత్యాశకు పోయి తనను ఓడించారని, తనను గెలిపించి ఉంటే జాతీయ స్థాయిలో అగ్గి పెట్టి ఉండేవాడినని కేసీఆర్ తాజాగా కరీంనగర్‌లో చెప్పుకొన్నారు గానీ ఆయనకు అంత సీన్ లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత భారతీయ జనతా పార్టీతో పొత్తు కోసం కేసీఆర్ అనేక మార్గాల్లో ప్రయత్నించారు. అయితే శాసనసభ ఎన్నికల ముందు జరిగిన తప్పు రిపీట్ కాకూడదన్న ఉద్దేశంతో బీజేపీ పెద్దలు పొత్తు ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఈ క్రమంలోనే అదను కాకపోయినా కవిత అరెస్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడినందున ఇప్పుడు తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా మారబోతోంది. లోక్‌సభకు పోటీ చేయగల అభ్యర్థులు సొంత పార్టీలో లేకపోవడంతో ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ కూడా భారత రాష్ట్ర సమితికి చెందిన నాయకులను ఎగరేసుకుపోతున్నాయి. నిన్నటి వరకు కాంగ్రెస్–బీజేపీని ఖాళీ చేశానని సంబరపడిన కేసీఆర్.. ఇప్పుడు సొంత పార్టీ ఖాళీ అవుతున్నప్పటికీ గుడ్లప్పగించి చూడాల్సిన పరిస్థితి. వంద రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కిటకిటలాడింది. ఇప్పుడు సిట్టింగ్ ఎంపీలు కూడా కేసీఆర్‌కు బై బై చెబుతూ కాంగ్రెస్-బీజేపీ తరఫున పోటీ చేయబోతున్నారు. రాజకీయ పార్టీలకు ఈ పరిణామం ఒక గుణపాఠంగా ఉంటుంది. ప్రజా విశ్వాసం కోల్పోయినప్పుడు మంద బలం ఎంతగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఓటమి తప్పదని శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు రుజువు చేశారు. చతురంగ బలాలు ఉన్నప్పటికీ ఓటమి నుంచి కేసీఆర్ తప్పించుకోలేకపోయారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తరఫున గెలిచిన శాసనసభ్యులలో పలువురు మహా నాయకులేమీ కాదు. ప్రజా ఆకాంక్షలను, మనోభావాలను గుర్తించకుండా అధికారాన్ని చలాయిస్తే కేసీఆర్ కుటుంబానికి ప్రస్తుతం ఎదురవుతున్న చేదు అనుభవాలే కాచుకొని ఉంటాయి. శాసనసభలో ప్రతిపక్షాలకు మిగిలిన కొద్ది మంది సభ్యులు కూడా గొంతు ఎత్తలేని పరిస్థితిని కల్పించిన కేసీఆర్ విజయగర్వంతో విర్రవీగారు. కేసీఆర్ తరహాలో ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా శాసనసభలో సంఖ్యాపరంగా పార్టీ బలం పెంచుకొనే పనిలో నిమగ్నమయ్యారు. లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే నాటికి పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉంది. అయితే ఈ చేరికలు ప్రభుత్వ సుస్థిరతకు మాత్రమే ఉపయోగపడతాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేవు.

> **పడి లేచిన వాడే అసలైన రాజకీయ గండరగండడుగా గుర్తింపు పొందుతాడు. టక్కు టమార గజకర్ణ గోకర్ణ విద్యలతో చీమలు పెట్టిన పుట్టలో పాములా దూరి కబళించినంత మాత్రాన రాజకీయ గండరగండడు కాలేరు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలుస్తారన్న విషయం పక్కన పెడితే ఓట్ల పరంగానైనా ద్వితీయ స్థానంలో నిలబడగలిగితే కేసీఆర్ నిలదొక్కుకొనే అవకాశం ఉంటుంది.**



> **తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా మారబోతోంది. లోక్‌సభకు పోటీ చేయగల అభ్యర్థులు సొంత పార్టీలో లేకపోవడంతో ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ కూడా భారత రాష్ట్ర సమితికి చెందిన నాయకులను ఎగరేసుకుపోతున్నాయి. నిన్నటి వరకు కాంగ్రెస్–బీజేపీని ఖాళీ చేశానని సంబరపడిన కేసీఆర్.. ఇప్పుడు సొంత పార్టీ ఖాళీ అవుతున్నప్పటికీ గుడ్లప్పగించి చూడాల్సిన పరిస్థితి. వంద రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కిటకిటలాడింది. ఇప్పుడు సిట్టింగ్ ఎంపీలు కూడా కేసీఆర్‌కు బై బై చెబుతూ కాంగ్రెస్–బీజేపీ తరఫున పోటీ చేయబోతున్నారు. రాజకీయ పార్టీలకు ఈ పరిణామం ఒక గుణపాఠంగా ఉంటుంది. ప్రజా విశ్వాసం కోల్పోయినప్పుడు మంద బలం ఎంతగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఓటమి తప్పదని శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు రుజువు చేశారు. చతురంగ బలాలు ఉన్నప్పటికీ ఓటమి నుంచి కేసీఆర్ తప్పించుకోలేక పోయారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తరఫున గెలిచిన శాసనసభ్యులలో పలువురు మహా నాయకులేమీ కాదు. ప్రజా ఆకాంక్షలను, మనోభావాలను గుర్తించకుండా అధికారాన్ని చలాయిస్తే కేసీఆర్ కుటుంబానికి ప్రస్తుతం ఎదురవుతున్న చేదు అనుభవాలే కాచుకొని ఉంటాయి.**

అరెస్టుతో ఎవరికి లాభం?

తాజా సమాచారం ప్రకారం తెలంగాణలో భారతీయ జనతా పార్టీ పుంజుకుంటోంది. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి ఆందోళన కలిగించే అంశమే. శాసనసభ ఎన్నికల సందర్భంగా బీజేపీ అతి విశ్వాసంతో ఉండటంతో పాటు వ్యూహాత్మక తప్పిదాలు కూడా చేసింది. ఫలితంగా కాంగ్రెస్ విజయం సాధించింది. ఇప్పుడు కవిత అరెస్టు ప్రభావం ప్రజలపై కనిపించకపోతే మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిగానే ఉన్నారు. అయితే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారిలో కొంత మంది మాత్రం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలన్న ఆలోచన చేస్తున్నారట. దీనికి తోడు ప్రధాని మోదీ ప్రభావం ఉండనే ఉంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒకవైపు, ప్రజా బలాన్ని పెంచుకుంటున్న బీజేపీ మరోవైపూ మోహరించి ఉన్నందున కేసీఆర్ పార్టీ పరిస్థితి ఏమిటి? అనే సందేహం సహజంగానే కలుగుతుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని, ప్రజలంతా తమ పాలనను గుర్తుచేసుకుంటున్నారని భ్రమ పడుతున్న కేసీఆర్ ఆత్మవంచన చేసుకుంటున్నారు. గాలిలో మేడలు కట్టకూడదు. కేటీఆర్ వ్యాఖ్యలు, వ్యవహార శైలిని గమనిస్తున్న వారు కూడా ఆయనలో అహంభావం ఛాయలు ఇంకా తొలగిపోలేదని భావిస్తున్నారు. కవిత అరెస్టు నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు చలోక్తులు విసురుతున్నారు. గురివింద సామెతను గుర్తుచేస్తున్నారు. చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడు హైదరాబాద్‌లో ధర్నాలు చేసిన వారిని ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ కవితను ఢిల్లీకి తీసుకుపోయారు కనుక అక్కడ ధర్నాలు చేసుకోండని ఎగతాళి చేస్తున్నారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ రాజకీయాలను కలుషితం చేయడంతో పాటు అవినీతి మయం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. ఆయన పుణ్యమా అని ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు అధికారం లేకుండా, డబ్బు లేకుండా ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అని అంటారు. అధికారంలో ఉన్నప్పుడు కన్నూ మిన్నూ కానకుండా వ్యవహరించిన ఫలితాన్ని కేసీఆర్ అండ్ కో ఇప్పుడు అనుభవిస్తున్నారు. కవితను అరెస్టు చేసి ఢిల్లీ తీసుకుపోయినా తెలంగాణ ప్రజలు రోడ్ల మీదకు రాలేదు. పార్టీ పేరు మార్చుకోవడం ద్వారా తెలంగాణతో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా కేసీఆర్ తెంచుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని విమర్శించిన వారిని తెలంగాణ ద్రోహులుగా చిత్రించి తెలంగాణ వాదాన్ని దుర్వినియోగం చేశారు. ఇప్పుడు సొంత బిడ్డను అరెస్టు చేసి తీసుకు వెళ్లిన ఈడీ అధికారులను తెలంగాణ ద్రోహులని నిందించగలరా? ఈడీ అధికారులు తమ వెంట ఢిల్లీకి తీసుకుపోతున్నప్పుడు కవిత భావోద్వేగం చెందినప్పటికీ తెలంగాణ సమాజం చడీ చప్పుడూ ఎందుకు లేకుండా పోయిందో కేసీఆర్ కుటుంబం ఆత్మపరిశీలన చేసుకోవాలి.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

తెలంగాణ అంటే కల్వకుంట్ల కుటుంబం కాదని గ్రహించాలి. ఉద్యమ సమయంలో తమ ఆకాంక్షను నెరవేర్చగలిగే నాయకుడ్ని కేసీఆర్‌లో చూశారు. అధికారంలోకి వచ్చాక ఆయనలోని నియంతను, ఫ్యూడల్‌నూ చూశారు. కుటుంబ సభ్యుల దర్పాన్ని, అధికార దుర్వినియోగాన్ని గమనించారు. ఫలితంగా కేసీఆర్ ఇప్పుడు ఒంటరి వారయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కవిత అరెస్టును ఆపడానికి ప్రయత్నించి ఉండకపోతే అధికారం కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురయ్యేది కాదన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పుడు అటు అధికారం కోల్పోయారు, ఇటు కుమార్తె అరెస్టును నిలువరించలేకపోయారు. తోటకూర కాడలు దొంగిలించిన నాడే మందలించి ఉంటే.. అన్నట్టుగా కుటుంబ సభ్యులను ప్రారంభంలోనే కట్టడి చేసి ఉంటే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి దాపురించి ఉండేది కాదు. తెలంగాణ సమాజాన్ని తాను మాత్రమే కాచి వడపోశానని చెప్పుకొనే కేసీఆర్, తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం అత్యంత ప్రధానం అన్న వాస్తవం ఎందుకు గ్రహించలేకపోయారో? ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. తనలోని అహాన్ని విడనాడి ఆత్మపరిశీలన చేసుకుంటూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించగలిగితే ప్రజలు మళ్లీ ఆయనను ఆదరించే అవకాశం లేకపోలేదు. ఫ్లోటింగ్ నాయకులను చూసి మురుసుకొనే వారికి కేసీఆర్ ఒక ఉదాహరణగా నిలుస్తారు. స్టెరాయిడ్స్ వాడితే తాత్కాలికంగా ఉత్తేజం వస్తుంది. ఫ్లోటింగ్ నాయకులు కూడా అదే విధంగా పనికొస్తారు. ప్రజలతో మమేకం అవుతూ సంస్థాపరంగా పార్టీ బలోపేతంపై దృష్టి పెడితే ఎన్ని ఒడిదుడుకులనైనా ఎదుర్కోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఇందుకు ఉదాహరణ. కేసీఆర్ కూడా ఒకప్పుడు చంద్రబాబు అనుచరుడే కనుక ఆయనను చూసి నేర్చుకొనే ప్రయత్నం చేస్తే ఈ దుస్థితి నుంచి బయటపడవచ్చు. పడి లేచిన వాడే అసలైన రాజకీయ గండరగండడుగా గుర్తింపు పొందుతాడు. టక్కు టమార గజకర్ణ గోకర్ణ విద్యలతో చీమలు పెట్టిన పుట్టలో పాములా దూరి కబళించినంత మాత్రాన రాజకీయ గండరగండడు కాలేరు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలుస్తారన్న విషయం పక్కన పెడితే ఓట్ల పరంగానైనా ద్వితీయ స్థానంలో నిలబడగలిగితే కేసీఆర్ నిలదొక్కుకొనే అవకాశం ఉంటుంది.

ప్చ్.. అమెరికాలోనూ కొరతేనా?

ఈ విషయం అలా ఉంచితే బలమైన యువ నాయకుల కొరత వర్ధమాన దేశాలనే కాదు- ప్రపంచానికే పెద్దన్నగా

> **కవిత అరెస్టు న్యాయమా? అన్యాయమా? అన్న విషయం పక్కన పెడితే ఈ దుస్థితికి ఆమె స్వయంకృతాపరాధమే కారణం. పదేళ్లపాటు తండ్రి కేసీఆర్ ఏకఛత్రాధి పత్యంగా పాలించిన తెలంగాణ రాష్ట్రంలో సంపాదించుకోవడానికి అవకాశాలే లేనట్టుగా, సంపాదించు కున్నది చాలదు అన్నట్టుగా ఆమె ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో లిక్కర్ వ్యాపారంలోకి కూడా చొరబడ్డారు. ఫలితమే ఈ అరెస్ట్. కవిత అరెస్టు అన్యాయం, అక్రమం, అప్రజాస్వామికం అని కేటీఆర్, హరీశ్‌రావు వంటి వారు గగ్గోలు పెట్టడం గురివింద సామెతను గుర్తుకుతెస్తున్నది. కేసీఆర్ ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓటుకు నోటు కేసులో అరెస్టు చేసి జైలుకు పంపలేదా? ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎన్నికల సందర్భంగా గతంలో అనేక సందర్భాలలో శాసన సభ్యులకు, ఇతరులకు డబ్బు ముట్టజెప్పడం జరిగింది. అంతేకాదు తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన పలువురు శాసనసభ్యులకు భారీ మొత్తాల్లో డబ్బు ఆశ చూపి బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం నిజం కాదా?**

చలామణి అవుతూ వచ్చిన అమెరికాకు కూడా తప్పడం లేదు. ఇప్పుడు ఆ దేశంలో కూడా కొత్త తరం నాయకులు రావడం లేదు. ఫలితంగా రాబోయే ఎన్నికల్లో కూడా రిపబ్లికన్ పార్టీ, డెమోక్రటిక్ పార్టీల తరఫున డొనాల్డ్ ట్రంప్, జో బైడెన్‌లే మళ్లీ అధ్యక్ష పీఠం కోసం తలపడబోతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ వయసు 81 సంవత్సరాలు. ట్రంప్ వయసు 77 సంవత్సరాలు. మాజీ అధ్యక్షుడైన ట్రంప్ పై అనేక ఆరోపణలు రావడం, కోర్టుల్లో విచారణ జరగడం, జరిమానా విధించడం జరిగింది. అరెస్టు కూడా అయ్యారు. అయినా రిపబ్లికన్ పార్టీకి ఆయన అభ్యర్థిత్వమే దిక్కయింది. అంటే ట్రంప్ వంటి వ్యక్తితో పోటీపడగల నాయకుడే రిపబ్లికన్ పార్టీలో లేరన్న మాట. శారీరకంగా అనేక రుగ్మతలు ఎదుర్కొంటున్న ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌ను మించిన నాయకుడు డెమోక్రటిక్ పార్టీలో లేకుండా పోవడం ఏమిటి? దీన్నిబట్టి అమెరికా వంటి అగ్రరాజ్యం కూడా నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్న మాట. చెట్టులేని చోట ఆముదం చెట్టే మహావృక్షం అని అమెరికన్లు కూడా సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి అన్న మాట!

మాండలికంలో మొగలాయి

> **నామిని కంప్లీట్లీ, అబ్సల్యూట్లీ ఒరిజినల్. ఇంగ్లీషు సాహిత్యమో, రావి శాస్త్రో, కేశవ రెడ్డో, పతంజలో.... మరే ఇతర ప్రభావమూ లేకుండా ఒక సొంత వాక్యాన్ని, ఒక సొంత స్టైల్‌నీ, తనే డిస్కవర్ చేసిన సొంత నేరేటివ్‌ని అక్షరాల్లో పలికించిన 'మొగలాయి' నామిని. రాయలసీమ మాండలికం అనే కల్తీ లేని వెన్నెల విత్తనాలను రాష్ట్రమంతటా వెదజల్లితే, అవి మన పెరట్లో రంగురంగుల సీతాకోకచిలుకలై ఎగిరి, యాస పువ్వులై విరబూశాయి. అక్షరాలను ఆవిర్లు ఎగజిమ్మే అన్నం మెతుకులుగా మార్చగలిగే నామిని, పచ్చనాకు సాక్షిగా మాండలికానికి అమ్మ.**



ఎవర్నయినా ఎందుకు తలుచుకుంటాం?
ఎవర్నయినా ఎందుకు గుర్తు పెట్టుకుంటాం?
ఎప్పుడో 40 ఏళ్ళ క్రితం రాసిన మాటలు ఇప్పుడు గుర్తొచ్చినా ఎందుకు మురిసిపోతాం?
తెలతెలవారుతుండగా పొలం గట్ల మీద నడుస్తున్నట్టు,
పొయ్యి మీద అన్నం ఉడుకుతున్నట్టు,
పొలిమేరలో నించుని చంద్రోదయాన్ని చూస్తున్నట్టు..
ఎవరైతే రాయగలుగుతారో వాళ్ళని ఎలా మరిచిపోతాం?
కంకుల మీద వాలిన పిచ్చికలు పలకరించినట్టు,
పిల్లలు... చెట్టు కొమ్మకి కట్టిన ఉయ్యాలలూగుతున్నట్టు,
రైతు కూలీ రెండు చేతులతో పంట కాల్వలో నీళ్ళు తాగుతున్నట్టు....
అంత సహజంగా, సమ్మోహనంగా రాయడం సాధ్యమేనా?
నామినిని తలుచుకోవడం అందుకే.

నామిని సుబ్రహ్మణ్య నాయుడు మాకు బాగా తెలిసినవాడని గొప్పగా చెప్పుకోవడమూ అందుకే.

నామిని రాసేవి కేవలం అక్షరాలు కావు. అవి మేలు రకం విత్తనాలు. వాక్యాలు కావవి, రాగులూ, సజ్జలూ, జొన్న రాశులు. తాటాకు గుడిసె ముందు చింకి చాప పరిచి, నిండు జీవితాన్ని ఎండబెడతాడు. నిరాశ నిండిన బతుకు నీడల మీద నుంచి నామిని నడిచి వెళిపోతుంటాడు. పల్లెటూరి పేదరికాన్ని, తిండి గింజలు లేని వేదనని దయతో, ప్రేమతో, అపేక్షతో చూస్తాడు. ఆ నిత్యజీవన వేదనలోని విషాద సంగీతాన్ని చెవిఒగ్గి మరీ వింటాడు. ఆ చీకటిని కూడా వెలిగించగలిగే చిరునవ్వు వెనుక దాగిన హాస్యాన్నీ ఒడిసి పట్టుకుంటాడు. వాటిని కథలుగా రాస్తాడు.

గోగాకు పూరు బిండితో సద్ది తాగినట్టు,
ఆదివారం మాంసం కూరతో ఆబగా తిన్నట్టు,
నులక మంచమ్మీద నాన్న పక్కన సుఖంగా నిద్ర పోతున్నట్టు...
అలవోకగా రాసుకుంటూ పోతాడు. ఆ కుశాలను, మనేదను మనకి కానుకగా యిచ్చి వెళతాడు. అందుకే, నామిని కంప్లీట్లీ, అబ్సల్యూట్లీ ఒరిజినల్. ఇంగ్లీషు సాహిత్యమో, రావి శాస్త్రో, కేశవ రెడ్డో, పతంజలో... మరే ఇతర ప్రభావమూ లేకుండా ఒక సొంత వాక్యాన్ని, ఒక సొంత స్టైల్‌నీ, తనే డిస్కవర్ చేసిన సొంత నేరేటివ్‌ని అక్షరాల్లో పలికించిన 'మొగలాయి' నామిని.

రాయలసీమ మాండలికం అనే కల్తీ లేని వెన్నెల విత్తనాలను రాష్ట్రమంతటా వెదజల్లితే, అవి మన పెరట్లో రంగురంగుల సీతాకోకచిలుకలై ఎగిరి, యాస పువ్వులై విరబూశాయి. సువాసనలు పంచి యిచ్చాయి. ఆ యాసకు వుండే సొగసునీ, తూగునీ, మాధుర్యాన్ని మనలో నింపుతూనే, ఆ వ్యక్తీకరణలోని శక్తితో గుండెను చీల్చి వేయడం అనే రహస్య విద్యలో ఆరితేరినవాడు నామిని. అక్షరాలను ఆవిర్లు ఎగజిమ్మే అన్నం మెతుకులుగా మార్చగలిగే నామిని, పచ్చనాకు సాక్షిగా మాండలికానికి అమ్మ.

అసలు నామిని అంటేనే ఒక ఉద్యానవనం.
నామిని అంటే ఒక పునరుజ్జీవనం.
మరో మాట లేదు... ప్రపంచస్థాయి రచయిత, ఆధునిక తెలుగు సాహిత్యంలో అగ్రతాంబూలం అందుకోవడానికి అర్హుడు.

నామిని రాసే చిత్తూరు జిల్లా భాష నుడికారంలో ఒక సౌందర్యం, జీవసుగంధం ఉంటాయి. కథ చెప్పడంలో నామినిది ఒక ప్రత్యేకమైన నేరేటివ్ టెక్నిక్. దూరం నుంచి చూస్తున్న ప్రేక్షకుడి లాగానే నిరపేక్షగా కథ నడిపిస్తాడు. ఆ శిల్పచాతుర్యం మనల్ని చకితుల్ని చేస్తుంది. ఎక్కడా తొణకడు. మెలోడ్రామాకు పాల్పడడు. పాఠకుణ్ణి ఇంప్రెస్ చేసే వేషాలు వేయడు. కేవలం వాక్యనిర్మాణ నైపుణ్యం మాత్రమే కాదు, నిస్సంకోచంగా భయమూ బెరుకూ లేకుండా చెపుతాడు. అతని చూపుతో, అభివ్యక్తితో అనంతమైన ఊహా శక్తితో ఒక అపూర్వమైన అనుభవానికి ద్వారాలు తెరుస్తాడు. ఉత్తమాభిరుచికి కొత్త దారులు పరుస్తాడు.

ఒక ఇస్మత్ చుగ్తాయి, సాదత్ హసన్ మంటోలా సాహసి నామిని. గుడిపాటి వెంకటచలంలా తిరుగుబాటుదారుడు.

ఆఫ్రికన్ ఆకలి అయినా, లాటిన్ అమెరికా నెత్తురయినా, మిట్టూరు కన్నీళ్లయినా పేదవాడి వేదన ఒక్కటే. బాధితుడి నిస్సహాయతా ఒక్కటే.

వడపోసిన జీవితానుభవసారాన్ని తేలిక మాటలతో సులభంగా, సూటిగా చెప్పడం అంత తేలికేమీ కాదు. పైగా, పరిమళభరితమైన ఒక ప్రాంతీయ మాండలికానికి ఉత్తమ సాహిత్య గౌరవం యిచ్చి, తాను ముందుండి ఆ మహోద్యమాన్ని నడిపించిన లిటరరీ విజనరీ నామిని. పూట గడవని సామాన్య జనం యాసలోని రసపారవశ్యాన్ని అనుభవించి, ఆ పలుకుబడి మాధుర్యంతో మన దోసిలి నింపిన వాడు. సహజసుందరమైన యాసలోని ఆత్మసౌందర్యాన్ని తెలుగు పాఠకుల గుండెల్లోకి వొంపినవాడు.

ఆలనాటి గురజాడ వెంకట అప్పారావుకీ, మన కాలం వీరుడు నామిని సుబ్రహ్మణ్యం నాయుడికీ మధ్య 75 సంవత్సరాల అంతరం వుంది... వుందా? లేదేమో!

'నాకు మానవ సమాజం పట్ల మహత్తరమైన బాధ్యత వున్నది. నాది ప్రజా ఉద్యమం. దానిని ఎవరిని సంతోషపెట్టడానికీ వదులుకోలేను' అని స్పష్టంగా చెప్పారు గురజాడ. ఈ మాట నామినికి కూడా నూరు శాతం వర్తిస్తుంది.

కన్యాశుల్కం ఒక మహత్తరమైన నాటకం.
నామిని 'మూలింటామె' ఒక మహా కావ్యం.

వాడుక భాష అంటే భావవ్యక్తీకరణకు ప్రజలు వాడే పదజాలం. ప్రజలంటే మనమూ మనమిత్రపుత్ర బృందాలే అయినా, ఒక ప్రాంతం వాళ్ళు వాడే ముతక మాటల మూటలు మనకు దొరకవు. కోస్తా, ఉత్తరాంధ్ర యాసలో గొప్ప సాహిత్య సృష్టి జరిగినా, రాయలసీమ అనగానే ఏడుకొండలవాడిలాగా నామిని సుబ్రహ్మణ్య నాయుడు సాక్షాత్కరిస్తాడు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అనేకమంది రచయితలు మాండలికాన్ని పండించినా, ఆ ప్రాంతపు మాటల్ని ఇంత పదునుగా, ఇంత చురుగ్గా, ఇంత లాఘవంగా రికార్డు చేసి, పాత్రల చేత పలికించిన వారు లేరు. మునికన్నడి మాట ఐనా, మూలింటామె దిగులైనా, మిట్టూరోడి మనేద అయినా, జీవ భాషగా ప్రవహించే యాసలోని సప్తస్వరాలనూ మన నరాల తీగలపై పలికించే తీవ్రతకు పాఠకులు దిమ్మతిరిగి సొమ్మసిల్లి పడిపోతారు. ఎండలో, వానలో, వెన్నెల్లో తడిచిన నాణ్యమైన మిట్టూరు మట్టిని తెలుగు సాహిత్యాకాశం అంచులదాకా విసిరినవాడు, జాను తెలుగుయాసను త్రికరణశుద్ధిగా జాతికి అంకితం చేసినవాడు నామిని ఒక్కడే! ఒక పాప, ఒక బాబు- నిద్రపోతున్న ఇద్దరు చిన్న పిల్లలు, ఆడ చందమామలా, మగ చందమామలా వున్నారని రాయడం తెలుగులో మరో రచయితకు సాధ్యం అయ్యే పనేనా?

అమ్మానాన్న చేసుకున్న పుణ్యం కావొచ్చేమో గానీ, సాక్షాత్తూ ఆ వెంకటేశ్వర స్వామి, ఏడు కొండలూ దిగి వచ్చి తెలుగు సాహితీ లోకానికి ఇచ్చిన అమూల్యమైన, అమృతతుల్యమైన కానుక నామిని సుబ్రహ్మణ్యం నాయుడు.

ఇందుకే అమరరాజా వారి రాజన్న ట్రస్ట్ నామినిని 'మాండలిక బ్రహ్మ' అంటోంది.

• తాడి ప్రకాష్

(నేడు తిరుపతిలో సుప్రసిద్ధ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడుకు రాజన్న ఫౌండేషన్ వారిచే 'మాండలిక బ్రహ్మ' అవార్డు ప్రదానం)

అమ్మో... అన్ని రోజులా?!

59 రోజుల షెడ్యూల్‌తో అభ్యర్థులు అవాక్కు!.. మే 13 వరకూ కార్యకర్తలను పోషించాల్సిందే

- నాలుగోవిడత పోలింగ్‌తో నాయకుల్లో ఆందోళన
- నియోజకవర్గాన్నిబట్టి రోజుకు రూ.5 నుంచి 25 లక్షల ఖర్చు
- ఎన్ని కోట్లైనా చాలవేమోనని ఆందోళన

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల సందడి మొదలైంది.. అదే సమయంలో అభ్యర్థుల వెన్నులో వణుకు కూడా మొదలైంది. ఈసీ ప్రకటించిన ఎన్నిక షెడ్యూల్‌లో పోలింగ్ తేదీ ఏకంగా 59రోజులు ఉండటంతో.. 'అమ్మో.. అన్ని రోజులా' అని అభ్యర్థులు కలవరపడుతున్నారు. దక్షిణాదిలో ఎన్నికలంటేనే కోట్లాది రూపాయలు ఖర్చు చేయాలి. గత ఏడాది మే నెలలో జరిగిన కర్ణాటక, డిసెంబరులో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దేశంలోనే అత్యధికంగా వందల కోట్ల రూపాయలు తనిఖీల్లో పట్టుబడ్డాయి. ఏపీలోనూ ఇదే స్థాయిలో అభ్యర్థులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. షెడ్యూల్ వెలువడిన మార్చి 16నుంచి పోలింగ్ జరిగే మే 13వరకూ అనుచరులు, కార్యకర్తల్ని అభ్యర్థులు భరించాలంటే...భారీగా ఖర్చు చేయాల్సిందే. ప్రతి రోజూ కనీసం రూ.ఐదు లక్షల నుంచి సభలు, ఇతరత్రా కార్యక్రమాలను బట్టి పాతిక ముప్పై లక్షల వరకూ ఖర్చు పెట్టక తప్పని పరిస్థితి. అలా చెయ్యకపోతే వెంట నడిచేవారు కూడా జారిపోతారని భయం. భోజనాలు, వాహనాలు, డీజేలు, ఫ్లెక్సీలు, కళాకారులు...ఒకటా రెండా ప్రతి రోజూ ఖర్చు చేస్తూనే ఉండాలి. కాగా, లోక్‌సభకు, 4 రాష్ట్రాల అసెంబ్లీలకు, ఉప ఎన్నిక స్థానాలకు ఏడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో నాలుగో విడతలో, మే 13న రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి.

అప్పట్లో 33 రోజులు...

2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో షెడ్యూల్‌కు (మార్చి 10) పోలింగ్‌కు(ఏప్రిల్ 11) మధ్య 33 రోజులు ఉంది. అప్పట్లో గెలుపు, ఓటమిపై టెన్షన్ తప్ప వేరే బాదరబందీలుగా లేవని వివిధ రాజకీయ పార్టీల నేతలు గుర్తుచేసుకుంటున్నారు. పోలింగ్ తర్వాత 53రోజులకు ఫలితాలు వెలువడ్డాయి. అంత కాలం ఎదురుచూడటం అప్పట్లో తమకు ఇబ్బంది కలిగించలేదని చెబుతున్నారు. కానీ, ఈసారి అలా కాదు. పోలింగ్‌కు ముందే 59రోజులపాటు డబ్బులు నీళ్లలా ఖర్చు చేయాల్సి రావడం మోయలేని భారం అంటున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతించే డబ్బు వారం రోజులకు కూడా సరిపోదని, కార్యకర్తల బైకులకు పెట్రోలు కొట్టించాలన్నా దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని ధర ఏపీలో ఉందని చెబుతున్నారు. వేసవి కావడంతో నీళ్ల బాటిళ్ల ఖర్చు తడిసి మోపెడవుతుందన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మద్యం పంచకుంటే పని జరగదని, అత్యంత నాసిరకం లిక్కర్ ఏపీలో ఎక్కువ ధరకు కొనాల్సి వస్తోందని కొందరు అంటున్నారు.

ఖర్చుపై ఎన్నికల కమిషన్ నిఘా..

అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార ఖర్చు లెక్కించడంపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టింది. సభలు, సమావేశాల నిర్వహణకు అయ్యే ఖర్చులు మొదలుకొని కార్యకర్తలకు బిర్యానీతోపాటు టిఫిన్, కాఫీ ఖర్చులు కూడా ఈ ఎన్నికల్లో కచ్చితంగా చెప్పి తీరాల్సిందే. గతంలో ఖర్చులు తక్కువ చూపించడంతోపాటు మద్యం లాంటివి లెక్కల్లోకి రానిచ్చేవారు కాదు. అటువంటి అవకాశం లేకుండా ఈ ఎన్నికల్లో ఈసీ ధరల జాబితాను రూపొందించింది. ఆ ధరల ప్రకారమే అభ్యర్థుల ఖర్చు లెక్కిస్తుంది. జెండాలు, ఫ్లెక్సీలు, టీ షర్టులు, టోపీలే కాకుండా కార్యకర్త తాగే వాటర్ ప్యాకెట్, టీ, తినే స్నాక్స్, ప్రచారాల్లో బెలూన్ కూడా వదిలి పెట్టకుండా లెక్కించనుంది. ఎన్నికల కమిషన్ 2022లో పెంచిన ధరల ప్రకారం పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి 90లక్షల రూపాయలు, అసెంబ్లీ అభ్యర్థి 40లక్షల వరకూ ఖర్చు చేయవచ్చు. కానీ ఏపీలో ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని జనరల్ సీట్లలో 40కోట్లు ఖర్చు చేసినా అభ్యర్థులు గెలవడం కష్టంగా మారింది. కాగా, ప్రధాన పార్టీలు అభ్యర్థుల్ని ప్రకటించాయి.. అధికార వైసీపీ మొత్తం 175 అసెంబ్లీ స్థానాలతోపాటు అనకాపల్లి మినహా 24 పార్లమెంటు స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించింది. టీడీపీ రెండు విడతల్లో 128 అసెంబ్లీ, జనసేన 16 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల జాబితాను ఇప్పటికే ప్రకటించాయి. బీజేపీ తనకు పొత్తులో భాగంగా లభించిన పది అసెంబ్లీ స్థానాలకు ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటించబోతోంది.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ శ్యాంసుందర్

శ్రీవారి సేవలో జస్టిస్ శ్యాంసుందర్

తిరుమల, మార్చి 16(ఆంధ్రజ్యోతి):ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



తిరుమలేశుడి సేవలో కంచి పీఠాధిపతి

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి శనివారం ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మంపై అందరికీ ఆసక్తి కలిగించడంతో పాటు నైతిక విలువలనూ పెంపొందించేలా అనుగ్రహించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

కోడ్ నేపథ్యంలో సిఫారసు లేఖల స్వీకరణ రద్దు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తిరుమలలో వసతి, శ్రీవారి దర్శనానికి సంబంధించి సిఫారసు లేఖల స్వీకరణను రద్దు చేసినట్టు టీటీడీ శనివారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు, వారి కుటుంబ సభ్యులకు నిర్దేశించిన విధి విధానాల మేరకు దర్శనం, వసతి కల్పిస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏ రకమైన వసతి, దర్శనాలకు సిఫారసులు తీసుకోబోమని తెలిపింది. వీఐపీలు, భక్తులు విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాలని కోరింది.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం

- అధైర్యపడొద్దు.. ఆత్మహత్యలొద్దు: లోకేశ్



అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తిగా న్యాయం చేకూర్చేందుకు తగిన కార్యాచరణ చేపడతామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. బాధితులెవరూ అధైర్యపడొద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు నేతృత్వంలో ప్రతినిధి బృందం శనివారం లోకేశ్‌ను కలిసింది. అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరింది. 'జగన్ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని హామీ ఇచ్చి... మాట నిలబెట్టుకోలేదు. సుమారు 10 లక్షల మందికి రూ. 3080 కోట్ల డిపాజిట్ సొమ్ము చెల్లించాల్సిన ఉంది. అగ్రిగోల్డ్ కంపెనీకి చెందిన రూ.వేల కోట్ల ఆస్తులు జప్తు చేసినప్పటికీ బాధితులకు న్యాయం జరగకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఇప్పటికే ఆర్థికంగా చితికిపోయిన అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొంతమంది గుండెపోటుతో చనిపోతున్నారు. ఈ పరిస్థితి చాలా బాధాకరం' అని ప్రతినిధి బృందం లోకేశ్‌కు వివరించింది. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. అసహజ మరణాలకు పాల్పడవద్దని తన మాటగా బాధితులకు చెప్పాలని ఆయన కోరారు.

కేశినేని నాని ఓ బృహన్నల

- క్యాష్ కోసం క్యారెక్టర్ అమ్ముకున్నాడు: బుద్దా వెంకన్న

విజయవాడ, మార్చి 16: టీడీపీలో నుంచి వైసీపీలోకి వెళ్లిన విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) క్యాష్ కోసం క్యారెక్టర్‌ను అమ్ముకున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడ వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కేశినేని చిన్నిపై, నాని ఎలాగూ గెలవలేడు. కేశినేని నాని మహాభారతంలో బృహన్నల వంటివాడు. బృహన్నలతో భీష్ముడు వంటి మా వాళ్లు యుద్ధం చేయరు. అతనికి పిచ్చి పట్టింది. కేశినేని చిన్నిని మూడు లక్షల మెజారిటీతో ఓడిస్తానని చెప్పడం హాస్యాస్పదం. లక్ష ఓట్ల మెజారిటీతో నానీని చిత్తుచిత్తుగా ఓడిస్తాం. టికెట్లు ఇప్పిస్తానని చెప్పి కేశినేని నాని డబ్బులు వసూలు చేశారు. అతను ఓడిపోవడం ఖాయం. అతని భవిష్యత్తు శూన్యం. నానీ... టీడీపీలో ఉన్నప్పుడు ఎలా ఉన్నావు? ఇప్పుడు నీ మొహం ఎలా ఉందో అద్దంలో చూసుకో నానీ. పిచ్చి వాగుడు మానుకుంటే మంచిది' అని వెంకన్న హితవు పలికారు.

స్టీల్ ప్లాంటు భూముల వేలం

- 29,268 గజాలకు రూ.243 కోట్ల రాబడి
- ఆశించిన దానికంటే 33.4 కోట్లు అధికం

విశాఖపట్నం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు నాన్‌కోర్ ఆస్తుల వేలం ద్వారా రూ.242.9 కోట్ల ఆదాయం సమకూరింది. స్టీల్‌ప్లాంటుకు హెచ్‌బీ కాలనీ, ఆటోనగర్, పెదగంట్యాడల్లో ఉద్యోగుల క్వార్టర్లు ఉన్నాయి. అవి బాగా పాతబడిపోవడంతో ప్రస్తుతం వాటిలో ఎవరూ ఉండటం లేదు. ఆర్థిక అవసరాల రీత్యా వాటిని విక్రయించాలని యాజమాన్యం నిర్ణయించింది. దీనికోసం నేషనల్ బిల్డింగ్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) ద్వారా వేలం వేయడానికి గతంలో ప్రకటన ఇచ్చారు. హెచ్‌బీ కాలనీలో 14 బ్లాక్‌లు, 111 ప్లాట్లు, ఆటోనగర్‌లో 4 బ్లాక్‌లు, పెదగంట్యాడలో ఒక బ్లాక్... మొత్తం 130 స్థలాలను వేలానికి పెట్టారు. వీటి మొత్తం విస్తీర్ణం 67,307 చ.గజాలు. ప్రాంతాన్ని బట్టి అప్‌సెట్ ధర నిర్ణయించారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన ఈ-వేలంలో 72 స్థలాలు అమ్ముడయ్యాయి. వాటిలో 9 బ్లాక్‌లు, 63 ప్లాట్లు ఉన్నాయి. వాటి మొత్తం విస్తీర్ణం 29,268 చ.గజాలు. వీటిద్వారా రూ.209.5 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అయితే వేలంలో కొన్నింటికి అధిక ధర లభించి రూ.242.9 కోట్ల ఆదాయం సమకూరింది. ఆశించిన దానికంటే రూ.33.4 కోట్లు అదనంగా వచ్చింది. హెచ్‌బీ కాలనీలో గజం ధర రూ.70,200 నుంచి 85,800 వరకు నిర్ణయించగా, అత్యధికంగా రూ.1,56,850 పలికింది. ఆటోనగర్‌లో గజానికి రూ.30 వేల నుంచి రూ.32వేలు నిర్ణయించగా రూ.35వేలు వచ్చింది. ఇక పెదగంట్యాడలో గజం రూ.20,500 నిర్ణయించగా, రూ.25,500కు అమ్ముడుపోయింది.

రోడ్డు ప్రమాదం కేసులో 1.12 కోట్ల పరిహారం

- జాతీయ లోక్ అదాలత్ ద్వారా బాధితురాలికి అందజేత

రాజమహేంద్రవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఓ బాధిత కుటుంబానికి భారీ ఊరట లభించింది. ఓఎన్‌జీసీలో రాజమహేంద్రవరం కేంద్రంగా యార్లగడ్డ సురేశ్‌బాబు(59) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేసేవారు. 2021 మార్చి 21న విజయవాడ నుంచి రాజమహేంద్రవరం కారులో వస్తుండగా చొప్పెల్ల లాకుల వద్ద ఓ వ్యాను.. ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టి ఆపై సురేశ్ ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆయన ఆస్పత్రిలో మరణించారు. ఆయన భార్య బృందాదేవి జిల్లా ప్రధాన న్యాయస్థానంలో కేసు వేశారు. ఆ కేసు ప్రస్తుతం విచారణలో ఉంది. శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరించుకోడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. దీంతో రాజీ మార్గంలో పరిష్కారం లభించడంతో బాధిత కుటుంబానికి చోళమండలం ఇన్సూరెన్స్ కంపెనీ రూ.1.12 కోట్లు పరిహారాన్ని అందజేయడానికి అంగీకరించింది. ఆ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయాధికారి గంధం సునీతకు చెక్కు అందజేసింది.

డీఏ, డీఆర్‌ల విడుదలపై ఏపీజేఏసీ హర్షం

విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్), మార్చి 16: ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు రెండు డీఏ/డీఆర్‌లను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం రెండు పెండింగ్ డీఏలు విడుదల చేయడంతో ఉద్యోగులు కొంతమేర ఆర్థికంగా ఊరట చెందుతారని చెప్పారు.

15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ తీర ప్రాంతంలోని ప్రాదేశిక సముద్ర జలాల్లో ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటను నిషేధిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా రాష్ట్రంలో ఆయిల్ పామ్ అభివృద్ధి కార్యక్రమం అమలు కోసం అనంతపురం, కాకినాడ, చిత్తూరు, తిరుపతి, పల్నాడు జిల్లాల్లోని 18 మండలాలను 8 కంపెనీలకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వచ్చేది మీరేగా...!

- టీడీపీ నాయకులతో గవర్నర్ చతురోక్తులు
- గ్రూప్-1 పరిణామాలపై విస్మయం
- మొత్తం వివరాలు తెప్పించాలని అధికారులకు ఆదేశం
- ఏపీపీఎస్సీ చైర్మన్ రీకాల్‌ను కోరిన టీడీపీ నాయకులు

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం తనను కలిసిన టీడీపీ నేతలపై చతురోక్తులు విసిరారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన గ్రూపు-1 ఉద్యోగాల భర్తీలో అక్రమాలపై విచారణ జరిపించాలని కోరడానికి వారు ఆయనను కలిశారు. 'వచ్చే ఎన్నికల్లో వచ్చేది మీరేగా! వచ్చిన తర్వాత ఆ విచారణ ఏదో మీరే జరిపించుకోండి" అని ఆయన వారితో నవ్వుతూ అన్నారు. తమ గెలుపు ఖాయమని, గవర్నర్ నజీర్ చేతుల మీదుగానే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని తాము కోరుకొంటున్నామని వారు చెప్పగా, ఆయన కూడా నవ్వారు. గవర్నర్‌ను వారు విజయవాడ రాజ్‌భవన్‌లో శనివారం సాయంత్రం కలిశారు. ఈ బృందంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పార్టీ నేతలు నక్కా ఆనందబాబు, బొండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, కొమ్మారెడ్డి పట్టాభిరాం ఉన్నారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ఉద్యోగాల భర్తీని హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో, వారు ఆయనను కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. జరిగిన విషయాలను వారు ఆయనకు వివరించారు. 'గ్రూప్-1 రాష్ట్రంలో ఉన్నతమైనవి. వాటికోసం లక్షల మంది అభ్యర్థులు ఏళ్ల తరబడి సిద్ధం అవుతారు. లక్షల రూపాయలు ఖర్చు చేస్తారు. ఇంత పెద్ద పరీక్షలను జగన్ ప్రభుత్వంలో అధికారులు ఒక కుంభకోణంగా మార్చేశారు. వీటిని చేతితో దిద్దిస్తామని ముందు ప్రకటించారు. తర్వాత డిజిటల్‌గా దిద్దించారు. అభ్యర్థులు కోర్టుకు వెళ్తే మళ్లీ చేతితో దిద్దించారు. ఆ ఫలితాలను పక్కన పడవేసి గౌతం సవాంగ్ ఏపీపీఎస్సీ చైర్మన్‌గా వచ్చిన తర్వాత మరోసారి దిద్దించారు. మొదటిసారి ఎంపికైన వారికి.. రెండోసారి ఎంపికైన వారికి సంబంధమే లేదు. ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ. రెండున్నర కోట్లకు, డీఎస్పీ పోస్టును రూ. కోటిన్నరకు అమ్ముకొన్నారు. దీనిపై కోర్టులో విచారణ జరిగితే చేతితో రెండుసార్లు దిద్దించలేదని, ఒకసారి మాత్రమే దిద్దించామని అధికారులు కోర్టులో అఫిడవిట్ సమర్పించారు. కానీ రెండుసార్లు దిద్దించినట్లు అభ్యర్థులు కోర్టుకు సాక్ష్యాలు సమర్పించారు. దీంతో కోర్టు ఈ ఎంపికలను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది" అని వారు వివరించారు. రెండుసార్లు దిద్దించలేదని అధికారులు కోర్టుకు అఫిడవిట్ కూడా సమర్పించారా అని గవర్నర్ విస్మ యం వ్యక్తంచేశారు. ఆ అఫిడవిట్ కాపీని టీడీపీ నేతలు గవర్నర్‌కు చూపించారు. అసలు ఏం జరిగిందని గవర్నర్ తన కార్యదర్శి సింఘాల్‌ను ప్రశ్నించారు. నియామకాలను కోర్టు రద్దు చేసేవరకూ జరిగిన పరిణామాలను ఆయన గవర్నర్‌కు వివరించా రు. 'కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటామని ఉద్యోగాలు పొందిన వారందరూ ముందుగానే అఫిడవిట్లు సమర్పించారు. ఇప్పుడు వారందరి ఉద్యోగాలు పోయినట్లే. వీరిలో కొందరికి ఇప్పుడు ఎన్నికల్లో డ్యూటీలు కూడా వేశారు. అవన్నీ మార్చించాల్సి ఉంది" అని ఆ అధికారి... గవర్నర్‌కు చెప్పారు. దీని పై సమగ్ర నివేదిక తెప్పించాలని గవర్నర్ తన కార్యదర్శిని ఆదేశించారు. కాగా, గవర్నర్‌తో తమ భేటీ సంతృప్తికరంగా జరిగిందని అచ్చెన్నాయుడు తెలిపారు.

టీడీపీ డిమాండ్లు ఇవీ..

- అక్రమాలు రుజువు అయినందువల్ల ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్‌ను రీకాల్ చేయాలి.
- ఏపీపీఎస్సీకి కార్యదర్శిగా వ్యవహరించిన మరో ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులుపై కేసు నమోదు చేసి విచారణ జరపాలి.
- మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలి.

సెల్‌ఫోన్ కోసం నానమ్మ హత్య

- ఇంట్లోనే పూడ్చిన మనవడు
- ఆమె ఒంటిపై బంగారం విక్రయించి మొబైల్ కొనుగోలు
- రెండువారాల తర్వాత వెలుగులోకి
- కర్నూలు జిల్లా గోనెగండ్లలో అమానవీయ ఘటన





నాగమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

గోనెగండ్ల మర్చి 16: సొంత నానమ్మను చంపి, ఆమె ఒంటిపై బంగారం తస్కరించి, మృతదేహాన్ని ఇంట్లోనే పాతిపెట్టాడు ఓ మనవడు. ఖరీదైన సెల్‌ఫోన్ కోసం ఈ దారుణానికి ఒడిగట్టాడు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలంలో శనివారం ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. వివరాలివీ.. గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ నాగమ్మ(80)కు చిన్నబజారి, పెద్దబజారి అనే ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు చిన్నబజారి కర్నూలులో స్థిరపడినా, ఊళ్లోనే సొంతింటిని నిర్మించి ఆ ఇంట్లో తన తల్లి నాగమ్మను ఉంచాడు. పెద్ద కుమారుడు పెద్దబజారి గ్రామంలో కూలి పనులు లేక పోవడంతో బతుకుదెరువు కోసం గుంటూరుకు భార్య, పిల్లలతో వలసవెళ్లాడు. వారి కుమారుడు వెంకటేశ్ అక్కడ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. కొత్త సెల్‌ఫోన్ కొనాలనుకున్నాడు. కానీ డబ్బులు లేక పోవడంతో ఓ పథకం వేశాడు. తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి పెద్ద మరివీడుకు వచ్చాడు. తన నానమ్మ నాగమ్మ దగ్గర ఉన్న బంగారాన్ని దొంగలించి ఆ డబ్బుతో ఖరీదైన సెల్‌ఫోన్ కొనుగోలు చేయాలని భావించాడు. అనుకున్నదే తడవుగా ఈ నెల 4వ తేదీ సాయంత్రం నాగమ్మ ఉన్న ఇంటికి వెళ్లాడు. అక్కడ నాగమ్మ గొంతు నులిమి హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నాడు. రాత్రి ఎవరూ తిరగని సమయంలో ఇంటి ఆవరణలో గుంత తవ్వి నాగమ్మను పూడ్చివేశాడు. ఏమీ తెలియనట్లు ఉదయం ఎమ్మిగనూరుకు వెళ్లి అక్కడ ఓ దుకాణంలో బంగారాన్ని రూ.29వేలకు విక్రయించాడు. రూ.25వేల పెట్టి కొత్త సెల్‌ఫోన్ కొన్నాడు. సాయంత్రం గుంటూరులోని తన తల్లిదండ్రులకు దగ్గరకు వెళ్లాడు. ఇంతలో ఈ నెల 13వ తేదీన నాగమ్మ చిన్నమనుమడు గోపాల్ గ్రామానికి వచ్చాడు. తన నానమ్మ నాగమ్మ ఇంట్లో లేకపోవడంతో అనుమానం వచ్చి గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకటేశ్ నాగమ్మ వద్దకు వచ్చి వెళ్లిన తరువాత ఈ సంఘటన జరగడంతో తమదైన శైలిలో వెంకటేశ్‌ను విచారించగా హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. ట్రైనీ డీఎస్పీ, గోనెగండ్ల సీఐ, పోలీసులు, వైద్యులు, తహసీల్దార్ సమక్షంలో 13 రోజుల తరువాత శనివారం నాగమ్మ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం జరిపించారు. కేసు నమోదు చేసుకుని వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడేళ్లుగా నాన్చి.. నాన్చి..!

- ఎట్టకేలకు ఆర్థికశాఖ ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేత
- కోడ్ వచ్చిన గంటల వ్యవధిలోనే ఉత్తర్వులు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఆర్థిక శాఖలోని ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ విధించిన జగన్ సర్కార్, మూడేళ్లుగా నాన్చి నాన్చి.. ఎట్టకేలకు వారి సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ శనివారం ఉత్తర్వులిచ్చింది. సస్పెండ్ అయిన వారిలో ఎస్‌వోలు కసిరెడ్డి వరప్రసాద్, డి. శ్రీనుబాబు, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ ముగ్గురినీ తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. 2021 ఆగస్టులో వీరిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. జగన్ సర్కార్ చేస్తున్న అడ్డగోలు అప్పులు, ఆర్థిక అవకతవకలు, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చుతున్న వైనంపై మీడియాలో వరుసకథనాలు వచ్చాయి. ఈ అవకతవకలను కేంద్రం, ఆర్‌బీఐ కూడా తప్పుబట్టాయి. మీడియాకు, విపక్షాలకు సమాధానం ప్రభుత్వం సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇంత రహస్య సమాచారం బయటకువెళ్లడానికి ఆ ముగ్గురు ఉద్యోగులే కారణమని పేర్కొంటూ వారిపై సస్పెన్షన్ వేటు వేసింది. వీరిని సస్పెండ్ చేశాక కూడా ప్రభుత్వ ఆర్థిక అవకతవకలపై నేటికీ మీడియాలో కథనాలు వెలువడుతూనే ఉన్నాయి. సాధారణంగా ఉద్యోగులను సస్పెండ్ చేస్తే రెండేళ్లలోగా సస్పెన్షన్ తొలగించాలి. ఇటీవల ఈ సస్పెన్షన్ కాలాన్ని ఏడాదికి కుదించారు. ప్రతి 4 నెలలకొకసారి సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాలి. కానీ, ఈ ముగ్గురి విషయంలో ఏ ఒక్క నిబంధననూ ప్రభుత్వం పాటించలేదు. ఈముగ్గురిలో ఏఎస్ వెంకటేశ్వర్లు సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ కోర్టుకు వెళ్లారు. సస్పెన్షన్ ఎత్తేసి, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాలు ప్రభుత్వానికి అంది 2 నెలలు దాటిపోయింది. కోర్టు తీర్పు మేరకు ఆర్థిక శాఖ ఉద్యోగులు ఫైలు సిద్ధం చేసినప్పటికీ ఈ 2 నెలల నుంచి ఉన్నతాధికారులు ఆ ఫైలుపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. కానీ, ఎన్నికల కోడ్ వచ్చిన గంటల వ్యవధిలోనే ఆ ఉత్తర్వులు బయటికి రావడం గమనార్హం.

వైఎస్ వారసురాలు షర్మిలే!

- రాహుల్‌ను పీఎం చేయడం వైఎస్ కల..
- ఆ కల కోసం పనిచేస్తున్న షర్మిల
- రాష్ట్రం విడిపోయి పదేళ్లు
- పోలవరం పూర్తికాలేదు, హోదా రాలేదు, రాజధాని లేదు
- మోదీని నిలదీసే నాయకులు రాష్ట్రంలో లేరు
- విశాఖ ఉక్కు దరిదాపుల్లోకి ఎవరినీ రానివ్వం
- సాటి తెలుగువాడిగా ఆంధ్రకు అండగా ఉంటాను
- విశాఖ 'ఉక్కు' సభలో తెలంగాణ సీఎం రేవంత్





న్యాయ సాధన సభకు హాజరైన జనం, సభలో రేవంత్‌రెడ్డి, షర్మిల అభివాదం

విశాఖపట్నం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రజల అండదండలు ఉన్నప్పటికీ ప్రశ్నించే గొంతుకలు మూగబోయాయని తెలంగాణ సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, జగన్ పాలకులు కావాలని అనుకుంటున్నారే తప్ప.. ప్రశ్నించే గొంతుకలు కావాలనుకోవడం లేదని దుయ్యబట్టారు. ఏపీ నాయకులకు ప్రశ్నించే తత్వం లేనందునే ఈ రాష్ట్రం విడిపోయి పదేళ్లయినా పోలవరం పూర్తి కాలేదనీ, ప్రత్యేక హోదా రాలేదనీ, అమరావతి రాజధాని నిర్మాణం జరగలేదనీ అన్నారు. ఢిల్లీ వెళ్లి వంగి వంగి నమస్కారాలు పెట్టేవారున్నారు తప్ప ఏపీలో ప్రధాని మోదీని నిలదీసే నాయకులు ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి విశాఖ ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ న్యాయ సాధన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భౌగోళికంగా రెండు రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు వారికి ఎక్కడ అన్యాయం జరిగినా అందరూ కలిసి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కురుక్షేత్రంలో కౌరవులు, పాండవుల మధ్య యుద్ధం జరిగిందని, కానీ తమపైకి ఎవరైనా వస్తే వారు 105 మంది ఏకమై పోరాటాలు చేశారన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అదానీకి ప్రధాని మోదీ విక్రయిస్తుంటే పహిల్వాన్‌లమని చెప్పుకొంటున్న నాయకులు ప్రశ్నించడం లేదని విమర్శించారు. "ఆంధ్రప్రదేశ్ అంటే దివంగత నేతలు నీలం సంజీవరెడ్డి, నందమూరి తారక రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వెంకయ్యనాయుడు గుర్తుకొస్తారు. వారి హయాంలో ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి అన్యాయం జరిగితే నిలదీసేవారు. ప్రస్తుతం ప్రశ్నించే నాయకులు ఏపీలో లేరు" అని అన్నారు.

రేవంత్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే..

"విశాఖ సభకు నేను వస్తున్న విషయం తెలుసుకున్న కొంతమంది మిత్రులు.. ఏపీలో కాంగ్రెస్ లేనందున సభ విఫలం అవుతుందని హెచ్చరించారు. అయితే ఏపీలో వైఎస్ వారసురాలు ఉన్నందున తప్పకుండా ఇక్కడి ప్రజలు ఆమెను ఆశీర్వదిస్తారనే ధైర్యంతో వచ్చాను. నా మనస్సులో ఉన్న విధంగానే ఇక్కడ సభకు హైదరాబాద్‌లో కాంగ్రెస్ సభ మాదిరిగానే భారీగా ప్రజలు తరలిరావడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఉమ్మడి ఏపీలో వైఎస్ ప్రజల పక్షాన గొంతుకై చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేసి 2004లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంతోపాటు కేంద్రంలో యూపీఏ ఏర్పాటుకు ప్రధాన కారణమయ్యారు. రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాలు ప్రారంభించారు"

ఈ 'మోతగాళ్లు' ఏమీ చేయలేరు..

"ఏపీలో మోదీకి సొంత బలం, బలగం లేవు. ఇక్కడున్న ప్రాంతీయ పార్టీల నాయకులే ఆయనకు అన్నీ. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్. వారిలో ఎవరు గెలిచినా ఢిల్లీ వెళ్లి మోదీ చంకెక్కుతారేగానీ, ఆయనను నిలదీసే పరిస్థితి ఉండదు. మోదీని నిలదీసే నాయకులు కావాలి. ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాలరావు పక్కన మోతగాళ్ల మాదిరిగా....ప్రధాని చుట్టు జగన్, చంద్రబాబు తయారయ్యారు. అటువంటి వ్యక్తిని నిలదీయాల్సిన సమయం వచ్చింది."

వైఎస్ఆర్ అంటే వై షర్మిలారెడ్డి..

"రాజశేఖర్‌రెడ్డి తన జీవితకాలంలో ఎన్నడూ బీజేపీతో అంట కాగలేదు. లౌకికవాద శక్తులకు అండగా ఉన్నారు. ఇప్పుడు వైఎస్ వారసులమని చెప్పుకొంటున్న వ్యక్తులు మతోన్మాద శక్తులకు అండగా ఉంటున్నారు. మణిపూర్‌లో మారణకాండపై ఇక్కడి పాలకుడు మౌనం పాటిస్తే, ఒక్క షర్మిల మాత్రమే ఆ విషయం ప్రస్తావించారు. మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోద్రాలో జరిగిన మారణకాండను నాడు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిలదీశారు. మతోన్మాద శక్తులకు వత్తాసు పలికే వ్యక్తులెవరూ వైఎస్ వారసులు కాబోరు. షర్మిలాయే వైఎస్ రాశేఖర్‌రెడ్డి వారసురాలు. ఆమె పేరులోనే వైఎస్ఆర్ ఉంది. వైఎస్ఆర్ అంటే వై షర్మిలారెడ్డి"

కాంగ్రెస్ జెండా పాతి తీరుతాం..

"1978లో రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచీ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. ఇప్పుడు ఆయన కుమార్తె ఆంధ్ర ప్రజల కష్టాలు చూసి చలించిపోయారు. తెలంగాణలో ఉన్న ఆమె, ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తానని చెప్పినప్పుడు నిండు మనస్సుతో ఆశీర్వదించాను. కొందరు పాలకులు అచ్చేసిన ఆంబోతుల్లా వ్యవహరిస్తూ ప్రజలకు మేలు కంటే కీడే ఎక్కువ చేస్తున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం అమ్మితే ఊరుకునే ప్రసక్తే లేదని ఢిల్లీ పెద్దలను నిలదీసే నాయకులు కావాలి. అందుకు షర్మిల తగిన వ్యక్తి. జగన్, బాబు, పవన్‌కు మోదీ ముందు నిలబడే శక్తి ఉందా? వచ్చే ఎన్నికల్లో ఏపీలో 5 ఎంపీ, 25 ఎమ్మెల్యే స్థానాలు ఇస్తే విశాఖ ఉక్కును కాపాడుకుంటాం. ఈ కర్మాగారం దరిదాపులకు ఎవరూ వచ్చే సాహసం చేయబోరు. భవిష్యత్తులో షర్మిల సీఎం అవుతారు ఎన్నికల ప్రచారంలో భాగంగా మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు వస్తాను."

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

- కేసుల నుంచి బయటపడేందుకు చిన్నాన్న హంతకులను కాపాడేందుకే ఢిల్లీ టూర్‌లు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే హోదా: షర్మిల హామీ

విశాఖపట్నం/గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, మార్చి 16: రాష్ట్ర విభజన తరువాత ఇబ్బందుల పరిష్కారం, నిధుల విడుదల, రాజధాని, పోలవరం నిర్మాణం, ప్రత్యేక హోదా సాధన కోసం సీఎం జగన్ ఏనాడూ ప్రయత్నించలేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆరోపించారు. శనివారం ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించిన 'న్యాయ సాధన సభ'లో ఆమె పాల్గొని ప్రసంగించారు. "ఐదేళ్లుగా సీఎం హోదాలో ఢిల్లీకి వెళుతున్నారు. వస్తున్నారు...కానీ ఇక్కడ ప్రజల కోసం కేంద్ర పెద్దలను ఏమీ అడగలేదు. కేవలం తనపై ఉన్న కేసుల నుంచి బయటపడడం కోసం, సొంత చిన్నాన్నను చంపిన హంతకులను కాపాడేందుకు వెళుతున్నారు" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..

విశాఖ ఉక్కు.. ఓ సెంటిమెంట్.. ఎమోషన్

"విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్రుల ఊపిరి. 32 మంది ప్రజల బలిదానంతో ఏర్పడిన ఈ కర్మాగారంతో ప్రజలకు భావోద్వేగ బంధం ఉంది. విశాఖ ఉక్కు అంటేనే ఒక ఎమోషనల్. ఒక సెంటిమెంట్. ఉక్కు కర్మాగారం కోసం ఉద్యమంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నాడు తెలంగాణలోని వరంగల్‌లో ఉక్కు ఉద్యమానికి సంఘీభావంగా 25 వేల మందితో సభ నిర్వహించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఇందిరమ్మ నెలకొల్పితే పీవీ నరసింహారావు జాతికి అంకితం చేశారు. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ఉక్కు కర్మాగారం కోసం అనేక రకాలుగా సహాయపడడంతోపాటు సొంత గనుల కోసం ప్రయత్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చేంత వరకు విశాఖ ఉక్కు లాభాల్లోనే ఉంది. అప్పుల పేరుతో ప్రైవేటీకరణకు తెరతీశారు. సొంత గనులు ఇవ్వడం లేదు. బొగ్గు ఇవ్వడం లేదు. ఇలా చేతులు, కాళ్లు నరికేసి మొండెం మిగిల్చారు"

వైఎస్ గంగవరం కడితే..జగన్ అమ్మేశాడు

గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను కేవలం రూ.600 కోట్లకు జగన్ అమ్మేశారు. గంగవరం పోర్టును వైఎస్ హయాంలో నిర్మిస్తే, జగన్ అమ్మేశారు. ఇక్కడ ఉన్న జింక్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించి చివరకు రియల్ ఎస్టేట్‌కు విక్రయించారు. ఉద్యోగాలకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకమని జగన్ ఒక్క తీర్మానం చేసి సరిపెట్టుకున్నారే తప్ప ఎందుకు ఉద్యమించలేదు? ఉక్కు కర్మాగారం అమ్ముతున్న బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారు. ఇద్దరు నాయకులూ మోదీ దగ్గర రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన ఇటువంటి నాయకులను గెలిపించడం అవసరమా? వైసీపీ ఎమ్మెల్యేలను ఒకచోట నుంచి మరో చోటకు బదిలీ చేశారు. ఒకచోట పనికిరాని వ్యక్తి మరో చోట ఎలా పనికి వస్తాడు? రాష్ట్రంలో లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోంది. పదేళ్లలో రాజధాని కట్టలేదు. మద్యం నిషేధిస్తేనే ఈసారి ఓట్లు అడుగుతామని చెప్పిన పెద్దమనిషి...అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం విక్రయిస్తున్నారు. విచిత్రమైన బ్రాండ్‌లతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 15 ఏళ్ల ప్రత్యేక హోదా కావాలన్న వ్యక్తి(జగన్‌ను ఉద్దేశించి) మాట మార్చారు. ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. కేంద్రంలోకి అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తాం. వైసీపీ, టీడీపీ వద్ద నగదు తీసుకొని ఓటు కాంగ్రెస్‌కు వేయాలి" అని షర్మిల కోరారు.

విద్యుత్ ఇంజనీర్లకు ఆకస్మిక స్థానచలనాలు

ఎన్నికల కోడ్ ఇలా కూసిందో లేదో.. ఏపీ విద్యుదుత్పత్తి సంస్థల్లో బదిలీలు పరుగులెత్తాయి. బదిలీలపై నిషేధం ఎత్తివేయకపోయినా, ప్రత్యేకంగా మార్గదర్శకాలు విడుదల చేయకపోయినా, అర్ధంతరంగా..ఆకస్మికంగా జెన్కో యాజమాన్యం హడావుడిగా 14 మంది ఇంజనీరింగ్ ఉద్యోగులను బదిలీ చేసేసింది. సర్వత్రా దీనిపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.

రాక్షస పాలన నుంచి కోడ్‌తో విముక్తి

- స్వేచ్ఛగా బయటకు వచ్చి మీ అభిప్రాయాలు చెప్పండి
- ప్రజలిచ్చే తీర్పుతో సైకో కళ్లు తిరిగి మూర్ఛపోక తప్పదు
- కేంద్రం, రాష్ట్రంలో ఏర్పడేది ఎన్డీఏ ప్రభుత్వాలే: చంద్రబాబు
- న్యాయవాదులపై బాబు వరాల జల్లు
- టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఎన్నికల సమ్మిట్


> మరో 57 రోజుల్లో చరిత్ర తిరగరాయబోతున్నాం. గతంలో ఎన్నడూ రాని మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాం. ఈ దుర్మార్గుడి పవర్ కట్ కాబోతోంది. - చంద్రబాబు



అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ రావడంతో రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించినట్లు అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఇకపై ప్రజలందరూ స్వేచ్ఛగా బయటకు వచ్చి తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. కేసులు పెడతారనో, ప్రభుత్వ పథకాలు, పింఛన్లు నిలిపివేస్తారనో ఆందోళన అవసరం లేదని చెప్పారు. టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన జనరల్ ఎలక్షన్ సమ్మిట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులపై చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్వర్ణయుగాన్ని తలపించేలా వారికి పనులు చేస్తామని, ఇళ్ల పట్టాలు ఇస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయమిత్ర పేరుతో జూనియర్ న్యాయవాదులకు రూ.7,000 స్టయిపండ్ అందజేస్తామని హామీ ఇచ్చారు. లానేస్తం పేరుతో జగన్ ప్రభుత్వంలో కేవలం 2,670 మందికే గౌరవ వేతనం ఇచ్చారని, తమ ప్రభుత్వం వచ్చాక దీన్ని 3,500కు పెంచుతామని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు ఇస్తామన్నారు. మెడిక్లెయిమ్‌కి రూ.5లక్షలు, ప్రమాద బీమా కింద రూ.15లక్షలు చెల్లిస్తామని, అందుకు సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో న్యాయవాదులకు ఏ మేలూ జరగలేదని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులతో లీగల్‌సెల్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లు పెట్టుకోవాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం తనపై ఎన్ని కేసులు నమోదయ్యాయో తెలుసుకొనేందుకు డీజీపీ, అధికారులకు లేఖ రాయాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. నామినేషన్ వేసే ప్రతీ అభ్యర్థీ తనపై ఎన్ని కేసులు ఉన్నాయో అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. కోడ్ రావడంతో ఉన్మాదుల నుంచి స్వాతంత్ర్యం వచ్చినంత ఆనందంగా ప్రజలు పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. ఉన్మాది నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు మేధావులంతా ముందుకురావాలని కోరారు. దుర్మార్గ పాలనలో ప్రతిపక్ష నాయకులు, న్యాయవాదులు నిద్రలు లేని రాత్రులు గడిపారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేసి చట్టవిరుద్ధంగా కస్టడీలో ఉంచేవారని, వారిని కాపాడేందుకు న్యాయవాదులు పోలీస్ స్టేషన్ బయట నిద్రలేని రాత్రులు గడిపారని వివరించారు. ఒక క్లయింట్‌గా ఎన్ని అవస్థలు పడ్డానో తనకు తెలుసన్నారు. ఈ ఐదేళ్లు ఒక ఎత్తు అయితే రాబోయే 57 రోజులు ఒక ఎత్తు అని చెప్పారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా దుర్మార్గుడి పాలనపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తన45ఏళ్ల రాజకీయ జీవితంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి చట్టాన్ని చూడలేదని, అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో నామినేషన్ల దాఖలు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల కోడ్, వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఎలా వేధించిందో న్యాయవాదులు వివరించారు.

ఎన్నికల వేళ ఉద్యోగులపై జీవోల వర్షం

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఐదేళ్ల అధికారంలో ఉద్యోగులకు పెద్దగా ఒరగబెట్టింది ఏమీలేదనే విమర్శలున్నాయి. అయితే, కోడ్ ముందు రోజైన శుక్రవారం అర్ధరాత్రి ప్రభుత్వం రెండు డీఏలకు సంబంధించిన జీవోలు ఇచ్చింది. శనివారం కోడ్ అమల్లోకి వస్తుందనగా... మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులకు సంబంధించిన జీవోను విడుదల చేసింది. మహిళా ఉద్యోగులకు ఇస్తున్న పిల్లల సంరక్షణ సెలవులను ఉద్యోగి పిల్లలకు 18 సంవత్సరాల వయసులోపే వాడుకోవాలన్న నిబంధనలను సడలించి ఉద్యోగి సర్వీసు కాలంలో ఎప్పుడైనా వాడుకునే అవకాశం కల్పిస్తూ సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ఆరు నెలలు ప్రసూతి సెలవులను ప్రొబేషన్ పీరియడ్‌లోపు మహిళా ఉద్యోగి వాడకుంటే సదరు కాలాన్ని డ్యూటీ పీరియడ్‌గా పరిగణిస్తూ ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికల ముందు ఉత్తర్వులు జారీ చేసింది.



ఎన్నికల నగారా మోగింది. ప్రజాక్షేత్రంలో రాజకీయ సమరం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేయడంతో కోడ్ అమల్లోకొచ్చింది. రాష్ట్రంలోని అన్ని స్థానాలతోపాటు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకు ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. మే 13న పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. గత ఎన్నికల్లో టీడీపీ ఎలాంటి పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేయగా ఈసారి జనసేన, బీజేపీతో కలిసి బరిలోకి దిగనుంది. ఇప్పటికే అధికశాతం స్థానాల్లో ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను వైసీపీ శనివారం ప్రకటించింది. టీడీపీ 10 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మరో రెండు స్థానాలను మిత్రపక్షాలైన జనసేన, బీజేపీకి కేటాయించింది. ఈ స్థానాల నుంచి కూడా అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

ఇక సమరమే..!

వెలువడిన ఎన్నికల షెడ్యూల్





- 10 స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ఖరారు
- పెండింగ్‌లో 2 స్థానాలు.. మరో 2 మిత్రులకు
- గత ఎన్నికల్లో అసెంబ్లీ బరిలో 180 మంది
- పార్లమెంటు బరిలో 27 మంది అభ్యర్థులు

అన్ని స్థానాలకు వైసీపీ అభ్యర్థులు ఖరారు

(విజయవాడ- ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో రెండు పార్లమెంటు, 14 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వైసీపీ మొత్తం స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున పార్లమెంటుకు బరిలో నిలిచే అభ్యర్థులపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. మచిలీపట్నం పార్లమెంటును జనసేనకు కేటాయించగా ఆ స్థానం నుంచి వల్లభనేని బాలశౌరి పోటీ చేయనున్నారు. విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి కేశినేని చిన్ని బరిలో నిలవనున్నారు. కూటమి తరఫున టీడీపీ 12 స్థానాలకు పోటీ చేస్తుండగా ఇప్పటికే 10 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మైలవరం, పెనమలూరు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. విజయవాడ పశ్చిమ బీజేపీకి కేటాయించగా.. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు బబ్బూరి శ్రీరామ్, ప్రస్తుతం అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఇటీవలే పార్టీలో చేరిన ఎన్ఆర్ఐ గొలగాని రవికృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త బొలిశెట్టి శివకుమార్ టికెట్ రేసులో ఉన్నారు. అడ్డూరి శ్రీరామ్, గొలగాని రవికృష్ణ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు. బబ్బూరి శ్రీరామ్ కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేత. శివకుమార్ ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందినవారు. అవనిగడ్డ జనసేన ఖాతాలోకి వెళ్లింది. ఈ స్థానం నుంచి అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. ఒకటి రెండు రోజుల్లో కూటమి అభ్యర్థులపైనా స్పష్టత రానుంది. ఇక అధికార పక్షం వైసీపీ గద్దెనెక్కిన నాటి నుంచి అవలంబిస్తున్న విధ్వంసపూరిత రాజకీయాలు, ఒక చేత్తో ఇస్తూ మరో చేత్తో లాగేస్తూ సంక్షేమం మాటున పేద ప్రజలను మోసం చేస్తున్న విధానాన్ని ఈ ఎన్నికల్లో టీడీపీ ఎండగడుతోంది. రాష్ట్ర విభజన తర్వాత తొలి ఐదేళ్లలో శరవేగంగా జరిగిన అభివృద్ధి ఆ తర్వాత వైసీపీ పాలనలో ఒక్కసారిగా కుప్పకూలిన తీరును ఇప్పటికే టీడీపీ నేతలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇసుక, మద్యం పేరుతో వేలకోట్ల రూపాయలను వైసీపీ కొల్లగొట్టిన తీరు ఇప్పటికే ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ అంశాలన్నీ అధికార వైసీపీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను తీసుకొచ్చాయి. అయితే అర్థబలం, అంగ బలం తోడుగా ఎలాగైనా గెలవాలని వైసీపీ నేతలు విశ్వ ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో ఈ ఎన్నికలు గతంలో ఎన్నడూలేని రీతిలో హోరాహోరీగా జరగనున్నాయి.



ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో విజయవాడలోని పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద బ్యానర్లను తొలగిస్తున్న సిబ్బంది

● తొలిసారి బరిలో..

వైసీపీ ఇప్పటికే అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ పార్టీ తరఫున ఎంపీ, ఎమ్మెల్యేలుగా మొత్తం ఐదుగురు తొలిసారి ఎన్నికల బరిలో నిలవనున్నారు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు, విజయవాడ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్, మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, పెడన అభ్యర్థి ఉప్పాల రాము తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఇక టీడీపీ ఇప్పటి వరకు ప్రకటించిన 10 మంది అభ్యర్థుల్లో ముగ్గురు కొత్తవారు కాగా, విజయవాడ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న కేశినేని చిన్ని కూడా తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము, పామర్రు అభ్యర్థి వర్ల కుమార్ రాజా, తిరువూరు అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్ తొలిసారి బరిలో నిలుస్తున్నారు.

సామాజికవర్గాల వారీగా..


సామాజికవర్గం	టీడీపీ	వైసీపీ
ఓసీ	5 (కమ్మ-3, కాపు-1, వైశ్య-1)	7 (కమ్మ-3, కాపు-3, వైశ్య-1)
బీసీ	2 (గౌడ-1, అగ్నికుల క్షత్రియ-1)	3 (యాదవ-1, గౌడ-2)
ఎస్సీ	3 (మాల-0, మాదిగ-3)	3 (మాల-1, మాదిగ-2)
మైనారిటీ	---	1

ఉమ్మడి కృష్ణా జిల్లాలో బరిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	టీడీపీ	వైసీపీ
1. విజయవాడ తూర్పు	గద్దె రామ్మోహనరావు (కమ్మ)	దేవినేని అవినాశ్ (కమ్మ)
2. విజయవాడ పశ్చిమ	బీజేపీ	షేక్ ఆసిఫ్ (మైనార్టీ)
3. విజయవాడ సెంట్రల్	బొండా ఉమామహేశ్వరరావు (కాపు)	వెలంపల్లి శ్రీనివాసరావు(వైశ్య)
4. పెనమలూరు	----	జోగి రమేశ్ (గౌడ, బీసీ)
5.గన్నవరం	యార్లగడ్డ వెంకట్రావు (కమ్మ)	వల్లభనేని వంశీమోహన్ (కమ్మ)
6. మైలవరం	----	సర్నాల తిరుపతిరావు (యాదవ, బీసీ)
7. మచిలీపట్నం	కొల్లు రవీంద్ర (అగ్నికుల క్షత్రియ, బీసీ)	పేర్ని కిట్టు (కాపు)
8. గుడివాడ	వెనిగండ్ల రాము (కమ్మ)	కొడాలి నాని (కమ్మ)
9. పామర్రు	వర్ల కుమార్ రాజా (మాదిగ, ఎస్సీ)	కైలే అనిల్ కుమార్ (మాల, ఎస్సీ)
10. పెడన	కాగిత కృష్ణ ప్రసాద్ (గౌడ, బీసీ)	ఉప్పాల రమేశ్ అలియాస్ రాము (గౌడ, బీసీ)
11. అవనిగడ్డ	జనసేన	సింహాద్రి రమేష్ బాబు (కాపు)
12. తిరువూరు	కొలికపూడి శ్రీనివాసరావు (మాదిగ, ఎస్సీ)	నల్లగట్ల స్వామిదాసు (మాదిగ, ఎస్సీ)
13. నందిగామ	తంగిరాల సౌమ్య (మాదిగ, ఎస్సీ)	మొండితోక జగన్మోహనరావు (మాదిగ, ఎస్సీ)
14. జగ్గయ్యపేట	శ్రీరాం తాతయ్య (వైశ్య)	సామినేని ఉదయభాను (కాపు)

ఆ రెండు స్థానాలపై ఉత్కంఠ!

మైలవరంలో వసంత ఆత్మీయ సమావేశాలు



దేవినేని ఉమా



గొట్టిపాటి రామకృష్ణ

- పెనమలూరుపై కొనసాగుతున్న సస్పెన్స్
- బోడె ప్రసాద్‌కు టికెట్ లేదని స్పష్టం చేసిన చంద్రబాబు
- పరిశీలనలో దేవినేని ఉమా, న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ పేర్లు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం, కృష్ణా జిల్లాలోని పెనమలూరు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసే టీడీపీ అభ్యర్థులపై సస్పెన్స్ నెలకొంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ స్థానాల్లో 12 స్థానాల నుంచి టీడీపీ, ఒక స్థానం నుంచి బీజేపీ, ఒక స్థానం నుంచి జనసేన పోటీ చేయనున్నాయి. టీడీపీ ఇప్పటికే 10 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా పెనమలూరు, మైలవరం స్థానాలను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. మైలవరం సిటింగ్ వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆ పార్టీని వీడి టీడీపీలో చేరడంతో మైలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమ అభ్యర్థిత్వం పెండింగ్‌లో పడింది. మైలవరం నుంచి వసంత కృష్ణప్రసాద్‌ను బరిలో దించేందుకు టీడీపీ పెద్దలు మొగ్గు చూపుతున్నారు. వసంత కృష్ణ ప్రసాద్ కూడా ఇప్పటికే నియోజకవర్గంలో తిరుగుతూ టీడీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలను నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్లలో తన వల్ల ఏమైనా ఇబ్బందులు ఎదురై ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నానంటూ వారిని తనతో కలుపుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అధికారికంగా ప్రకటించిన తర్వాతే పార్టీ జెండాతో ప్రచారం నిర్వహించాలన్న ఉద్దేశంతో ఆయన ఉన్నారు. ఈలోగా టీడీపీ శ్రేణులతో ఉన్న దూరాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఆదివారం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో జరిగే ప్రజాగళం సభకు జనసమీకరణ సైతం వసంత చేపట్టారు. ఇక పెనమలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున బరిలో నిలిచేందుకు పలువురి పేర్లను పార్టీ పెద్దలు పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బోడె ప్రసాద్‌కు ఈసారి అవకాశం ఇవ్వలేకపోతున్నామని పార్టీ అధినేత చంద్రబాబు స్వయంగా పిలిచి చెప్పారు. దీంతో ఈ స్థానం నుంచి దేవినేని ఉమా బరిలో ఉంటారని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. పార్టీ పట్ల, అధినేత పట్ల విధేయత, రాష్ట్రవ్యాప్తంగా దేవినేని ఉమకు ఉన్న గుర్తింపు ఆయనకు కలిసి వచ్చే అంశాలుగా ఉమ అనుచరులు చెబుతున్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘకాలం పార్టీకి సేవలందించడం, నియోజకవర్గానికి స్థానికుడు కావడం గొట్టిపాటికే కలిసి వచ్చే అంశాలని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఓ దశలో ఈ స్థానం నుంచి మైనారిటీని రంగంలోకి దించేందుకు టీడీపీ పెద్దలు సిద్ధమవుతున్నారన్న ప్రచారం కూడా వచ్చింది. ఏదేమైనా పెనమలూరు నియోజకవర్గంపై ఉత్కంఠకు రెండుమూడు రోజుల్లో తెరపడే అవకాశం ఉందని సమాచారం.

కిడ్నీ వ్యాధిగ్రస్థురాలు మృతి

ఎ.కొండూరు, మార్చి 16 : ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ వ్యాధిగ్రస్థులు పిట్టల్లా రాలిపోతున్నారు. మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామ శివారు దీప్లానగర్‌తండాకు చెందిన భరోతు జామక (50) అనే మహిళా కిడ్నీ వ్యాధికి గురైంది. డాక్టర్ల సలహా మేరకు విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మందులు వాడుతోంది. జామకకు వ్యాధి తీవ్రత పెరగడంతో రెండేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటోంది. శనివారం ఆమె తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ ఆస్తులు అమ్ముకొని వైద్యం చేయించినా ప్రాణాలు దక్కలేదని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.



మృతురాలు జామక (ఫైల్)



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-19 (ఆది)
సహర్ (ఉదయం) : 5-02 (సోమ)

ఎన్నికల కోడ్ అమల్లోకి..

శాఖల వారీగా ప్రవర్తనా నియమావళి అమలుకు కలెక్టర్ల ఆదేశాలు

- 6లో..

నేడు.. ప్రధాని మోదీ రాక

● గన్నవరం విమానాశ్రయంలో భారీ బందోబస్తు



గన్నవరం, మార్చి 16 : ప్రధాని నరేంద్ర మోదీ రాకను పురస్కరించుకుని గన్నవరం విమానాశ్రయం వద్ద పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. చిలకలూరిపేటలో జరగనున్న ప్రజాగళం సభకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం మధ్యాహ్నం 1.50కి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి సాయంత్రం 4.10 చేరుకుంటారు. ఇక్కడి నుంచి ఎంఐ-17 హెలికాప్టర్‌లో 4.15 గంటలకు బయలుదేరి పల్నాడు హెలిప్యాడ్‌కు 4.55కి చేరుకుంటారు. హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బహిరంగ సభ వద్దకు 5 గంటలకు వెళతారు. బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం తిరిగి 6.55 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో 7 గంటలకు బయలుదేరి బేగంపేట విమానాశ్రయానికి వెళతారు. ప్రధాని రాక సందర్భంగా 400 మందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయ ప్రాంగణాన్ని ఎస్పీజీ కమాండోస్ ఆధీనంలోకి తీసుకున్నాయి. విమానాశ్రయ పరిసర గ్రామాల్లో కూడా బందోబస్తు ఏర్పాటు చేసి బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. శనివారం కాన్వాయ్ ట్రైయల్ రన్ జరిగింది. డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీలు అద్నాన్ నయీమ్ అస్మి, మేరీ ప్రశాంతి, అజీత జెవెల్లా తదితరులు విమానాశ్రయాన్ని పరిశీలించారు. ప్రధాని మోదీ రాకను పురస్కరించుకుని కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

కొద్దిరోజుల క్రితం విజయవాడకు చెందిన ఓ వ్యక్తికి ముంబయి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అవతలి వైపు నుంచి మాట్లాడుతున్న వ్యక్తి తాను ముంబయి క్రైం బ్రాంచ్ అధికారినని చెప్పాడు. "మీరు థాయ్‌ల్యాండ్‌కు పంపిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి. ఆ పార్సిల్‌ను మేం పట్టుకున్నాం. మీరు విచారణకు ముంబయి రావాల్సి ఉంటుంది. ఒకసారి స్కైప్ కాల్‌లోకి రండి" అని చెప్పాడు. వెంటనే ఆ వ్యక్తి స్కైప్ కాల్‌లోకి వెళ్లాడు. విచారణకు రాకుండా ఉండాలంటే రూ.10 లక్షలు ఇవ్వాలని అడిగాడు. డ్రగ్స్, ముంబయి క్రైం బ్రాంచ్ పోలీసులు అనే సరికి భయపడిన ఈ వ్యక్తి తాను అంత ఇవ్వలేనని రూ.3 లక్షలు ఇస్తానని బతిమాలుకున్నాడు. వెంటనే అకౌంట్ నంబర్ ఇచ్చి అందులో జమ చేయించుకున్నాడు.

బెంగళూరు నుంచి గుర్తుతెలియని వ్యక్తి భవానీపురంలో ఉంటున్న వ్యక్తికి ఫోన్ చేశాడు. తాను నార్కోటిక్ బ్రాంచ్ అధికారినని చెప్పాడు. "దుబాయ్ నుంచి మీకు పార్సిల్ వచ్చింది. దాన్ని తెరిచి చూస్తే అందులో కొకైన్ డ్రగ్ ఉంది. పార్సిల్‌పై మీ ఫోన్ నంబర్ ఉంది. మీరు వెంటనే విచారణకు రండి" అని చెప్పాడు. తర్వాత స్కైప్ వీడియో కాల్ చేయమన్నాడు. విచారణకు రాకుండా ఉండాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసి, అకౌంట్ నంబర్ ఇచ్చాడు. అతడి డిమాండ్‌ను అంగీకరించిన వ్యక్తి సైబర్ క్రైం పోలీసులను కలిసి జరిగిన విషయాన్ని వివరించాడు. అటువంటి కాల్స్‌కు స్పందించవద్దని భరోసా ఇచ్చి పంపించారు.

ఈ మోసం హాట్ గురూ..!

సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసాలు



- పార్సిల్‌లో మాదకద్రవ్యాలు వచ్చాయంటూ ఫోన్లు
- ఉత్తరాది రాష్ట్రాల్లో పోలీసుల్లా బిల్డప్
- ముందు వాయిస్ కాల్స్
- తర్వాత స్కైప్ కాల్స్
- విచారణ పేరుతో బెదిరింపులు
- అందులోనే బేరసారాలు
- ట్రాప్‌లో పడుతున్న అమాయకులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఒక తరహా మోసాలపై ప్రజలకు అవగాహన వచ్చిందని, ఇక తాము వేసిన ట్రాప్‌లో పడబోరని తెలుసుకున్న తర్వాత 'ఈ' నేరగాళ్లు కొత్త ట్రెండ్‌కు తెర తీస్తున్నారు. ఓటీపీ నేరాలతో మొదలైన సైబర్ బీభత్సం రోజుల జరిగే కొద్దీ కొత్త రూపాలను తీసుకుంటోంది. ఇప్పటి వరకు బ్యాంకులు, టెలికం కంపెనీలు, ట్రాయ్ వంటి సంస్థలను నేరాల కోసం విచ్చలవిడిగా ఉపయోగించుకున్న నేరగాళ్లు ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో పోలీసులను వాడేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న పోలీసు విభాగాల పేర్లను వాడుకుని అమాయకుల నుంచి లక్షలాది రూపాయలను కాజేస్తున్నారు.

● పార్సిల్... డ్రగ్స్...

నౌకల ద్వారా, విమానాల ద్వారా కొంతమంది డ్రగ్స్‌ను ఒకదేశం నుంచి మరొక ప్రాంతానికి రహస్యంగా తీసుకెళ్తుంటారు. ఇందులో దొరికిన వారే దొంగలుగా కనిపిస్తున్నారు. మిగిలినవారు మాత్రం దొరలుగా డ్రగ్స్ వ్యాపారం చేసుకుంటున్నారు. ఇతర దేశాల నుంచి మనదేశానికి దొడ్డిదారిన మాదకద్రవ్యాలు వస్తుండగా, ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రంలోకి వాటిని పంపడానికి ప్రత్యేకంగా ఏజెంట్లు పనిచేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు దీన్ని తమకు అనువుగా మార్చుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న పోలీసుల పేర్లతో ఫోన్లు చేసి అమాయకులను బెదిరిస్తున్నారు. వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇందుకోసం సైబర్ నేరగాళ్లు డ్రగ్స్ ఎక్కువగా చలామణిలో ఉన్న దేశాల పేర్లను ఉపయోగించుకుంటున్నారు. వివిధ మార్గాల ద్వారా వివిధ రాష్ట్రాల్లో ఉన్న వారి ఫోన్ నంబర్లను సేకరించిన ముఠా పార్సిల్, డ్రగ్స్ ట్రిక్స్‌ను ఉపయోగిస్తోంది. థాయ్‌లాండ్, నైజీరియా, చైనా, యూఎస్ఏ వంటి దేశాల పేర్లు చెప్పి అక్కడి నుంచి పార్సిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని చెప్పి ఫోన్లు చేస్తున్నారు. తాము ముంబయి క్రైం బ్రాంచ్, బెంగళూరులోని నార్కోటిక్స్ వింగ్, ఢిల్లీ నార్కోటిక్ బ్యూరో నుంచి ఫోన్ చేస్తున్నామని బెదిరిస్తున్నారు. విషయం చెప్పిన తర్వాత వారిని స్కైప్‌లో వీడియో కాల్ చేయమని చెబుతున్నారు. సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసు మాదిరిగా మాట్లాడి విచారణకు రావాలని చెబుతున్నారు. లేకపోతే తామే ఇంటికి వచ్చి అరెస్టు చేస్తామని భయపెడుతున్నారు. తమకు ఆ పార్సిల్స్‌తో ఎలాంటి సంబంధం లేదని చెప్తే, దానిపై మీ ఫోన్ నంబర్ ఎందుకు ఉందని పోలీసుల మాదిరిగా ప్రశ్నిస్తున్నారు. దీంతో భయపడి అవతలి వ్యక్తులు అడిగిన మొత్తంలో ఎంతోకొంత సమర్పించుకుంటున్నారు. ఒకఫోన్ కాల్ టాస్క్ ద్వారా డబ్బులు అకౌంట్‌లో జమకాగానే సైబర్ నేరగాళ్లు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..

వన్‌టౌన్, మార్చి 16: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) శనివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బాలకృష్ణ విజయవాడకు వచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి చిన్ని స్వాగతం పలికారు.



బాలకృష్ణను కలిసిన కేశినేని చిన్ని

రూ.5 వేలకే గుండె వైద్య పరీక్షలు

పాయకాపురం, మార్చి 16: నగరంలోని వరుణ్ కార్డియాక్ సైన్స్ హాస్పిటల్‌లో రూ.5 వేలకే యాంజియోగ్రామ్‌తో కూడిన గుండె వైద్య పరీక్షలు నిర్వహిస్తామని హాస్పిటల్స్ సీఈవో డాక్టర్ వరుణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరుణ్ కార్డియాక్ సైన్స్ ద్వితీయ వార్షికోత్సవం, ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బెంజిసర్కిల్‌లోని వరుణ్ కార్డియాక్ సైన్స్ హాస్పిటల్‌లో 50 ఏళ్లు పైబడిన వారందరికీ నాణ్యమైన గుండె వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఈ అవకాశం ఈనెల 17 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు కల్పించనున్నట్లు వివరించారు. వివరాలకు 94922 71879, 0866-2431879, 1800 4251879 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా సిద్ధార్థ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌ల ప్రదానం

మొగల్రాజపురం, మార్చి 16: సిద్ధార్థ ఫౌండేషన్ 25వ వార్షికోత్సవ విద్యా స్కాలర్ షిప్‌ల ప్రదానోత్సవం సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగింది. ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్ కె.అరోరా హాజరుకాగా ఆయన చేతుల మీదుగా ఈ స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ అకాడమీ నిర్వహణలో ఉన్న ఫౌండేషన్ విద్యార్థుల ఆర్థిక వెనుకబాటుతనం ప్రాతిపాదిక, ప్రతిభను పరిగణలోకి తీసుకుని పాఠశాల నుంచి విశ్వ విద్యాలయ స్థాయి వరకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్, ఎన్ఐటీ లాంటి జాతీయ విద్యా సంస్థల్లో విద్య అభ్యసిస్తున్న వారికి ప్రత్యేక స్కాలర్ షిప్‌లు అందిస్తున్నట్టు చెప్పారు. 24ఏళ్లలో 17,300 మంది పైగా విద్యార్థులకు రూ.7 కోట్ల ఆర్థికసాయం చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది పాఠశాల స్థాయిలో 143 మంది, ఇంటర్ 159 మంది, డిగ్రీ 144 మంది, ఇంజనీరింగ్ 99 మంది, పీజీలో 41 మంది, మెడిసన్, డెంటల్, ఫార్మసీ, పాలిటెక్నిక్ కోర్సులు చదువుకునే 89 మంది, స్పెషల్ స్కాలర్ షిప్‌లు కలిపి మొత్తం 700 మందికి సుమారు రూ.60 లక్షలను చెక్కు రూపంలో ఇస్తున్నామన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.





ఆంధ్ర లయోలాలో సాంస్కృతికోత్సవం

భారతీనగర్, మార్చి 16: ఆంధ్ర లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సాంస్కృతికోత్సవం (వెంతూరా) శనివారం కళాశాలలోని దేవయ్య ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ వి.లక్ష్మణరావు, ప్రముఖ రంగస్థల నటుడు షణ్ముక జయవిజయ కుమార్ రాజు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులో సమకాలీన సవాళ్లను పరిష్కరించడానికి సృజనాత్మకత ఉపయోగపడుతుందన్నారు. షణ్ముక జయ విజయ కుమార్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు సాంప్రదాయ కళలను ప్రోత్సహించడంతోపాటు అంకిత భావాన్ని కలిగి ఉండాలన్నారు. ఫాదర్ పి.బాలశౌరి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బాలస్వామి, కళాశాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయాల వల్లే నగరాభివృద్ధి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మార్చి 16: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాల వల్లనే నేడు నగరంలో అభివృద్ధి అనేది కనబడుతుందని టీడీపీ, జనసేన, బీజేపీలు బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజక వర్గ పరిధిలోని 3వ డివిజన్‌లోని శ్రీరామచంద్ర నగర్ కాలనీలోని ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీలు బలపరిచిన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. నెలకు రూ.18 కోట్లు ఆదాయంగా మిగిలేలా 010 విధానం ద్వారా కార్పొరేషన్ ఉద్యోగుల జీతాలను ప్రభుత్వం ఖజానా ద్వారా చెల్లించేలా అప్పటి సీఎం చంద్రబాబు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు చాలా ముఖ్యమన్నారు. గతంలో జరిగిన ఎన్నికలు ఒక ఎత్తు, ఇప్పుడు జరగబోయే ఎన్నికలు ఒక ఎత్తు అని అన్నారు. ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడితే పార్టీ కార్యాలయంపై దేవినేని అవినాష్ దాడి చేశారన్నారు. ఆయనకు, అతడి తండ్రికి రాజకీయ భిక్షపెట్టింది తెలుగు దేశం పార్టీ అన్న విషయం మర్చిపోయి ఉన్మాదిగా ప్రవర్తించాడన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, బొప్పన భవకుమార్, గద్దె రమేష్, సి.హెచ్ ఈశ్వరరావు, పాలడుగు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పుణ్యశీల భర్త దాదాగిరి

- 34వ డివిజన్‌లోని పండ్లమార్కెట్ వద్ద మామూళ్ల వసూలు
- ఇవ్వనివారిపై రౌడీయిజం
- సొంత పార్టీ తాలూకా అన్నా వదలని వైనం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన రాజ్‌కుమార్ రౌడీయిజం

విజయవాడ, ఆంధ్రజ్యోతి మార్చి 16: మామూళ్లు ఇవ్వకపోతే వ్యాపారాలు చేయడానికి వీల్లేదు. అయినా చేస్తే చితకబాదుతామంటూ 34వ డివిజన్ కార్పొరేటర్, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల భర్త రాజ్‌కుమార్ రౌడీయిజం చేస్తున్నారని పలువురు వ్యాపారులు వాపోతున్నారు. స్థానిక 34వ డివిజన్, కేదారేశ్వరపేట రైతుబజార్ వద్ద మెయిన్‌రోడ్డుపై పండ్ల వ్యాపారాలు నిర్వహించే చిరు వ్యాపారులపై ఆ డివిజన్ కార్పొరేటర్ భర్త బండి రాజ్‌కుమార్ రౌడీగిరి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేస్తే తమకు మామూళ్లు ఇవ్వాలని లేకుంటే వ్యాపారాలు చేసుకోకూడదని ఓ వ్యాపారిని రాజ్‌కుమార్, తన అనుచరులు గురువారం తెల్లవారుజామున నిలువరించారు. వారిని ఆ వ్యాపారి ఆటంకాయిచడంతో రాజ్‌కుమార్, తన అనుచరవర్గంతో కలిసి వ్యాపారిపై దాడికి దిగారు. నేను అవినాష్ తాలూకా అని చెబుతున్న రాజ్‌కుమార్, తన అనుచరవర్గం పట్టించుకోకుండా వ్యాపారిపై దాడి చేశారు. ఆ వ్యాపారిని అక్కడ నుంచి తరిమేసి వారు తెచ్చుకున్న మొక్కజొన్నలను నేరుగా వాళ్లే అమ్ముకున్నారు. దీంతో ఆ పక్కనే ఉన్న చిరు వ్యాపారులు బెంబేలెత్తారు. ఇటువంటి సంఘటనలు పోలీస్ స్టేషన్‌కు చేరినా అధికార పార్టీ కావడంతో కనుమరుగైపోయాయి. దాడికి గురైన వ్యాపారి తనపై రాజ్‌కుమార్, తన అనుచరులు దాడిచేశారని అతడు, కొంతమంది చిరువ్యాపారులు సత్యనారాయణపురం పోలీసుస్టేషన్‌కు కేసు పెట్టడానికి వెళ్లారు. కానీ అధికారపార్టీ తాలూకా, సిట్టింగ్ కార్పొరేటర్ భర్త అవ్వడంతో పోలీసులు రాజీ యత్నాలు చేశారు. చివరకు ఈ కేసును ఏసీపీ లెవల్లో రాజీని కుదిర్చి చిరువ్యాపారులను పంపేశారు. పొట్టకూటికోసం రోడ్డుపైకి వ్యాపారాలు చేసుకునే వారిపై మమూలు వసూళ్ళు, దాడుల రూపంలో రౌడీయిజం, దాదాగిరి చేస్తున్న వారు మాత్రం సమాజంలో దర్జాగా తిరుగుతున్నారని చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి ఆదేశాలను జిల్లాల ఎన్నికల యంత్రాంగం శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి అమల్లోకి తెచ్చింది. షెడ్యూల్ విడుదల చేసిన 24 గంటల్లోపు ప్రవర్తనా నియమావళిని అమల్లోకి తీసుకురావాలని ఎన్నికల సంఘం ఆదేశించటంతో ఆదివారం మధ్యాహ్నానికి నూరు శాతం కోడ్ అమలు దిశగా రెండు జిల్లాల ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుంది.



నందిగామలో రాజకీయ నాయకుల విగ్రహాలు, ఘంటసాల మండలం కొడాలిలో వైఎస్ విగ్రహానికి వేసిన ముసుగులు

సీఎం బొమ్మ తీయాల్సిందే

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో లబ్ధిదారులకు ఇచ్చే బెనిఫిషియరీ కార్డులు, ధ్రువీకరణ పత్రాలపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు ఉండకూడదు. గ్రామ, వార్డు సచివాలయాల్లో జారీ చేసే అన్ని రకాల సర్టిఫికెట్లపై ముఖ్యమంత్రి బొమ్మలు ఉన్నాయి. మరణ ధ్రువీకరణ పత్రాల్లోనూ ముఖ్యమంత్రి ఫొటోలు ఉంటున్నాయి. ఈ బొమ్మలు ఇకపై ఉండటానికి లేదు. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ జిల్లా అధికారులు ముఖ్యమంత్రి బొమ్మలు లేని ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలి. గ్రామ వార్డు సచివాలయాలపై ముఖ్యమంత్రి బొమ్మలను ఏర్పాటు చేశారు. వాటిని, సచివాయాలయాలు, వాటర్ ట్యాంకులు, గోడలకేసిన వైసీపీ రంగులను తొలగించాల్సిందే.

ఎన్నికల కోడ్ అమల్లోకి

శాఖల వారీగా ప్రవర్తనా నియమావళి అమలుకు కలెక్టర్ల ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్, జాయింట్ కలెక్టరేట్, సబ్ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ముఖ్యమంత్రి జగన్ బొమ్మల తొలగింపు చేపట్టారు. నవరత్నాల పథకాల లోగోలను తొలగించారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖలు, విద్య, వైద్య, రవాణా, సమాచార శాఖలు శనివారం 4 గంటల నుంచే వీటి తొలగింపు చేపట్టాయి. గ్రామ సచివాలయాలతో సహా సీఎం ఫొటోలు, నవరత్నాలు లోగోలు, ఇతర వినైల్ బ్యానర్స్, హోర్డింగ్స్ తొలగింపు ప్రారంభించారు. జంక్షన్లు, బస్టాండ్స్, రైల్వేస్టేషన్లలోనూ, బస్సులు, రైళ్లపై రాజకీయపార్టీల అనధికారిక ప్రకటనలు ఉంటే 48 గంటల్లోగా తొలగించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. జిల్లా మంత్రులు, ముఖ్యమంత్రి ఫొటోలను ప్రభుత్వ వెబ్‌సైట్స్ నుంచి తొలగించాలని ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు అన్ని రకాల బోర్డుల తొలగింపు పనులను చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలపై పథకాల ప్రచార వాల్ రైటింగ్స్, వాల్ పోస్టర్లు తొలగింపునకు ఆదేశించారు. పథకాల ప్రచారాలకు సంబంధించిన హోర్డింగ్‌లను, బ్యానర్లు, జెండాలు, బెలూన్లను తక్షణం తొలగించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్ననికి పూర్తిస్థాయిలో విగ్రహాలకు ముసుగులు తొడగనున్నారు.

అభివృద్ధి పనుల నివేదిక కోరిన కలెక్టర్

జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులపై ఆయా శాఖలు 72 గంటల్లోపు తనకు వివరాలు పంపించాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. నిర్మాణ రంగానికి సంబంధించి ఇప్పటికే గ్రౌండ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, నిధులు మంజూరైనా ఇంకా పనులు మొదలు కాని వాటి వివరాలను రెండు వేర్వేరు జాబితాల్లో పంపాలని ఆయన సూచించారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు శాంక్షనై గ్రౌండ్‌లో అప్పటికే పనులు మొదలైతే కోడ్ వచ్చినా ఇబ్బంది ఉండదు. కోడ్ వచ్చాక పనులు చేపట్టినా, గతంలో శాంక్షనై ఇప్పటి వరకు చేపట్టకపోతే మాత్రం మొదలుపెట్టకూడదు.

ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లు రాజకీయ నాయకులకు ఇవ్వొద్దు

విజయవాడలోని ప్రభుత్వ అతిథి గృహాన్ని, ఆర్అండ్‌బీ, పోలీసు తదితర అతిథి గృహాలను రాజకీయ పార్టీల నాయకులు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు కేటాయించకూడదని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికలకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సిద్ధం

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఎన్టీఆర్ జిల్లాలో తదుపరి ఎన్నికల ప్రక్రియకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధమైంది. ప్రవర్తనా నియమావళి అమలుతో పాటు నోటిఫికేషన్ అనంతర విధులపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నోడల్ ఆఫీసర్లంతా ఒకేచోట పనిచేయటానికి వీలుగా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా జిల్లా ఎన్నికల యంత్రాంగం దీని పనులు చేపట్టింది. గతంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక చాంబర్‌నే ఆధునీకరించారు. సెంట్రలైజ్డ్ ఏసీ సదుపాయం కల్పించారు. సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 16 మంది నోడల్ ఆఫీసర్లను నియమించారు. వీరంతా ఇక్కడే విధులు నిర్వహిస్తారు. సోమవారం ఈ కేంద్రాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. ఎన్నికల నిర్వహణ 16 మంది నోడల్ ఆఫీసర్ల కనుసన్నల్లో నడుస్తుంది. ఎలక్షన్ మ్యాన్‌పవర్ మేనేజ్ మెంట్, ట్రెయినింగ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, కంప్యూటరైజేషన్ సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, స్వీప్ మేనేజ్‌మెంట్, లా అండ్ ఆర్డర్, ఈవీఎం అండ్ సెక్యూరిటీ ప్లాన్ మేనేజ్‌మెంట్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) మేనేజ్‌మెంట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ మేనే జ్‌మెంట్, మీడియా మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్టోరల్ రోల్స్ మేనేజ్‌మెంట్, కంప్లయింట్ రెడ్రసల్-ఓటర్ హెల్ప్‌లైన్ మేనేజ్‌మెంట్, ఎలక్షన్ అబ్జర్వర్స్ మేనేజ్‌మెంట్ వ్యవహారాలన్నింటినీ ఈ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ వేదికగానే నోడల్ ఆఫీసర్లు చక్కబెడతారు.

డీపీఆర్వో కార్యాలయంలో ఎంసీఎంసీ సెల్

జిల్లా పౌరసంబంధాల శాఖ (డీపీఆర్వో) కార్యాలయంలో మీడియా సర్టిఫికెట్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సెల్‌ను ఏర్పాటు చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే కథనాలను పరిశీలిస్తూ పెయిడ్ ఆర్టికల్స్, స్టోరీలను ఎంసీఎంసీ సెల్ గుర్తిస్తుంది. మీడియాకు ఇచ్చే ప్రకటనల ఖర్చులను లెక్కిస్తుంది. డీపీఆర్వో కార్యాలయంలో మీడియా సమాచారం కోసం సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయటానికి సమాచార శాఖ అధికారులు సురేంద్ర, మోహనరావు, రవి, ప్రసాద్ సన్నాహాలు చేస్తున్నారు.

ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు: కలెక్టర్ ఢిల్లీరావు



కృష్ణలంక: ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చిందని, ఈసీఐ మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం శనివారం మీడియాకు విడుదల చేసిన బులెటిన్‌లో ఎన్నికల ప్రక్రియ వివరాలను ఆయన వెల్లడించారు. ఎన్నికల ప్రచారానికి మంత్రులు అధికారిక వాహనాలను ఉపయోగించడంపై నిషేధం ఉందన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలను ప్రభుత్వ భవనాలపై ప్రదర్శించొద్దన్నారు. మంత్రులు, ఇతర రాజకీయ నాయకులు, అధికారుల మధ్య వ్యక్తిగతంగా లేదా సమష్టిగా వీడియో కాన్ఫరెన్సులు నిషిద్ధమన్నారు. మోడల్ ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక రూపొందించే విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, బోర్డింగ్‌పాస్‌లు, టీకా సర్టిఫికెట్లలో రాజకీయ నాయకులు, పార్టీల ఫొటోలు లేదా సందేశాలు, చిహ్నాలు ఉండకూడదన్నారు. ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లపై రాజకీయ ప్రకటనలు వెంటనే తీసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీల్యాడ్, ఎమ్మెల్యే ల్యాడ్ లేదా ఇతర ప్రభుత్వ పథకాల కింద నిధులు సమకూర్చిన నీటి ట్యాంకులు, అంబులెన్సులు తదితరాలపై ఎంపీలు, ఎమ్మెల్యేల ఫొటోలు ఉన్నట్లయితే వాటిని కప్పి ఉంచాలన్నారు.

దుర్గగుడి ఛైర్మన్ చాంబర్‌కు తాళం

వన్‌టౌన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటించడంతో పాటు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ చాంబర్‌కు తాళం వేశారు. ఈకోడ్ మేరకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల వెంట అధికారులు ఉండేందుకు వీలులేదు. దీంతో ఛైర్మన్ చాంబర్‌లో ఇప్పటి వరకు పనిచేస్తున్న దేవస్థాన సిబ్బందిని తిరిగి వారివారి ఉద్యోగ స్థానాల్లోకి వెళ్లి విధులు నిర్వహించాలని ఈవో రామారావు ఆదేశాలు జారీ చేశారు.

నిష్పక్షపాతంగా పనిచేయండి

● ప్రభుత్వ ఉద్యోగులకు ఢిల్లీరావు సూచన

ఎన్నికల ప్రక్రియలో పాలు పంచుకునే అధికారులు, ఉద్యోగులంతా నిష్పక్షపాతంగా పనిచేయాలని, ఏదైనా పార్టీ లేదా అభ్యర్థికి అనుకూలంగా ఉండొద్దని కలెక్టర్ సూచించారు. ఉద్యోగులు ఈ నిబంధ నలను ఉల్లంఘిస్తే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు భావించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీ నిర్వహించే ఏదైనా కార్యక్రమంలో పాల్గొన్నా, రాజకీయ ప్రచారంలో పాల్గొన్నా, రాజకీయ పార్టీల నుంచి ఏదైనా ప్రయోజనం, బహుమతి పొందడం, ఎన్నికల సమయంలో అనవసరమైన ప్రభావాన్ని చూపడానికి ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తరుణ్ కాకానిని అభినందిస్తున్న పురందేశ్వరి

బీజేపీలోకి 'కాకాని'

విజయవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి బోటింగ్ క్లబ్ అధ్యక్షుడు కాకాని తరుణ్ శనివారం బీజేపీలో చేరారు. బెంజ్‌సర్కిల్‌లోని స్వాతంత్ర సమరయోధుడు కాకాని వెంకటరత్నం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా కమిటీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌తో కలిసి ర్యాలీగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. అక్కడ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ కండువా కప్పి తరుణ్‌ను ఆహ్వానించారు. అనంతరం తరుణ్ మీడియాతో మాట్లాడారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానన్నారు. పార్టీ తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానన్నారు.



పాదయాత్ర చేస్తున్న బోడె ప్రసాద్, కుటుంబసభ్యులు

చంద్రబాబు నాకు న్యాయం చేస్తారు

పెనమలూరు, మార్చి 16: పార్టీ కోసం ఐదేళ్లుగా కష్టపడి పని చేస్తున్న తనను టీడీపీ అధినేత చంద్రబాబు గుర్తించి తగు న్యాయం చేస్తారని మాజీ ఎమ్మెల్యే టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం యనమలకుదురు ఇందిరానగర్-2 కాల్వకట్టపై జరిగిన పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. చివరివరకు తాను చంద్రబాబుతోనే ఉంటాన ని, తన కుటుంబం మొత్తం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు చేస్తామన్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రతి కార్యకర్త తనను అభ్యర్థిగా కోరుకుంటున్నాడని, ప్రతి కార్యకర్త కాంక్షను చంద్రబాబు తీరుస్తారన్నారు. ఈ 2 నెలల సమయంలో ప్రతి కా ర్యకర్తనూ, ఓటరునూ కలిసి మద్దతు కోరతానన్నారు. ఆయన వెంట భార్య హేమ, కుమార్తె వైష్ణవి, కుమారుడు వెంకట్రాం, అనుమోలు ప్రభాకరరావు, యార్లగడ్డ సుచిత్ర, అనంతనేని చంద్రశేఖరాజాద్, అంగిరేకుల మురళి, మా రం భరద్వాజ్, లంకా కృష్ణారావు, తమ్ము అశో క్, జంపాన గుర్నాథం, మల్లంపాటి విజయలక్ష్మి, శొంఠి శివరాంప్రసాద్, అబ్బాస్, షబ్బీర్, పండల రజని, మేడసాని రత్నకుమారి, తుమ్మల రాంకుమార్, ఇబ్రహీం, కంచర్ల శ్రీదేవి, జన్ను నాగరాజు, దండమూడి సాయిసుధ, అ క్బర్, యాళ్ల చక్రవర్తి, శ్రీనివాస్, ప్రభాకర్, కల్యాణి, మహేష్ పాల్గొన్నారు.

సీటివ్వకపోయినా పోటీ చేస్తా!

● 45వేల ఓట్ల మెజారిటీతో గెలిచి చూపిస్తా ● జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేష్

వన్‌టౌన్, మార్చి 16: పశ్చిమ నుంచి జనసేన తరఫున పోటీ చేసేందుకు పార్టీ ఇంకా తన పేరు ప్రకటించకపోవడంతో జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ పార్టీ తనకు అధికారికంగా టికెట్టు ఇవ్వకపోయినా జనసేన జెండాపై పవన్‌కల్యాణ్ ఫొటోను ముద్రించుకుని పోటీ చేస్తానని, 45వేల మెజారిటీతో గెలిచి చూపిస్తానన్నారు. శనివారం మోతీమసీద్ పక్కనున్న తోటకూర దొడ్డి స్థలంలో జనసైనికులు, వీరమహిళలు మహేష్‌కు సీటివ్వకపోవడాన్ని నిరసిస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రజాసేవతో పాటు ఎన్నో ఆటుపోట్లను, కేసులను ఎదుర్కొన్నానని, తాము బలంగా ఆందోళన చేయబట్టే వెలంపల్లి శ్రీనివాస్‌ను పక్క నియోజకవర్గానికి పంపించారన్నారు. కానీ 3 రోజుల క్రితం తనకు సీటు లేదని పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించినట్టు చెప్పారన్నారు. ఇది సమంజసం కాదని ఇందులోని కుట్రకోణాన్ని ఛేదించడానికే జనసైనికులు, వీరమహిళలు మహాధర్నా నిర్వహిస్తున్నారన్నారు. అధికారికంగా సీటు రాకపోయినా పశ్చిమలో తప్పనిసరిగా పోటీ చేస్తానని 45వేల మెజారిటీతో గెలుస్తానన్నారు. తాను వేరే జెండా పట్టుకోనని ఒకవేళ పట్టుకుంటే తన చేయి నరకాలని ఆవేశంగా ప్రకటించారు. రాష్ట్ర, నగర కమిటీ సభ్యులు, ధార్మిక మండలి సభ్యులు, మూడు నియోజకవర్గాల సమన్వయకర్తలు, వీరమహిళలు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్స్ లీగల్ సెల్ ప్రచార కమిటీ జనసైనికులు పాల్గొన్నారు.



మహాధర్నాలో మాట్లాడుతున్న పోతిన మహేష్

అభిమాని ఆత్మహత్యాయత్నం

పశ్చిమలో పోతిన మహేష్‌కు జనసేన టికెట్ కేటాయించలేదంటూ నిరసన వ్యక్తం చేస్తూ జనసేన అభిమాని పైలా ప్రవీణ్‌కుమార్ తన శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. పక్కనే ఉన్న పార్టీ శ్రేణులు ఆయనను సముదాయించి నివారించారు.

వైసీపీ శ్రేణుల కవ్వింపు చర్య

చిట్టినగర్‌లో వైసీపీ శ్రేణులు జనసేన శ్రేణులపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో పలువురు జనసేన శ్రేణులు రెచ్చిపోయి వారిపైకి కుర్చీలు విసిరేశారు. ఈ సంఘటనతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసుల అక్కడే ఉండడంతో పెద్ద ముప్పును నివారించారు. భవానీపురం నుంచి వైసీపీ పశ్చిమ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అటుగా వెళ్తుండగా కార్లలో ఉన్న కొందరు వైసీపీ కార్యకర్తలు జనసేన వారిని చూసి హేళనగా చేతులూపారు. దీంతో ప్రతిస్పందనగా జనసైనికులు కుర్చీలను విసిరేశారు.



ఆత్మహత్యాయత్నం చేసిన ప్రవీణ్‌కుమార్

సీటు రాలేదని రోడ్డెక్కితే సస్పెండ్ చేస్తాం

● సెంట్రల్ ఆంధ్ర ఎన్నికల కన్వీనర్ బాడిత శంకర్

భవానీపురం, మార్చి 15: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆదేశాలు తూచా తప్పక పాటించాలని, సీటు రాలేదని రోడ్లెక్కి ఆందోళన చేస్తే ఉపేక్షించేది లేదని, వారిని సస్పెండ్ చేస్తామని సెంట్రల్ ఆంధ్ర జోన్ ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ బాడిత శంకర్ హెచ్చరించారు. హెచ్‌బీ కాలనీ వీఎంసీ కల్యాణ మండపంలో నాయకులు లింగం శివప్రసాద్, సముద్రాల ప్రసాద్‌తో కలిసి శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీ అభ్యర్థుల విజయాన్ని పార్టీశ్రేణులు కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమలో బీజేపీ అభ్యర్థి విజయానికి అందరం పాల్గొంటామని వివరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. 17న చిలకలూరిపేటలో జరిగే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రసాద్, ఉమ్మడిశెట్టి కృష్ణప్రసాద్, ఎం.సంగీత, ఎంఎస్ఆర్.నాయుడు, బాడిత చరణ్ పాల్గొన్నారు.

విజయ డెయిరీకి ఏ+ గ్రేడ్ గుర్తింపు

వన్‌టౌన్, మార్చి 16: ఆహారభద్రతా ప్రామాణికాల వ్యవస్థ చేసిన ఆడిట్‌లో విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్(విజయ డెయిరీ)కు ఏ+ గ్రేడ్ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు ఇచ్చింది. ఏటా ఈ ఆడిట్‌ను ఆ సంస్థ నిర్వహిస్తోంది. విజయ డెయిరీ అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వినియోగదారులకు సురక్షితమైన పాలఉత్పత్తులను అందిస్తున్నందుకు ఈ ధ్రువీకరణ ఇచ్చారని, వరుసగా మూడో ఏడాది కూడా ఈ ధ్రువీకరణ మిల్క్ యూనియన్‌కు అందిందని యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడిరైతులు, వినియోగదారులు తమ సంస్థకు రెండు నేత్రాలని అన్నారు. పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి యూనియన్ అహర్నిశలు పనిచేస్తుందన్నారు. నాణ్యమైన పాలపదార్థాలను వినియోగదారులకు అందించడంలో సంస్థ ముందుంటుందని తెలిపారు. కృష్ణామిల్క్ యూనియన్ ఏ+గ్రేడ్ సాధించడం ఎంతో సంతోకరమని, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో యూనియన్ నిరంతర కృషి చేస్తుందని సంస్థ ఎండీ కొల్లి ఈశ్వరబాబు అన్నారు. సంస్థ అధికారులకు, సిబ్బందికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.



వీరవల్లిలోని విజయ పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీ

వీరవల్లి ప్రాజెక్ట్ కామధేనుకు ఏ+ గ్రేడ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఎఫ్ఎస్ఎస్ఏఐ(ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా) నిర్వహించిన పరీక్షల్లో వీరవల్లిలోని విజయ పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీ ప్రాజెక్ట్ కామధేనుకు ఏ+ గ్రేడ్ వచ్చింది. వీరవల్లిలోని ఫ్యాక్టరీలో పాల ఉత్పత్తులను శనివారం ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతినిధులు పరిశీలించారు. ఫ్యాక్టరీ ఆవరణ పరిశుభ్రత, శీతలీకరణ, పాల ఉత్పత్తులపై వివిధ పరీక్షలు నిర్వహించారు. ప్రాజెక్ట్ కామధేను(విజయ) ఫ్యాక్టరీలో తయారయ్యే పాల ఉత్పత్తులు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో 105/106 సాధించాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతినిధులు తెలిపారు. ఉత్పత్తి ప్రారంభించిన మూడు నెలల్లోనే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరీక్షల్లో నెగ్గి ఏ+ గ్రేడ్ ఘనత సాధించడం సంతోషకరమని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందజేసేందుకు సిబ్బంది, అధికారుల కృషి అభినందనీయమని ఎండీ కొల్లి ఈశ్వరబాబు అన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.18

లాడ్జీల తనిఖీ



సత్యనారాయణపురం: ఎలక్షన్ కోడ్ వచ్చిన నేపథ్యంలో పోలీసులు లాడ్జీలు తనిఖీలు చేస్తున్నారు. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలోని పలు లాడ్జీలను సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. లాడ్జిలో ఉన్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లాడ్జికి వచ్చే వారి ఆధార్‌కార్డుల కాపీలు తీసుకుంటున్నారా లేదా, ఎక్కడి నుంచి వస్తున్నారు వివరాలు బుక్‌లో పొందు పరుస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్నారు. లాడ్జిలో సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా లేదా చెక్ చేయాలని ఆదేశించారు. లాడ్జిల్లో ఎవరైనా అనుమానంగా ప్రవర్తిస్తున్నా, పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ, సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.



పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో



చిత్తరంజన్‌శాఖా గ్రంథాలయంలో

మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు

వన్‌టౌన్, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కళాశాల సెక్రటరీ పరుచూరి లక్ష్మణస్వామి కొనియాడారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ లక్ష్మణస్వామి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ శ్రీ రామ్‌రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, వైస్.ప్రిన్సిపాల్ ఏ.పతంజలి శాస్త్రి, అకడమిక్ డీన్ డాక్టర్ విజయదుర్గాప్రసాద్, మణికంఠలతో పాటు ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరిట స్మృతివనం ఏర్పాటు చేయాలి

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరిట స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని వాసవీ ఫౌండేషన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సామారంగం చౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాసవీ ఫౌండేషన్, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు పీ.వీకే నరసింహారావు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు, టీడీపీ నాయకులు కొణిజేటి రమేష్, నూకల నాగేశ్వరరావు, ఎం.గురునాథం, తదితరులు నివాళి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొణిజేటి రమేష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల ఆమరణ నిరహార దీక్షకు గుర్తుగా 58 ఎకరాల స్థలంలో 58 అడుగుల ఎత్తున పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయనకు సముచిత స్థానాన్ని కల్పించాలని, స్మృతివనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం కానీ, లేదా రానున్న ప్రభుత్వం కానీ ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఠాగూర్ గ్రంథాలయంలో...

గవర్నర్‌పేట: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: సత్యనారాయణపురం చిత్తరంజన్‌శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

పాయకాపురం: వాసవి క్లబ్ పాయకాపురం ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ సెంటర్‌లో క్లబ్ అధ్యక్షుడు పందిరి బాల వెంకట సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా భీమరాజు, గూడూరు చైతన్యకుమార్, కారంశెట్టి వెంకట మస్తానయ్యలు హాజరయ్యారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు.





ప్రకాష్‌నగర్ సెంటర్లో అమరజీవికి నివాళులు అర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు, వాసవీ ఫౌండేషన్, టీడీపీ నాయకులు

చంద్రబాబు పాలనలోనే మహిళలకు రక్షణ

టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్

గుణదల, మార్చి 16: రాష్ట్రంలో మహిళల రక్షణ అనేది చంద్రబాబు నాయుడుతోనే సాధ్యపడుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. తూర్పు పరిధిలోని ఐదవ డివిజన్లో ఆర్సీఎం స్కూల్ వద్ద టీడీపీ ఆఫీస్ ప్రారంభ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేశినేని శివనాథ్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో లేకపోయినా గడచిన ఐదేళ్ల నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మే నుంచి చంద్రబాబు పాలన మొదలు కాబోతుందని జోస్యం చెప్పారు.

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఏకైక వ్యక్తి చంద్రబాబు నాయుడు ఒక్కరేనని చెప్పక తప్పదన్నారు. అటువంటి అనుభవజ్ఞుడైన నాయకుడు మళ్లీ ముఖ్యమంత్రిగా ఏపీకి చాలా అవసరమన్న విషయాన్ని ఓటర్లు గ్రహించారని తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 5వ డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, బొప్పన భవకుమార్, గుమ్మడి గురుప్రసాద్, జనసేన నాయకుడు రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, షరీఫ్, వివేక్, బీజేపీ నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశినేని చిన్ని, పక్కన గద్దె

ప్రైజర్‌పేట చర్చి సెంటర్‌లో అన్న క్యాంటీన్

కేశినేని ఫౌండేషన్ సారధ్యంలో టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో శనివారం 49వ డివిజన్ ప్రైజర్ పేట చర్చి సెంటర్‌లో అన్న క్యాంటీన్‌ను నిర్వహించారు. ఆర్. మాధవ, బడుగు వెంకన్న, చెట్ల నాగబాబు, విక్టోరియా, కోటిరామ్మూర్తి, బొల్లి ప్రసాద్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 16 : ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని, మరో 50 రోజుల్లో రాష్ట్రానికి పూర్తి స్వేచ్ఛ లభిస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం 12,13వ డివిజన్లకు చెందిన బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో గద్దె సమావేశం నిర్వహించి ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు సాగాలి అనే విషయమై కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ నుంచే కాకుండా ఈ రాష్ట్రంలో జగన్‌ను తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎస్. ఫిరోజ్, కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, సిద్ధం నాగేంద్రరెడ్డి, గద్దె ప్రసాద్, శాయన బుజ్జిలతో పాటు పలువురు యూనిట్, బూత్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

● తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎన్నికల కార్యాలయంలో 5,6వ డివిజన్లకు చెందిన బూత్ కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులతో శనివారం మధ్యాహ్నం గద్దె సమావేశం అయ్యారు. ప్రతీ బూత్ కన్వీనర్ ఈ 50 రోజులు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి వారి మన్ననలను పొందాలన్నారు. బీసీ నాయకుడు వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించాలన్నారు. బొప్పన భవకుమార్, గుమ్మడి గురుప్రసాద్‌లు పాల్గొన్నారు.

● జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి విషయంలోను విఫలమైందని, గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో పూర్తిగా చేతులెత్తేసిందని, యువత భవితను అధోగతి పాల్జేసిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ఆరోపించారు. 12వ డివిజన్‌లో ధనేకుల వారి వీధి నుంచి శనివారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, మేదరమెట్ల నారాయణ, వీరం చిన్న, రంగారావు, ఎం. బుచ్చిబాబు, చిన్నతల్లి, కొండవీటి ప్రసాద్, జనసేన నాయకురాలు మాకినేడి నీరజలు పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 16 : ప్రేమ పేరుతో మహిళను వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన మహిళ పట్ల అదే ప్రాంతానికి చెందిన కాట్ల జంపన్న అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. శుక్రవారం ఆ మహిళ పని నిమిత్తం దుకాణానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో జంపన్న అడ్డగించి దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాన్ రెక్కలు ముక్కలవడం ఖాయం

బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం, మార్చి 16 : వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవడం ఖాయమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో శనివారం విలేకర్ల సమావేశంలో బొండా ఉమా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నేటి నుంచి రాష్ట్ర ప్రజలకు వైసీపీ పాలన నుంచి విముక్తి లభించిందన్నారు. మరో 45 రోజుల్లో రాష్ట్ర ప్రజలకు పూర్తిగా స్వేచ్ఛ లభిస్తుందని, జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

అత్యుత్తమ భవిష్యత్తుకు సరైన కోర్సు ఎంచుకోవాలి

ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

పటమట, మార్చి 16 : భవిష్యత్తును అత్యుత్తమంగా మలచుకోవాలంటే విద్యార్థులు సరైన కోర్సును ఎంచుకోవాలని ఏపీ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి అనప్నారు. మారిస్ స్టెల్లాలో శనివారం సాయంత్రం 62వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదువుకోవాలని, పోటీ ప్రపంచంలో తమ భవిష్యత్తును అత్యుత్తమంగా మలచుకోవాలన్నారు.

స్టెల్లాలో ఎన్నో కోర్సులను యాజమాన్యం ప్రవేశపెట్టిందని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ రేఖ కళాశాల ప్రగతి నివేదికను వెల్లడించారు. ఎఫ్రానిక్స్ సీఈవో దాసరి రామకృష్ణ, వేదిక వనాస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ వేణిమాధవి, కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, డాక్టర్ బ్యూలా, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిన్నారుల ఎగ్జిబిట్స్ అదుర్స్



మొగల్రాజపురం : స్థానిక ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ, ఎల్‌కేజీ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జిలు కృష్ణవేణి, దుర్గ, టీచర్ మాధురి పర్యవేక్షణలో విజ్ఞానాంశాలను చిన్నారులు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సబానా ఎగ్జిబిట్లను పరిశీలించి చిన్నారులను అభినందించారు.

నలంద విద్యానికేతన్‌లో కేజీ గ్రాడ్యుయేషన్ వేడుకలు



గవర్నర్‌పేట, మార్చి 16: నలంద విద్యానికేతన్ ప్రైమరీ విభాగంలో నలంద టోడ్‌లర్స్ ప్రైమరీ, కేజీ గ్రాడ్యుయేషన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కిండర్ గార్డెన్ విద్యను పూర్తిచేసుకున్న చిన్నారులు నల్లనికోటు, టోపీ ధరించి కేజీ పట్టాలను అందుకోవడానికి వేదిక పైకి రాగానే విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చప్పట్లతో స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పూజానాయర్, మిసెస్ శృతి, స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ, కేజీ ఇన్‌చార్జి రాజేశ్వరి, హేమాశ్రీ చిన్నారులకు పట్టాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలు అందరినీ అలరించాయి.

నాగభూషణంకు సత్కారం



నాగభూషణంను సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

వన్‌టౌన్, మార్చి16: స్థానిక కేబీఎన్ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ నాగభూషణం శనివారం స్వచ్ఛంద పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా తూనికుంట్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయనకు సత్కారం చేశారు. నాగభూషణం తమ కళాశాలకు అద్భుతమైన సేవలందించారని ఈ సందర్భంగా కొనియాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్.ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కే.రామకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యకుమార్, పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జీ.కృష్ణవేణి తదితరులు పాల్గొని ఆయనను అభినందించారు.

టాస్క్ పేరుతో మోసం

సత్యనారాయణపురం, మార్చి 16: సైబర్ నేరగాళ్లు టాస్క్‌పేరుతో బ్యాంక్ ఉద్యోగి వద్ద నుంచి రూ.1.60లక్షలు కొట్టేశారు. సత్యనారాయణపురం శివరావు వీధిలో నివసించే శంకర సుబ్రహ్మణ్యం వన్‌టౌన్ రెప్కో బ్యాంక్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుంటాడు. గత ఏడాది అక్టోబరు 7న జీల్ట్ డిజిటల్ మార్కెటింగ్‌లో పని చేస్తున్న సుహాసిని ఫోన్‌చేసి పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ చేసింది. సుబ్రహ్మణ్యంకు ఒక టాస్క్ ఇచ్చి ఒక్కొక్క టాస్కుకు రూ.150 ఇచ్చారు. అతను టాస్కులు చేయడంతో రూ.2వేలు, తర్వాత రూ.2800 వచ్చాయి. తర్వాత సుహాసిని క్షణయా అను ఆమెను సుబ్రహ్మణ్యంకు పరిచయం చేసింది. అక్టోబరు 29న రూ.50వేలు పెట్టమని ఇంకా డబ్బులు ఎక్కువ సంపాదించవచ్చనని చెప్పారు. దీంతో సుబ్రహ్మణ్యం పలుదఫాలుగా ఆక్వా సెల్స్ అకౌంట్‌కు రూ.1.60 లక్షలు కట్టాడు. డబ్బులు తిరిగి రాకపోవడంతో శనివారం జరిగిన సంఘటనపై, వారు చెల్లించిన బ్యాంక్ నెంబర్లు, వివరాలతో శనివారం సత్యనారాయణపురం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

మహిళా మార్ట్‌కు శంకుస్థాపన ఎన్నికల ఎత్తుగడే

● సీపీఎం ఫ్లోర్‌లీడర్ సత్తిబాబు

వన్‌టౌన్: టిడ్కో- ప్రధానమంత్రి గృహనిర్మాణ పథకం ద్వారా జక్కంపూడి షాబాద్‌లో నిర్మించిన ఇళ్ల వద్ద మేయర్ మహిళ మార్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమే కానీ ఇది ఎన్నికల ఎత్తుగడ అని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయ సత్తిబాబు శనివారం ఒక బహిరంగ లేఖలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 8,496 ఇళ్లు మంజూరు కాగా 6576 ఇళ్లను పూర్తి చేశారని, 2544 ఇళ్లు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వలేదని, సగంలో ఆగిన పనులను పూర్తి చేయలేదన్నారు. ఇదే సమయంలో లబ్ధిదారులకు వడ్డీ సహా డబ్బు చెల్లించాలని బ్యాంకుల నోటీసులొస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న మేయర్ కూడా ఏం చేయలేదన్నారు. ఇన్నాళ్లు మిన్నకున్న వైసీపీ పాలకులు మహిళ మార్ట్ పేరుతో చర్యలు చేపట్టడం హాస్యాస్పదమన్నారు.

దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేయాలి

● అంబేడ్కర్ ఇండియా మిషన్ వినతి

గవర్నర్‌పేట, మార్చి 16: దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేయడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలు కేంద్రప్రభుత్వం దృష్టికి తేవాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) నేతలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి విజ్ఞప్తి చేశారు. ఏఐ ఎం పొలిట్ బ్యూరో కన్వీనర్ బుస్సా నళినీ మోహన్, కో-కన్వీనర్ వాసే ఆనంద్, గౌరవ సలహాదారు బళ్లా రామకృష్ణ, సభ్యులు బి.రత్నం, వలపలర్ల కిషోర్ బృందం శనివారం సూర్యారావుపేటలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పురందేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దళితుల అభివృద్ధికి వినియోగించాలని, దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఆమె సానుకూలంగా స్పందించి బీజేపీ అగ్రనాయకత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

సబ్ జూనియర్ కబడ్డీలో రాష్ట్రం జయకేతనం

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 16: బీహార్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 33వ సబ్ జూనియర్ నేషనల్ పురుషుల కబడ్డీ టోర్నీలో రాష్ట్ర పురుషుల జట్టు జయకేతనం ఎగురవేసింది. 3 రోజుల పాటు సాగే ఈ టోర్నీలో మొత్తం 28 రాష్ట్రాలు బరిలో దిగాయి.

పూల్ హెచ్‌లో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు విదర్భపై 45-30 పాయింట్లతో విజయం సాధించింది. రాష్ట్ర జట్టు విజయంలో అభిలాష్ రెడ్డి కీలక పాత్ర పోషించాడని ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు.

కోడ్‌తో దరిద్రం వదిలింది

▸ అధికారులూ... వైసీపీ ఒత్తిళ్లకు లొంగి ఇబ్బందులు పడొద్దు: అచ్చెన్న

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూల్ విడుదలై కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి స్వాతంత్ర్యం వచ్చినట్లుగా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రజలకు, పార్టీలకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. ఎవరినీ నోరు తెరవనీయరు. ప్రజా సమస్యలపై పోరాటం చేయనీయరు. కోడ్‌తో ఈ దరిద్రం వదిలింది. అధికారులకు మా విజ్ఞప్తి. అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగి కోడ్‌ను ఎక్కడ ఉల్లంఘించినా మీరు ఇబ్బంది పడతారు' అని అచ్చెన్న అన్నారు. బీసీలకు 54 శాతం సీట్లు ఇస్తున్నామని జగన్ కాకమ్మ కబుర్లు చెప్పారని, రాయలసీమలో ఎంత మంది బీసీలకు ఇచ్చారో ఆయన ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. కాగా, 'చిత్తూరు జిల్లాలో కొంత మంది పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ, ఎస్పీ ఈనెల 14న ఉత్తర్వులు జారీ చేశారు. సదరు పోలీసులు ఎటువంటి బదిలీ కోరకపోయినా, ఎస్పీ బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. రాజకీయ ప్రేరేపితమైన ఈ బదిలీలను

షెడ్యూల్ వచ్చింది.. జాగ్రత్త: పురందేశ్వరి



అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల షెడ్యూల్ వచ్చిందంటే మనం ఎన్నికల్లో అడుగు పెట్టినట్లే. వైనాట్ 175 అంటోన్న వైసీపీ ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడొచ్చు. అప్రమత్తంగా ఉండండి' అంటూ శ్రేణులకు బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సూచించారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రా రెడ్డి(రాయదుర్గం) సహా వేర్వేరు పార్టీలకు చెందిన ముళ్లపూడి రేణుక, కాకాని వెంకటరత్నం మనవడు కాకాని తరుణ్ తదితరులు బీజేపీలో చేరారు. ఆదివారం ప్రధాని మోదీ పల్నాడు ప్రాంతం నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నారు. టీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి సభను జయప్రదం చేయాలి' అని ఆమె కోరారు.

హైకోర్టులో ఎస్పీఎఫ్ సిబ్బందికి కంటి పరీక్షలు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో విధులు నిర్వహిస్తున్న 200మంది ఎస్పీఎఫ్ సిబ్బందికి శనివారం హైకోర్టు ప్రాంగణంలో కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యులు పోలీసులకు కంటి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు.

లోక్ అదాలత్‌లలో 26,641 కేసుల పరిష్కారం

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. శనివారం ఒక్కరోజే 26,641 కేసులు పరిష్కరించి, మొత్తం రూ 72.05 కోట్ల పరిహారం అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వహణ అధ్యక్షులు జస్టిస్ ఏవీ శేషసాయి మార్గదర్శకంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల్లో 366 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. ఇరువర్గాల ఆమోదంతో రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు. ఏపీ హైకోర్టు న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు మండవ కిరణ్మయి, జస్టిస్ జె.సుమతి పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న146 కేసులు పరిష్కరించి రూ 9.48 కోట్ల పరిహారం అందజేశారు. లోక్ అదాలత్‌లకు సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులకు న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత, ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి మాలతి కృతజ్ఞతలు తెలిపారు.

కవాతులో వైసీపీ నాయకుడు.. ఎస్‌ఐపై వేటు!



పోలీసుల కవాతులో పాల్గొన్న వైసీపీ నాయకుడు

వీరఘట్టం: ఎన్నికల సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం తెట్టంగి గ్రామంలో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కవాతులో వైసీపీ నాయకుడు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు పాల్గొనడం చర్చనీయాంశమైంది. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు ఎస్‌ఐ గోవిందరావును వెంటనే వీఆర్‌కు పంపించి, పార్వతీపురంలో క్రైమ్ బ్రాంచ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఫక్రుద్దీన్‌ను ఇక్కడ నియమించారు.

కోడ్ కూసినా.. ఆగని తాయిలాల పంపిణీ

▸ సచివాలయ కార్యదర్శులకు ఒంగోలు మేయర్ గిఫ్ట్ బాక్సులు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 16: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా... వైసీపీ నేతల తాయిలాల పంపిణీ ఆగడం లేదు. శనివారం మధ్యాహ్నం ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించగా, ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వైసీపీకి చెందిన ఒంగోలు మేయర్ గంగాడ సుజాత సచివాలయ సిబ్బందిని పిలిపించారు. సంత పేటలోని తన నివాసంలో మీటింగ్ పెట్టి, చివర్లో వారికి బహుమతులు పంపిణీ చేశారు. మరోవైపు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే బాలినేని నివాసంలో మెప్మా ఆర్పీలు, సీఓలు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లకు రూ.5 వేలు, చీర, జాకెట్, ప్యాంటు షర్టులు, ఇతర బహుమతులు పంపిణీ చేశారు. అయితే మేయర్ నగదు పంపిణీ చేయకపోవడంతో కార్యదర్శులు అసహనం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భవనాలకు మంత్రి రోజా సోదరుడి ప్రారంభోత్సవం!

నగరి, మార్చి 16: మంత్రి రోజా ప్రాతినిధ్యం వహిస్తున్న నగరిలో నాడు.. నేడు పథకంలో నిర్మించిన రెండు భవనాలను శనివారం మంత్రి రోజా సోదరుడు ప్రారంభించడం చర్చనీయాంశమైంది. పట్టణంలోని మీరాసాహెబ్‌పాళెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణవేణి, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ 'రెడ్డి' వర్గానికే కొమ్ముకాశాడు

▸ ఎన్నికల తరువాత దేశం విడిచి వెళ్తున్నాడు

▸ అందుకే యూకేలో ద్వీపం కొనుగోలు చేశాడు: దీపక్‌రెడ్డి

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అభ్యర్థుల జాబితాలో జగన్ తన సొంత సామాజిక వర్గానికే కొమ్ముకాశాడని మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి విమర్శించారు. శనివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. "వైఎస్ సమాధి సాక్షిగా జగన్ సామాజిక ద్రోహానికి పాల్పడ్డాడు. మార్చిన స్థానాల్లో 9మంది రెడ్లనే మార్చాడు. కానీ 90స్థానాల్లో బడుగు వర్గాల వారిని మార్చాడు. నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ దీర్ఘాలు తీసే జగన్.. రెడ్డి సామాజిక వర్గానికి పెద్దపీట వేసి, బీసీలకు అన్యాయం చేశాడు. రాష్ట్ర జనాభాలో 52% ఉండే బీసీలకు దామాషా ప్రకారం 41 స్థానాలు రావాలి. 139 బీసీ కులాల్లో కేవలం 18 ఉపకులాలకే ప్రాధాన్యమిచ్చారు. ఈ రోజు ప్రకటించిన 139 జనరల్ స్థానాల్లో రెడ్డి వర్గానికి 49 సీట్లు కేటాయించారు. మొత్తంగా 35.25% రెడ్డి వర్గానికి సీట్లివ్వడమేనా సామాజిక న్యాయమంటే? ఇటీవల కేసీఆర్, జగన్ హైదరాబాద్‌లో తలుపులు మూసుకుని మాట్లాడుకున్నారు. ఆ సందర్భంగా జగన్, కేసీఆర్‌ను.. 'మన ఇష్టానుసారం దోచుకున్నాం. ఎవ్వరికీ అపాయింట్‌మెంట్లు ఇవ్వలేదు. సామాన్యులను కలిసిన దాఖలాల్లేవు. ఐదేళ్లు ప్యాలెస్‌లోనే ఉన్నా. ఈసారి మీ పరిస్థితే నాకూ పడుతుందేమోనని భయంగా ఉంది. అధికారం పోవడంతో మీరు ఏ విధంగా టైమ్ పాస్ చేస్తున్నారు?' అని అడిగాడు. దానికి కేసీఆర్... 'నువ్వు చేసిన అరాచకాలు నిన్ను వదలవు. నాకు పట్టిన గతే నీకూ పడుతుంది' అని అన్నాడు. అందుకే ఎన్నికల తర్వాత దేశం విడిచిపోవడానికి జగన్ ఇంగ్లాండ్ దగ్గర ఐల్యాండ్ కొన్నట్లు అనుమానంగా ఉంది. ఈ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి' అని దీపక్‌రెడ్డి హెచ్చరించారు.

కోడ్ వేళ 'కరువు' నాటకం!

▸ రబీలో 87 కరువు మండలాలు ప్రకటన

▸ ఆదరాబాదరాగా జగన్ ప్రభుత్వం ఉత్తర్వులు

▸ రైతులను మభ్యపెట్టడానికే..: విపక్షాల ఆరోపణ

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్ది క్షణాల ముందు జగన్ సర్కారు కరువు మండలాలపై డ్రామాకు తెరతీసింది. కరువు, చంద్రబాబు కవల పిల్లలంటూ హేళన చేసిన వైసీపీ నేతలు.. తమ పాలనలో ఒక్క కరువు మండలం కూడా ప్రకటించాల్సిన అవసరం రాదని ప్రగల్భాలు పలికారు. అయితే 2023 ఖరీఫ్‌లో 448 మండలాల్లో తీవ్ర వర్షాభావం ఏర్పడగా, 103 కరువు మండలాలు ప్రకటించిన జగన్ సర్కారు.. తాజాగా 2023-24 రబీ సీజన్ కింద 87 కరువు మండలాలను ప్రకటించింది. ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా ఉండటం వల్ల తీవ్ర వర్షాభావం నెలకొన్న ఆరు జిల్లాల్లోని 87 మండలాలతో కరువు ప్రభావిత మండలాల జాబితాను కోడ్ అమలులోకి వచ్చేముందు విడుదల చేసింది. నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లో 63 తీవ్రమైన కరువు మండలాలుగా, 24 ఒక మోస్తరు కరువు మండలాలుగా గుర్తించింది. ఈ మేరకు విపత్తుల నిర్వహణశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నోటిఫై చేసే కరువు మండలాల్లో మున్సిపల్ పట్టణ ప్రాంతాలు, నీటి వనరులకు గ్యారెంటీ ఉన్న ప్రాంతాలను తొలగించి, నిర్దిష్ట ప్రాంతాలను గుర్తిస్తూ కలెక్టర్లు జిల్లా గెజిట్‌లు ప్రకటిస్తారని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించని పట్టణ మండలాలను తాగునీటి అవసరాల కోసం కరువు మండలాలతో సమానంగా పరిగణించి, తక్షణ చర్యలు తీసుకుంటారని పేర్కొంది.

రబీ కరువు మండలాల వివరాలు

జిల్లా	తీవ్ర కరువు	మోస్తరు కరువు
నెల్లూరు	1	9
కర్నూలు	18	0
నంద్యాల	9	4
అనంతపురం	14	0
శ్రీసత్యసాయి	1	0
ప్రకాశం	20	11

రైతుల అభ్యంతరాలు

ఈశాన్య రుతుపవనాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 400.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కనీసం 302.6మి.మీ. వాన పడాల్సి ఉంది. కానీ గత అక్టోబరు నుంచి ఈ నెల మొదటివారం వరకు కేవలం 232.7 మి.మీ. మాత్రమే కరిసినట్లుగా నమోదైంది. డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ సంభవించి, 22 జిల్లాల్లో 6.65 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కానీ తుఫాన్‌కు ముందు, తర్వాత సీజన్ ముగిసే వరకు దక్షిణ కోస్తా, రాయలసీమలో దాదాపు అత్యధిక మండలాల్లో వాన జాడ లేక, తీవ్ర వర్షాభావం కొనసాగింది. ఉత్తర, మధ్య కోస్తాలోనూ పెద్దగా వర్షాలు పడలేదు. అయినా కూడా 6 జిల్లాల్లోని 87 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడంపై మిగతా మండలాల రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కోడ్ అమలులోకి వచ్చే ముందు రైతులను మభ్యపెట్టడానికే రబీ కరువు మండలాలను ప్రకటించినట్లు విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. వాస్తవానికి తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్‌లో 24 లక్షల ఎకరాల్లో రైతులు విత్తనమే వేయలేదు. రబీలోనూ 16 లక్షల ఎకరాలు బీడుగా మారాయి. రబీలో ఏ జిల్లాల్లోనూ నూరు శాతం పంటలు సాగవ్వలేదు. ఖరీఫ్‌లో 73%, రబీలో 75 శాతానికే సాగు పరిమితమైంది. ఖరీఫ్‌లో 26 జిల్లాల్లోని 448 మండలాల్లో వర్షాభావం ఏర్పడగా, 280 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు తాండవించాయి. అయినా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, ఎన్టీఆర్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కేవలం 103 మాత్రమే కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 80 మండలాలు తీవ్ర కరువుగా, మరో 23 మోస్తరు కరువు మండలాలుగా వర్గీకరించింది. ఖరీఫ్‌లో కరువుతో నష్టపోయిన 6.96 లక్షల మంది రైతులకు ఈ నెల 6న రూ.847 కోట్లు, రబీలో మిచౌంగ్ తుఫాన్‌కు పంట నష్టపోయిన 4.61 లక్షల మంది రైతులకు రూ.442 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ రెండు సీజన్ల పంటల బీమా పరిహారం వచ్చే జూన్‌లో వస్తుందని చెప్పిన సీఎం జగన్.. తుఫాన్ నష్టానికే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారు. రబీలో వర్షాభావంతో నష్టపోయినవారికి పంటల బీమానే దిక్కని చెప్పకనే చెప్పారని బాధిత రైతులు విమర్శిస్తున్నారు.

ఇదొక దోపిడీ రాకెట్!

ఎలక్టోరల్ బాండ్స్‌పై రాహుల్ ఫైర్



థానే, మార్చి 16: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎలక్టోరల్ బాండ్స్ పథకంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. దీనిని దోపిడీ రాకెట్‌గా అభివర్ణించారు. ఈ బాండ్స్ ద్వారా అందిన నిధులను ప్రభుత్వాలను కూల్చేసేందుకు, పార్టీలను విచ్ఛిన్నం చేసేందుకు వినియోగించారని మండిపడ్డారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మహారాష్ట్రలోని జంబాలీనాకా ప్రాంతంలో యాత్ర చేసిన రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఎలక్టోరల్ బాండ్స్‌పై మాట్లాడారు. "ఎలక్టోరల్ బాండ్స్ పథకం.. అంతర్జాతీయ స్థాయి దోపిడీ రాకెట్. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చేసేందుకు, రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేసేందుకు ఈ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఈడీ, సీబీఐ, ఐటీలు వెంటాడుతున్నాయి" అని దుయ్యబట్టారు. "మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ ఎమ్మెల్యేలు ఉచితార్థంగా ఆయా పార్టీలను వీడి వెళ్లిపోయారనుకుంటున్నారా?" అని నర్మగర్భంగా ప్రశ్నించారు. వారంతా డబ్బు ఎరజూపితేనే ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌ల వెంట వెళ్లిపోయారని పరోక్షంగా వ్యాఖ్యానించారు. కాగా, ఎన్నికల బాండ్ల విషయంలో బీజేపీని విమర్శిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. తమ పార్టీ తీసుకున్న ఎన్నికల బాండ్లను తిరిగిచ్చేస్తారా? అని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో వినియోగించుకునేందుకు నల్లధనం ద్వారా నిధులు సమకూరేవని ఫడణవీస్ ఆరోపించారు. ఆ నల్లధనానికి ఎన్నికల బాండ్ల పథకం అడ్డుకట్టవేయడం వల్లే ఆ పథకాన్ని రాహుల్ విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు.

కర్ణాటకను ఏటీఎం చేసుకున్నారు

▸ కలబురగి బహిరంగ సభలో ప్రధాని వ్యాఖ్యలు

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకను కాంగ్రెస్ కుటుంబం ఏటీఎంగా మార్చుకుందని ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీని గెలిపించి, కర్ణాటకను కాంగ్రెస్ లూటీ నుంచి కాపాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రంలోని కలబురగి నగరంలోని ఎన్‌వీ క్రీడామైదానంలో శనివారం మధ్యాహ్నం జరిగిన భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి కర్ణాటక నుంచి కాంగ్రెస్‌కు ఖాతా తెరిచే అవకాశం ఇవ్వబోమని తనకు హామీ ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'ఇండియా కూటమి' నేతలు కూడా 'అబ్ ఏక్ బార్ మోదీ సర్కారు' అని చెబుతున్నారని మోదీ సరదాగా వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వం కర్ణాటక సమగ్ర అభివృద్ధికి ఎంతగానో సహకారం అందించిందని పేర్కొన్నారు. రెండు రోజులుగా దక్షిణభారత రాష్ట్రాల్లో పర్యటిస్తున్నానని, అన్ని చోట్లా ప్రజాభిమానం బీజేపీ పట్ల వెల్లువెత్తుతోందన్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల షెడ్యూల్‌కు కొన్ని గంటల ముందు 'నేను మోదీ పరివారం' అనే సంగీత ప్రధాన ప్రచార వీడియోను మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పొందిన లబ్ధిదారులపై ఈ వీడియో తయారైంది.



కారంపూడిలో యుద్ధకాండ

▸ వాహనాలపై రాళ్లు రువ్వి.. ధ్వంసం

▸ సినిమా హాలు సెంటర్లో టీడీపీ, బస్టాండ్ సెంటర్లో వైసీపీ మోహరింపు

కారంపూడి, మార్చి 16: హైటెన్షన్ ఎన్నికల వాతావరణంలో.. షెడ్యూలు ప్రకటించిన రోజే పల్నాడు జిల్లా కారంపూడిలో యుద్ధ వాతావరణం నెలకొంది. వాహనాలపై రాళ్లు రువ్వుకోవడం, కవ్వింపు చర్యలతో టీడీపీ, వైసీపీ నాయకులు మోహరించడంతో ఏ క్షణాన ఏం జరుగుతోందనన్న భయానక వాతావరణం నెలకొంది. పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు శుక్రవారం రాత్రి తెలుగుదేశం పార్టీ నిర్వహించిన ఆత్మీయ సమావేశం విజయవంతం కావడాన్ని వైసీపీ నాయకులు ఓర్వలేకపోయారు. శనివారం రాత్రి సుమారు రాత్రి 9 గంటల సమయంలో వైసీపీ మూకలు పట్టణంలోని సినిమా హాలు సెంటర్‌కు చేరుకున్నాయి. అక్కడ టీడీపీ నేతలను చూసి దుర్భాషలాడుతూ కవ్వింపు చర్యలకు దిగారు. అంతటితో ఆగక టీడీపీకి చెందిన బీసీ సెల్ మండల కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు స్కార్పియో వాహనంపై రాళ్లు రువ్వి, అద్దాలు పగులకొట్టి మరో వాహనంపై వెళ్లిపోయారు. వీరిని టీడీపీ నేతలు మరో వాహనంలో వెంబడించారు. బస్టాండ్ సెంటర్ వద్దకు చేరుకున్నప్పటికీ వైసీపీ నేతలు కనిపించలేదు. దీంతో అక్కడే ఉన్న మాజీ ఎంపీపీ స్కార్పియో వాహనంపై దాడి చేసి అద్దాలు పగులకొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని వైసీపీ వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. మరోవైపు సినిమా హాలు సెంటర్లో టీడీపీ నేతలు, బస్టాండ్ సెంటర్లో వైసీపీ నేతలు గుమికూడి ఉన్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం గుప్పిట పట్టణ వాసులు ఉన్నారు.

మామిడి, నేరేడు తోటలకు నిప్పు

▸ రూ.20 లక్షల ఆస్తి నష్టం

▸ బాధితుల్లో మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, మార్చి 16: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండల పరిధిలోని కప్పలబండ గ్రామంలో శనివారం మామిడి, అల్లనేరేడు తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగిందా, ఎవరైనా నిప్పంటించారా అన్నది తేలాల్సి ఉంది. గ్రామానికి చెందిన రైతులు వెంగమనాయుడు, రోశయ్యచౌదరితోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తోటలలో పండ్ల చెట్లు దగ్ధం కావడంతో రూ.20 లక్షల దాకా నష్టం వాటిల్లింది. వెంగమనాయుడుకు చెందిన ఎనిమిది ఎకరాల తోటలో 1800 మామిడి చెట్లు, 150 అల్లనేరేడు చెట్లు, సూక్ష్మ సేద్య పరికరాలు ఆహుతయ్యాయి. దీంతో తనకు రూ.10 లక్షల దాకా పెట్టుబడి నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయారు. వెంగమనాయుడు తోట సమీపంలో ఉన్న రోశయ్య చౌదరికి చెందిన 150 మామిడిచెట్లు, సూక్ష్మ సేద్య పరికరాలు, దీనికి సమీపంలో ఉన్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తోటలోని 120 మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమీప తోటలలోని రైతులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. వేసవి కావడం, మామిడి తోటలలో గడ్డి ఎండిపోవడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత రైతులు తెలిపారు.

దుష్టపాలన అంతం కాబోతోంది

▸ రాష్ట్ర రాజధానికి భూములు త్యాగం చేసిన రైతులకు మంచి రోజులు

▸ తెలంగాణ చంద్రబాబు యువసేన



తుళ్లూరు రైతు ధర్నా శిబిరానికి వచ్చి మద్దతు తెలుపుతున్న తెలంగాణ చంద్రబాబు యువసేన

తుళ్లూరు, మార్చి 16: వైసీపీ దుష్టపాలన అంతం కాబోతోందని, రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులకు మంచి రోజులు రాబోతున్నాయని తెలంగాణ చంద్రబాబు యువసేన పేర్కొంది. శనివారం తుళ్లూరు రైతు ధర్నా శిబిరాన్ని సందర్శించి రైతులకు, మహిళలకు యువసేన సభ్యులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యువసేన అధ్యక్షుడు రఘుబాబు మాట్లాడుతూ, విజన్ ఉన్న చంద్రబాబు సీఎం అయితేనే జీవితాలలో వెలుగులు ఉంటాయని పేర్కొన్నారు. రాజధాని రైతులకు రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ అండగా నిలబడ్డారన్నారు. ఎన్నికల కోడ్ అమలు దగ్గర నుంచి రైతులకు ఉపశమనం కలుగుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాన్ని రక్షించుకోవాలని రైతులకు యువసేన సభ్యులు విజ్ఞప్తి చేశారు. రైతు ధర్నా శిబిరానికి మద్దతు తెలపడానికి వచ్చిన చంద్రబాబు యువసేన సభ్యులకు రైతు జేఏసీ నేతలు పువ్వాడ సుధాకరరావు, కాటా అప్పారావు సాదర స్వాగతం పలికి మెడలో ఆకుపచ్చ కండువాలు వేశారు. జై అమరావతి అంటూ వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో యువసేన తెలంగాణ అధ్యక్షుడు సీహెచ్ రఘుబాబు, వనస్థలిపురం బీఎస్ రెడ్డి, గద్దె విజయ్, మరో 10 మంది సభ్యులు పాల్గొన్నారు.

కవితే కీలక కుట్రదారు

▸ ఆమె మనీలాండరింగ్‌కు పాల్పడ్డారు

▸ అందుకే అరెస్టు చేసే అధికారం ఉంది

▸ ప్రత్యేక కోర్టుకు ఇచ్చిన నివేదికలో ఈడీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం ప్రధాన పాత్రధారుల్లో(కింగ్‌పిన్) కవిత ఒకరని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించింది. కుంభకోణంలో కీలక కుట్రదారని, ప్రధాన లబ్ధిదారని పేర్కొంది. ఆమె నుంచి వివరాలు సేకరించడానికి పది రోజుల కస్టడీకి ఇవ్వాలని ఢిల్లీలోని ఈడీ ప్రత్యేక న్యాయస్థానాన్ని కోరింది. ఈ మేరకు శనివారం వాదనల సందర్భంగా ఆమెను ఎందుకు కస్టడీకి ఇవ్వాలో వివరిస్తూ 15 పేజీల నివేదిక సమర్పించింది. శరత్‌రెడ్డి, రాఘవ మాగుంట, మాగుంట శ్రీనివాసులురెడ్డితో పాటు సౌత్ గ్రూప్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కవిత.. ఆమ్ ఆద్మీ పార్టీ అగ్రనేతలతో కుమ్మక్కయారని ఈడీ ఆరోపించింది. మద్యం కుంభకోణంలో భారీ ఎత్తున అక్రమార్జన సాగించేందుకు వీలుగా రూ.100కోట్ల మేర ముడుపులు చెల్లించారని తెలిపింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, అప్పటి ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి మనీశ్ సిసోడియాతో కవిత ఒక ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపింది. ఆ ఒప్పందంలో భాగంగానే సౌత్ గ్రూప్ సభ్యులతో కలిసి దళారుల ద్వారా ఆప్ నేతలకు ముడుపులు చెల్లించారని పేర్కొంది. ఎలాంటి పెట్టుబడులు పెట్టకుండానే తన డమ్మీ అరుణ్ పిళ్లై ద్వారా కవిత ఇండో స్పిరిట్‌లో భాగస్వామ్యం పొందారని, దేశంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారుల్లోనే ఒకటైన పెర్నార్డ్ రికార్డ్ ఇండియా పంపిణీ వ్యాపారంలో కూడా వాటాదారు అయ్యారని పేర్కొంది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో ఇండో స్పిరిట్‌కు అత్యధిక లాభాలు వచ్చేలా కవిత చూశారని, అందులో లాభాల రూపంలో భారీ ఎత్తున ఆర్జించారని వివరించింది. వంద కోట్ల ముడుపులను మాగుంట శ్రీనివాసులరెడ్డి, రాఘవ మాగుంట, గోపి కుమరన్, శరత్‌రెడ్డి, సమీర్ మహేంద్రు, దినేష్ అరోరా, అరుణ్ పిళ్లై, వి.శ్రీనివాస్, బుచ్చిబాబు ధ్రువీకరించాని ఈడీ పేర్కొంది. వీరు తమ ముందు ఇచ్చిన స్టేట్‌మెంట్లే కవితకు వ్యతిరేకంగా లభించిన 13 సాక్ష్యాలని పేర్కొంది. కవిత వివిధ మార్గాల ద్వారా పంపించిన వంద కోట్లు ఆప్ ఎన్నికల ప్రచారానికి మళ్లించినట్లు పేర్కొంది. పైన పేర్కొన్న సాక్ష్యాలన్నీ కవిత ఢిల్లీ ప్రభుత్వ ముఖ్యులకు వంద కోట్ల రూపాయల ముడుపులు ఇచ్చినట్లు ధ్రువీకరిస్తున్నాయని చెప్పింది. ఈ మొత్తం వ్యవహారంలో అభిషేక్ బోయిన్‌పల్లి, బుచ్చిబాబు ఆమెకు సహకరించారని పేర్కొంది. దర్యాప్తులో సహకరించడానికి కవితకు ఎన్నో అవకాశాలు కల్పించామని, వాటిని ఆమె వినియోగించుకోలేదని తెలిపింది. "దర్యాప్తు ఆలస్యం చేసేందుకు దురుద్దేశంతో కేసులు పెట్టారు. తప్పుడు సమాచారంతో సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. తన ఫోన్లను బలవంతంగా లాక్కొన్నారని ఆరోపించారు. 2023 మార్చి 21న కవిత స్వయంగా 9 మొబైళ్లను తీసుకొచ్చి రాజకీయ ప్రచారం చేసుకున్నారు. మాపై తప్పుడు ఆరోపణలు చేశారు. నిర్దిష్టమైన ప్రశ్నలకు సమాధానంగా అనవసరమైన అస్పష్టమైన రాజకీయ ప్రకటనలు చేశారు" అని ఈడీ పేర్కొంది. మనీలాండరింగ్ చట్టం 2002 సెక్షన్ 3 ప్రకారం కవిత నేరానికి పాల్పడినట్లు ధ్రువీకరణ అయిందని ఈడీ చెప్పింది. సెక్షన్ 19 ప్రకారం కవితను అరెస్టు చేసే అధికారం తమకు ఉందని స్పష్టం చేసింది. ఆ అధికారంతోనే శుక్రవారం ఆమెను అరెస్టు చేశామని చెప్పింది. అరెస్టు కారణాలను కవితకు, ఆమె భర్తకు వివరించామని పేర్కొంది.

ఈడీ కస్టడీకి కవిత

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు.. ఏడు రోజులపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అప్పగించింది. శనివారం సుదీర్ఘంగా జరిగిన వాదనల అనంతరం ఈ నెల 23వ తేదీ వరకు ఈడీ కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతి ఇచ్చింది. అయితే ప్రతి రోజూ కుటుంబ సభ్యులు, న్యాయవాదులు ఆమెను కలవొచ్చని, ఇంటి నుంచి భోజనం తెప్పించుకోవచ్చని తెలిపింది. కవితను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకొచ్చిన ఈడీ అధికారులు.. రాత్రంతా ఈడీ కార్యాలయంలోనే ప్రత్యేక సెల్‌లో ఉంచారు. శనివారం ఉదయం వైద్య పరీక్షల అనంతరం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో న్యాయమూర్తి నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచారు. కవిత తరపున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించగా, ఈడీ తరపున న్యాయవాదులు, స్పెషల్ పీపీ ఎన్‌కే మట్టా, ఈడీ స్పెషల్ కౌన్సిల్ జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. ఇదిలా ఉండగా.. "నన్ను అక్రమంగా అరెస్టు చేశారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తా" అని కవిత కోర్టులోపలికి వెళ్లేటప్పుడు మీడియాతో చెప్పారు.

అక్రమ బదిలీల్లో అధికారుల చేతివాటం!

▸ పైఅధికారుల కళ్లుగప్పి సొంతంగా 52 మంది బదిలీ

▸ రూ.2 కోట్ల వరకు వసూళ్లు.. వాటాలు పంచుకున్న ఆ ఇద్దరు

▸ 1,200 మంది బదిలీలలో ఇది వీరి బాదుడు.. ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల అక్రమ బదిలీల వ్యవహారంలో అధికారుల పాత్రపై అనుమానాలు పెరుగుతున్నాయి. విద్యాశాఖలోని కీలక నేత ఆదేశాలతో పాఠశాల విద్యాశాఖ 1200 మంది టీచర్లను అక్రమంగా బదిలీ చేస్తే, అందులో సుమారు 52 బదిలీలను అధికారులు సొంతంగా చేసుకుని, ముడుపులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. పాఠశాల విద్యాశాఖలోని ఓ అధికారి 32 మంది టీచర్లను, సచివాలయంలో విద్యాశాఖ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కర్నూలుకు చెందిన ఓ అధికారి 20 మందిని సొంతంగా బదిలీ చేసుకున్నారు. అక్రమ బదిలీలకు పైస్థాయి నుంచి ఆదేశాలు రావడంతో, అందులో వీరికి సంబంధించిన కొన్ని పేర్లను చేర్చారు. ఒక్కో టీచర్ నుంచి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల చొప్పున రూ.2 కోట్ల వరకూ ఆ ఇద్దరు అధికారులే వసూలు చేశారని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

సర్కారు బరితెగింపు..

కాగా, టీచర్ల బదిలీల్లో జగన్ ప్రభుత్వం బరి తెగించింది. కౌన్సెలింగ్ విధానం లేకుండా 1,200 మందిని అక్రమంగా బదిలీ చేసింది. ఒక్కో టీచర్ నుంచి సగటున రూ.5లక్షలు చొప్పున అధికార పార్టీ నేతలు వసూలు చేశారు. అందులో ఎక్కువ మొత్తం అధికార పార్టీకి చెందిన కీలక నేతకు చేరాయి. కీలక నేత వద్ద ఉన్న పీఏ ఈ అక్రమ బదిలీల్లో భారీగా వెనకేసుకున్నారు. మూడు రోజుల కిందట ఈ అక్రమ బదిలీల ఆర్డర్లను పాఠశాల విద్యాశాఖ డీఈవోలకు పంపింది. ఇంత బహిరంగంగా అక్రమ బదిలీలు చేస్తున్నా ప్రభుత్వం కిక్కురుమనలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా ఒకేసారి 1,200 మందిని అక్రమంగా బదిలీ చేయడం ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం రేపింది.

పదేళ్లకు పూర్తయిన పంపకం

▸ ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్ ఆస్తుల విభజన పూర్తి.. ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని న్యూఢిల్లీలో ఇరు తెలుగు రాష్ట్రాల ఆధీనంలో ఉన్న ఉమ్మడి ఏపీ భవన్ ఆస్తుల పంపకం ఎట్టకేలకు పూర్తైంది. వాటాల విషయంలో తెలంగాణ చేసిన ప్రతిపాదనకు ఏపీ అంగీకరించింది. అలాగే, ఏపీకి కేటాయించిన భూముల్లో ఆక్రమణలో ఉన్న ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే విషయంలో పరస్పర సహకరించుకోవాలని ఇరురాష్ట్రాలు అభిప్రాయానికి వచ్చాయి. దీంతో విషయం కొలిక్కి వచ్చింది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న భవన్ ఆస్తుల్లో ఏపీకి 11.536 (58.32శాతం) ఎకరాలు, తెలంగాణకు 8.245 (41.68శాతం) ఎకరాల చొప్పున వాటాల పంపిణీ జరిగింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కేంద్ర హోం శాఖ శుక్రవారం జారీ చేసింది. దీంతో పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఏపీ భవన్ విభజన పూర్తైంది. ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌజ్ అనే విభాగాలుగా భూములు, భవనాలు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.9913 కోట్లు వరకు ఉంటుంది. పంపకాలలో మొత్తం 19.781 ఎకరాల్లో ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌లో 0.954 ఎకరాలు, అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌజ్‌లో 2.396 ఎకరాలు ఏపీకి దక్కనున్నాయి. అలాగే, శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌజ్‌లో ఉన్న 5.245 ఎకరాలు తెలంగాణకు రానున్నాయి. నిజానికి, ఏపీ భవన్ ఆస్తుల విభజన అంశంపై కేంద్ర హోం శాఖ తెలుగు రాష్ట్రాల అధికారులతో గత సోమవారం సమావేశమైంది. భవన్ ఆస్తులకు సంబంధించి గతంలో తెలంగాణ చేసిన ప్రతిపాదనపై ఈ భేటీలో చర్చించారు. దీని ప్రకారం ఏపీకి వచ్చే భూమిలో వివాదాస్పదమైన(ఆక్రమణకు గురైన ప్రాంతం) 0.512 ఎకరాలను స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సమానమైన భూమిని శబరి బ్లాక్, పటౌడీ హౌజ్‌లో కేటాయించాలని గతంలో ఏపీ పెట్టిన షరతుపై సమీక్షించారు. ఆక్రమణల వైపు భవన్ గేటును(అశోక రోడ్ వైపున ఉన్న) మూసివేస్తే అన్యాక్రాంతమైన భూమి 0.512 నుంచి 0.112 ఎకరాలకు తగ్గిపోతుందని, అప్పుడు ఇరు ప్రభుత్వాలు కలిసి ఆక్రమణలను తొలగించాలనే అభిప్రాయానికి వచ్చారు. ఆయా అంశాలపై ఏపీ ప్రభుత్వం తన సమ్మతిని తెలియజేసింది. భవన్(అశోక రోడ్ వైపు) గేటును మూసివేయాలని, వివాదాస్పద భూమి(0.112 ఎకరాలు)ని స్వాధీనం చేసుకోవడంలో దామాషా ప్రకారం ఏపీ 0.069, తెలంగాణ 0.043 ఎకరాలలో ఆక్రమణలను తొలగించాలని తెలిపింది. ఈ క్రమంలో ఏదైనా నష్టం వస్తే ఇరు రాష్ట్రాలు దామాషా ప్రకారం భరించాలని కేంద్రానికి తెలియజేసింది. తెలంగాణ కూడా ఏపీ ప్రతిపాదనకు సమ్మతించడంతో ఇరురాష్ట్రాల మధ్య ఉమ్మడి భవన్ విభజన పూర్తయినట్లు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.



టీడీపీలో చేరిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పాలేటీ రామారావు, బాచిన చెంచుగరటయ్యలకు కండువాలు కప్పుతున్న చంద్రబాబు

ఒంగోలు ఎంపీ టీడీపీదే

» రాష్ట్రంలో సైకో పాలన పోతుంది.. మాగుంటకు టీడీపీలోకి ఆహ్వానం

» తండ్రి, తనయులకు కండువా కప్పి ఆహ్వానించిన బాబు

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో సైకోపాలన పోయి ఎన్డీయే సర్కార్ వస్తుంది. మాగుంట రాకతో ప్రకాశం జిల్లాలో రాజకీయం తలకిందులైంది. ఒంగోలు ఎంపీ స్థానం టీడీపీనే గెలుస్తుంది. దర్శి అభ్యర్థిని కూడా త్వరలో ప్రకటిస్తాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. శనివారం పార్టీ జాతీయ కార్యాలయంలో ఒంగోలు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డిని, అద్దంకి వైసీపీ నేతలు బాచిన కృష్ణచైతన్య, గరటయ్య, కావలి మాజీ ఎమ్మెల్యే ఒంటేరు వేణుగోపాలరెడ్డి, జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాగళం పేరుతో చిలకలూరిపేటలో బహిరంగ సభతో చరిత్ర సృష్టించబోతున్నామన్నారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. 'వైసీపీలో ఇమడలేక టీడీపీలో చేరాం. సొంత కుటుంబానికి తిరిగి వచ్చినట్లయింది. నమ్మించి మోసం చేయడంలో వైసీపీ నేతలు ముందు వరుసలో ఉన్నారు. అద్దంకి సీటు ఇస్తామని నమ్మించి చివరకు వారి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ప్రశ్నిస్తే వ్యాపార సంస్థలపై దాడులకు తెగబడ్డారు. షరతులు లేకుండానే టీడీపీలో చేరాను' అని అన్నారు.

చంద్రబాబుతో పిఠాపురం ఇన్‌చార్జ్ వర్మ భేటీ...

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ చంద్రబాబుతో భేటీ అయ్యారు. పిఠాపురం నుంచి జనసేనాని పవన్‌కల్యాణ్ పోటీ చేస్తుండటంతో వర్మతో మాట్లాడేందుకు చంద్రబాబు పిలిపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం వర్మ ఎంతో కృషి చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. పవన్ గెలుపునకు సహకరిస్తానని వర్మ హామీ ఇచ్చారని తెలిపారు. సీటు త్యాగం చేసిన ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పారు.

చరిత్రాత్మకంగా 'ప్రజాగళం'

భారీ స్థాయిలో ఏర్పాట్లు

» నేడు బొప్పూడి వేదికగా ఎన్డీఏ కూటమి తొలి బహిరంగ సభ

చిలకలూరిపేట/గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఆదివారం జరగనున్న 'ప్రజాగళం' బహిరంగ సభకు అంగరంగ వైభవంగా చేస్తున్న ఏర్పాట్లు పూర్తయ్యాయి. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జత కట్టిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తొలి సభ కావడం, ప్రధాని మోదీ హాజరు కానుండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీడీపీ, జనసేన పార్టీలు అంతే ప్రతిష్టాత్మకంగా సభకు ఏర్పాట్లు చేశాయి. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా కూటమి తొలి భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. చెన్నై జాతీయ రహదారి పక్కనే వందలాది ఎకరాల సువిశాల మైదానంలో ఈ సభను నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా లోక్‌సభ స్థానాల నుంచి కూటమి పార్టీల కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఉరిమే ఉత్సాహంతో తరలి రానున్నారు. ఈ సభకు ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు. ఇప్పటికే మంచి జోష్ మీదున్న క్యాడర్.. అధినేతలు ఇచ్చే సందేశంతో మరింత ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో పనిచేసి, కూటమి అఖండ విజయానికి కృషి చేయనున్నారు. వేదిక వద్ద వసతులు, వాహనాల పార్కింగ్, తాగునీరు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర చరిత్రలో ఈ సభ ఒక మైలురాయిగా నిలుస్తుందని కూటమి నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏర్పాట్లను ప్రజాగళం సభ ప్రత్యేక కమిటీ నేతలు పరిశీలించారు. ఎనిమిది అడుగుల ఎత్తున వేదికను నిర్మించారు. అగ్ర నాయకులు వస్తున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 3,900 మంది పోలీసులను విధులకు రప్పించారు. వేదిక మొత్తం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ ఆధీనంలోకి వెళ్లింది. విధులు నిర్వహించే పోలీసులతో ఉన్నతాధికారులు శనివారం సమావేశం నిర్వహించారు. హెలిప్యాడ్, సభా వేదిక వద్ద డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. శనివారం హెలికాప్టర్ల ట్రయల్ రన్ వేశాయి. జాతీయ రహదారికి ఇరువైపులా విశాలమైన పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి సభా ప్రాంగణానికి సులువుగా చేరుకునేందుకు వీలుగా ఎక్కడికక్కడ మార్గాలు ఏర్పాటు చేశారు. ఆరు హెలిప్యాడ్లు సిద్ధం చేయగా వాటిలో మూడు ప్రధాని బృందానికి కేటాయించారు. సభకు తరలివచ్చే లక్షలాది మంది జనం కోసం పసందైన భోజనాలు, బిర్యానీ, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. ప్రాంగణంలో ఎక్కడ నిలబడ్డా వేదికపై ఏం జరుగుతోందో వీక్షించేలా పదుల సంఖ్యలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కాగా, ఎన్నికల వేళ జరుగుతున్న 'ప్రజాగళం'లో మోదీ ప్రస్తావించే అంశాలపై ఆసక్తి నెలకొంది. 2015, అక్టోబరు 22న అమరావతి రాజధాని శంకుస్థాపనకు హాజరైన మోదీ ఇది ప్రపంచ స్థాయిలో భాసిల్లుతుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇప్పుడు కొత్త రాజధాని రైతులు ప్రధాని మోదీ ప్రజాగళం వేదికగా ఇచ్చే వరాల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు సీఎం పీఠం అధిష్టిస్తారనే ఆశ చిగురించటంతో పాటు ఎన్డీఏలో చేరటంతో మోదీ సహకారంతో రాజధానికి పూర్వ వైభవం వస్తుందనే ఆనందం రైతుల కళ్లలో కనిపిస్తోంది.



ప్రజాగళం సభ విజయవంతం చేయాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతల అభివాదం

వాహనాల దారి మళ్లింపు

ప్రధాని మోదీ సభకు వస్తున్న నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. ఐజీ పాలరాజు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ట్రాఫిక్ మళ్లింపు వివరాలను శనివారం ప్రకటించారు.

- జాతీయ రహదారిపై గుంటూరు-విజయవాడ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలను ఒంగోలు-దిగమర్రు జాతీయ రహదారి 214-ఏ పైకి మళ్లించి ఒంగోలు, త్రోవగుంట, చీరాల, పెనుమూడి, రేపల్లె, గుడివాడ, పామర్రు, చల్లపల్లి, మచిలీపట్నం మీదుగా విశాఖపట్నం హైవేకి కలపనున్నారు.
- చెన్నై నుంచి ఒంగోలు మీదుగా నార్కెట్‌పల్లి జాతీయ రహదారి 36పై హైదరాబాదుకు వెళ్లే భారీ వాహనాలను ఒంగోలు, మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ మీదుగా హైదరాబాద్‌కు దారి మళ్లించారు.
- కోల్‌కతా నుంచి చెన్నైకి ఎన్‌హెచ్ 16 మీదుగా చెన్నై వెళ్లే భారీ వాహనాలను విశాఖపట్నం, హనుమాన్ జంక్షన్ మీదుగా దిగమర్రు-ఒంగోలు ఎన్‌హెచ్ 214-ఏపై మచిలీపట్నం, గుడివాడ, పామర్రు, చల్లపల్లి, రేపల్లె, చీరాల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లించనున్నారు.
- హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 9పై కోల్‌కతా వెళ్లే భారీ వాహనాలను ఇబ్రహీంపట్నం, మైలవరం, నూజివీడు, హనుమాన్ జంక్షన్, విశాఖపట్నం మీదుగా మళ్లిస్తారు.
- హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్ 9పై చెన్నై వెళ్లే భారీ వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, దాచేపల్లి, పిడుగురాళ్ల, మేదరమెట్ల, ఒంగోలుమీదుగా చెన్నైకు పంపుతారు.

ఇదీ మోదీ షెడ్యూల్

ప్రజాగళం సభ ఆదివారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభమవుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ వేర్వేరుగా సభా వేదికకు హెలికాప్టర్లలో చేరుకుంటారు. ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి 4.10 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి హెలికాప్టర్‌లో సభావేదిక వద్దకు 4.55 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ప్రధాని ప్రసంగిస్తారు.

చరిత్రలో నిలిచిపోయేలా: ప్రత్తిపాటి

ప్రజాగళం సభ చరిత్రలో పది కాలాలపాటు నిలిచిపోతుందని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆ స్థాయికి తగిన రీతిలోనే సభ ఏర్పాట్లు చేశామన్నారు. ఆదివారం బొప్పూడి వద్ద జరగనున్న సభ ఏర్పాట్లను టీడీపీ నేతలు ఆలపాటి రాజా, బీద రవిచంద్ర, దామచర్ల సత్య, కిలారు రాజేశ్ తదితరులతో కలిసి ప్రత్తిపాటి పరిశీలించారు. ఈ సభకు 10 లక్షల మందికిపైగా మూడు పార్టీల శ్రేణులు తరలివస్తారని అంచనా వేసినట్టు చెప్పారు.

ప్రజాగళం ప్రత్యేక ఆకర్షణ

- వేదిక ఎత్తు 8 అడుగులు
- అధినేతల కోసం 6 హెలీప్యాడ్లు
- పదుల సంఖ్యలో ఎల్ఈడీ స్క్రీన్లు
- లక్షల మందికి పసందైన భోజనం/బిర్యానీ
- ఎండ బారిన పడకుండా తాగునీరు, మజ్జిగ
- 3600 మంది పోలీసులతో భద్రత

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా...

నియోజకవర్గం	అభ్యర్థి
ఇచ్ఛాపురం	పిరియా విజయ
పలాస	సీదిరి అప్పలరాజు
టెక్కలి	దువ్వాడ శ్రీనివాస్
పాతపట్నం	రెడ్డి శాంతి
శ్రీకాకుళం	ధర్మాన ప్రసాదరావు
ఆముదాలవలస	తమ్మినేని సీతారాం
ఎచ్చెర్ల	గొర్లె కిరణ్‌కుమార్
నరసన్నపేట	ధర్మాన కృష్ణదాసు
రాజాం	డాక్టర్‌తలే రాజేశ్
పాలకొండ	విశ్వసరాయి కళావతి
కురుపాం	పుష్పశ్రీవాణి పాముల
పార్వతీపురం	అలజంగి జోగారావు
సాలూరు	పీడిక రాజన్నదొర
బొబ్బిలి	చినఅప్పలనాయుడు
చీపురుపల్లి	బొత్స సత్యనారాయణ
గజపతినగరం	బొత్స అప్పలనరసయ్య
నెల్లిమర్ల	బడ్డుకొండ అప్పలనాయుడు
విజయనగరం	కోలగట్ల వీరభద్రస్వామి
శృంగవరపుకోట	కడుబండి శ్రీనివాసరావు
భీమిలి	ముత్తంశెట్టి శ్రీనివాసరావు
విశాఖపట్నం ఈస్ట్	ఎంవీవీ సత్యనారాయణ
విశాఖపట్నం దక్షిణం	వాసుపల్లి గణేశ్‌కుమార్
విశాఖపట్నం ఉత్తరం	కేకే రాజు
విశాఖపట్నం వెస్ట్	అదారి ఆనంద్
గాజువాక	గుడివాడ అమర్నాథ్
చోడవరం	కరణం ధర్మశ్రీ
మాడుగుల	బూడి ముత్యాలనాయుడు
అరకు లోయ (ఎస్టీ)	రేగం మత్స్యలింగం
పాడేరు	మత్స్యరాస విశ్వేశ్వరరాజు
అనకాపల్లి	మలసాల భరత్‌కుమార్
పెందుర్తి	అన్నంరెడ్డి అదీప్‌రాజు
ఎలమంచిలి	ఉప్పలపాటి రమణమూర్తి రాజు
పాయకరావుపేట (ఎస్సీ)	కంభాల జోగులు
నర్సీపట్నం	పెట్ల ఉమాశంకరగణేశ్
తుని	దాడిశెట్టి రాజా
ప్రత్తిపాడు	వరుపుల సుబ్బారావు
పిఠాపురం	వంగా గీత
కాకినాడ రూరల్	కురసాల కన్నబాబు
పెద్దాపురం	దవులూరి దొరబాబు
అనపర్తి	సత్తి సూర్యనారాయణ రెడ్డి
కాకినాడ సిటీ	ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి
రామచంద్రాపురం	పిల్లి సూర్యప్రకాశ్
ముమ్మిడివరం	పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
అమలాపురం (ఎస్సీ)	పినిపె విశ్వరూప్
రాజోలు (ఎస్సీ)	గొల్లపల్లి సూర్యారావు
పి.గన్నవరం (ఎస్సీ)	విప్పర్తి వేణుగోపాల్
కొత్తపేట	చిర్ల జగ్గిరెడ్డి
మండపేట	తోట త్రిమూర్తులు
రాజానగరం	జక్కంపూడి రాజా
రాజమండ్రి సిటీ	మార్గాని భరత్
రాజమండ్రి రూరల్	చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ
జగ్గంపేట	తోట నరసింహం
రంపచోడవరం(ఎస్టీ)	నాగులపల్లి ధనలక్ష్మి
కొవ్వూరు (ఎస్సీ)	తలారి వెంకట్రావ్
నిడదవోలు	జి.శ్రీనివాసనాయుడు
ఆచంట	చెరుకువాడ శ్రీరంగనాథరాజు
పాలకొల్లు	గుడాల శ్రీహరి గోపాలరావు
నరసాపురం	ముదునూరి ప్రసాదరాజు
భీమవరం	గ్రంధి శ్రీనివాస్
ఉండి	పీవీఎల్ నరసింహరాజు
తణుకు	కారుమూరి వెంకట నాగేశ్వరరావు
తాడేపల్లి గూడెం	కొట్టు సత్యనారాయణ
ఉంగుటూరు	పుప్పాల శ్రీనివాసరావు
దెందులూరు	అబ్బయ్య చౌదరి
ఏలూరు	ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్
గోపాలపురం(ఎస్సీ)	తానేటి వనిత
పోలవరం (ఎస్టీ)	తెల్లం రాజ్యలక్ష్మి
చింతలపూడి(ఎస్సీ)	కంభం విజయరాజు
నూజివీడు	మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
గన్నవరం	వల్లభనేని వంశీమోహన్
గుడివాడ	కొడాలి వెంకటేశ్వరరావు
కైకలూరు	దూలం నాగేశ్వరరావు
పెడన	ఉప్పల రాము
మచిలీపట్నం	పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)
అవనిగడ్డ	సింహాద్రి రమేశ్‌బాబు
పామర్రు(ఎస్సీ)	కైలే అనిల్‌కుమార్
పెనమలూరు	జోగి రమేశ్
విజయవాడ వెస్ట్	షేక్ ఆసిఫ్
విజయవాడ సెంట్రల్	వెలంపల్లి శ్రీనివాస్
మైలవరం	సర్నాల తిరుపతిరావు
నందిగామ(ఎస్సీ)	మొండితోక జగన్మోహనరావు
జగ్గయ్య పేట	సామినేని ఉదయభాను
పెదకూరపాడు	నంబూరు శంకరరావు
వేమూరు (ఎస్సీ)	వరికూటి అశోక్‌బాబు
తాడికొండ (ఎస్సీ)	మేకతోటి సుచరిత
మంగళగిరి	మురుగుడు లావణ్య
పొన్నూరు	అంబటి మురళీకృష్ణ
రేపల్లె	ఈంవూరు గణేష్
తెనాలి	అన్నాబత్తుని శివకుమార్
బాపట్ల	కోన రఘుపతి
ప్రత్తిపాడు	బాలసాని కిరణ్‌కుమార్
గుంటూరు పశ్చిమ	విడదల రజని
గుంటూరు తూర్పు	నూరీ ఫాతిమా
చిలకలూరి పేట	మనోహర్‌నాయుడు
నరసరావు పేట	గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
సత్తెనపల్లి	అంబటి రాంబాబు
వినుకొండ	బొల్లా బ్రహ్మనాయుడు
గురజాల	కాసు మహేశ్‌రెడ్డి
మాచర్ల	పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
ఎర్రగొండపాలెం (ఎస్సీ)	తాడిపర్తి చంద్రశేఖర్
దర్శి	బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
పర్చూరు	యడం బాలాజీ
అద్దంకి	పాణెం చిన్న హన్మిరెడ్డి
చీరాల	కరణం వెంకటేశ్
ఒంగోలు	బాలినేని శ్రీనివాసరెడ్డి

నియోజకవర్గం	అభ్యర్థి
సంతనూతలపాడు (ఎస్సీ)	మేరుగ నాగార్జున
కందుకూరు	బుర్రా మధుసూదనయాదవ్
కొండపి (ఎస్సీ)	ఆదిమూలపు సరేశ్
మార్కాపురం	అన్నా రాంబాబు
గిద్దలూరు	కుందూరు నాగార్జున రెడ్డి
కనిగిరి	దద్దాల నారాయణ యాదవ్
కావలి	రాంరెడ్డి ప్రతాపరెడ్డి
కోవూరు	నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి
ఆత్మకూరు	మేకపాటి విక్రంరెడ్డి
నెల్లూరు సిటీ	మహమ్మద్ ఖలీల్ అహ్మద్
నెల్లూరు రూరల్	ఆదాల ప్రభాకరరెడ్డి
ఉదయగిరి	మేకపాటి రాజగోపాల్‌రెడ్డి
సర్వేపల్లి	కాకాణి గోవర్ధనరెడ్డి
గూడూరు (ఎస్సీ)	మేరుగ మురళీధర్
సుళ్లూరు పేట	కిలివేటి సంజీవయ్య
వెంకటగిరి	నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి
బద్వేల్ (ఎస్సీ)	దాసరి సుధ
రాజంపేట	ఆకేపాటి అమర్నాథరెడ్డి
కడప	అంజాద్ బాషా
కోడూరు (ఎస్సీ)	కోరుముట్ల శ్రీనివాసులు
రాయచోటి	గడికోట శ్రీకాంత్‌రెడ్డి
పులివెందుల	వైఎస్ జగన్మోహన రెడ్డి
కమలాపురం	పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి
జమ్మలమడుగు	మూలె సుధాకర రెడ్డి
ప్రొద్దుటూరు	రాచమల్లు శివప్రసాదరెడ్డి
మైదుకూరు	శెట్టిపల్లి రఘురామిరెడ్డి
ఆళ్లగడ్డ	గంగుల బ్రిజేంద్ర రెడ్డి
శ్రీశైలం	శిల్పా చక్రపాణిరెడ్డి
నందికొట్కూరు(ఎస్సీ)	దారా సుధీర్
కర్నూలు	ఎ.మహ్మద్ ఇంతియాజ్
పాణ్యం	కాటసాని రాంభూపాల్‌రెడ్డి
నంద్యాల	శిల్పా రవిచంద్రారెడ్డి
బనగానపల్లె	కాటసాని రామిరెడ్డి
డోన్	బుగ్గన రాజేంద్రనాథరెడ్డి
పత్తికొండ	కంగాటి శ్రీదేవి
కొడుమూరు(ఎస్సీ)	ఆదిమూలపు సతీశ్
ఎమ్మిగనూరు	బుట్టా రేణుక
మంత్రాలయం	ఎల్లారెడ్డిగారి బాలనాగిరెడ్డి
ఆదోని	వై.సాయిప్రసాదరెడ్డి
ఆలూరు	బి.విరూపాక్షి
రాయదుర్గం	మెట్టు గోవింద రెడ్డి
ఉరవకొండ	ఎల్లారెడ్డిగారి విశ్వేశ్వర రెడ్డి
గుంతకల్	వై.వెంకట్రామి రెడ్డి
తాడిపత్రి	కేతిరెడ్డి పెద్దారెడ్డి
శింగనమల(ఎస్సీ)	మన్నెపాకుల వీరాంజనేయులు
అనంతపురం	అనంత వెంకట్రామిరెడ్డి
మడకశిర (ఎస్సీ)	ఈర లక్కప్ప
కళ్యాణ దుర్గం	తలారి రంగయ్య
రాప్తాడు	తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి
హిందూపురం	టిప్పేగౌడ నారాయణ దీపిక
పెనుకొండ	కేవీ ఉషశ్రీ చరణ్
పుట్టపర్తి	దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
ధర్మవరం	కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి
కదిరి	బీఎస్ మఖ్బూల్ అహ్మద్
తంబళ్లపల్లె	పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి
పీలేరు	చింతల రామచంద్రారెడ్డి
మదనపల్లె	నిషార్ అహ్మద్
పుంగనూరు	పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
చంద్రగిరి	చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
తిరుపతి	భూమన అభినయ్‌రెడ్డి
శ్రీకాళహస్తి	బియ్యపు మధుసూదనరెడ్డి
సత్యవేడు (ఎస్సీ)	నూకతోటి రాజేశ్
నగరి	ఆర్కే రోజా
కుప్పం	కృష్ణ రాఘవ జయేంద్ర భరత్
గంగాధరనెల్లూరు (ఎస్సీ)	కళత్తూరు కృపాలక్ష్మి
చిత్తూరు	ఎం.సి.విజయానందరెడ్డి
పూతలపట్టు (ఎస్సీ)	ముదిరేవుల సునీల్‌కుమార్

నా.. నా.. నా.. నై!!

సొంత వారికే వీరతాళ్లు.. 49 మంది రెడ్లకు సీట్లు

"నా.. నా.. నా.. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు" అంటూ ఇటీవల కాలంలో ఎక్కడ సభ పెట్టినా ఊదరగొడుతున్న వైసీపీ అధినేత, సీఎం జగన్.. తీరా అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల కేటాయింపులకు వచ్చే సరికి 'నై' అనేశారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగానే ఉన్నారని స్వయంగా ఆయనే చెబుతున్న బీసీలకు మొక్కుబడిగా 48 అసెంబ్లీ సీట్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఇదేసమయంలో తన సొంత సామాజిక వర్గం రెడ్లకు 49 సీట్లు కేటాయించి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఇక, ఎస్సీ, ఎస్టీలకు వారికే రిజర్వ్ చేసిన స్థానాలు ఇచ్చి మహా ఘన కార్యం చేశామని గొప్పలు చెప్పుకొన్నారు.

▸▸ బీసీలకు దక్కింది 48 స్థానాలే

▸▸ మాటల్లో అదరగొట్టిన జగన్.. సీట్లలో విఫలమైన గన్

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ అట్టహాసంగా ఇడుపులపాయలో ప్రకటించిన అసెంబ్లీ, పార్లమెంటు సభ్యుల జాబితా మేడి పండును తలపిస్తోంది. ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా ఉద్ధరించని విధంగా తాము బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేశామన్న మాటలు నేతిబీరనే తలపించాయి. రాష్ట్రంలో మెజారిటీ ఓటు బ్యాంకుగా ఉన్న బీసీలకు మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో కేవలం 48 సీట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. ఇదేసమయంలో కొన్ని జిల్లాలకే పరిమితమైన తన సొంత సామాజిక వర్గం రెడ్లకు మాత్రం 49 సీట్లు ఇచ్చి పైచేయి నిరూపించుకున్నారు. ఇక, ఎస్సీ, ఎస్టీలకు వారికి కేటాయించిన రిజర్వ్‌డ్ స్థానాలనే ఇచ్చి ఏదో మేలు చేశామన్న గొప్పలు చెప్పుకొచ్చారు. మొత్తంగా చూస్తే వైసీపీ ప్రకటించిన అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల పంపకాలు మొత్తం తన వారి చుట్టూనే తిరగడం గమనార్హం.

జాబితాలు ఏమయ్యాయి?

సింహం సింగిల్‌గా వస్తుందంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసిన సీఎం జగన్.. నియోజకవర్గాల సమన్వయకర్తలతో కూడిన 13 జాబితాలు ప్రకటించారు. అయినప్పటికీ అభ్యర్థుల కొరత కొట్టొచ్చినట్టు కనిపించింది. శనివారం 175 స్థానాలకు అభ్యర్థులు ప్రకటించినా, 25 లోక్‌సభ స్థానాల్లో అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థిని ప్రకటించలేకపోయారు. ఏడాది నుంచే అభ్యర్థుల ఎంపికకు జగన్ కసరత్తు చేసినా పూర్తిస్థాయిలో ఖరారు చేయలేకపోయారు. పాలకపక్షం నుంచి లోక్‌సభకు పోటీ చేసేందుకు ముఖ్యనాయకులెవరూ ముందుకు రాకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దిగాలంటూ జగన్ స్వయంగా కోరినా ముఖ్యనేతలు చేతులెత్తేశారు. వైసీపీ స్థాపించాక మొదటిసారి జగన్‌కు ఇలాంటి అనుభవం ఎదురవడం గమనార్హం. గత డిసెంబరులో జరిగిన తెలంగాణ ఎన్నికల సమయంలో అధికారపక్షం బీఆర్ఎస్ తన సిట్టింగ్ అభ్యర్థులను మార్చలేదు. ఫలితంగా ఆ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయింది. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన మిత్రుడైన జగన్‌కు చెప్పినట్టు సమాచారం. దీంతో జగన్ తన పార్టీ అభ్యర్థుల విషయంలో ముందే జాగ్రత్తపడ్డారు. ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను సమూలంగా మార్చేస్తానని ప్రకటించారు. టికెట్ల విషయంలో మొహమాటాలేమీ ఉండబోవంటూ గడప గడపకూ మన ప్రభుత్వం వర్క్‌షాపులో ఎమ్మెల్యేలకు, మంత్రులకు స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యేలను గంపగుత్తగా మార్చేస్తారేమోనని చాలామంది ఆందోళన చెందారు. దీంతో, రానురాను వారు గడప గడపకూ కార్యక్రమాల్లో పాల్గొనడమే మానేశారు. ఇలా మానేసిన వారందరినీ మార్చేసి కొత్తవారిని అసెంబ్లీ స్థానాల్లో సమన్వయకర్తలుగా నియమిస్తానంటూ జగన్ హెచ్చరికలు కూడా చేశారు. అయినప్పటికీ పాలకపక్ష ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. గత డిసెంబరు 27న తొలివిడతలో 11మంది అసెంబ్లీ ఇన్‌చార్జులను ప్రకటించారు. వీరిలో ముగ్గురు మంత్రులు విడదల రజని, ఆదిమూలపు సురేశ్, మేరుగ నాగార్జున కూడా ఉన్నారు. ఇలా వెనుకబడ్డ సామాజికవర్గానికి చెందిన నేతలను బదిలీ చేయడం మినహా జగన్ కఠిన నిర్ణయాలను తీసుకోలేకపోయారు.



వైసీపీ అభ్యర్థుల జాబితా ప్రకటన సందర్భంగా మాట్లాడుతున్న సీఎం జగన్

సామాజిక న్యాయం ఏదీ?

తొలి నుంచి సామాజికన్యాయం అమలు చేస్తానంటూ జగన్ హడావుడి చేస్తూ వచ్చారు. దీంతో.. జనరల్ స్థానాల్లో సైతం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను బరిలోకి దింపి కొత్త రాజకీయ సంప్రదాయానికి తెరతీస్తారేమోనని అందరూ భావించారు. కానీ, 2019 తరహాలోనే 2024లోనూ 175 మంది ఎమ్మెల్యే, 25 మంది లోక్‌సభ అభ్యర్థుల్లో 33 మంది ఎస్సీ అభ్యర్థులను, 8 మంది ఎస్టీలను రిజర్వుడు స్థానాలకే పరిమితం చేశారు. రాజకీయంలో కొత్తదనం తెస్తానన్న తన మాటను తానే తప్పి.. జనరల్ స్థానాల్లో బడుగు, బలహీన వర్గాలకు అవకాశం ఇవ్వకపోవడం గమనార్హం. రాష్ట్రంలో బీసీలు దాదాపు 53 నుంచి 62 శాతం ఉన్నారు. జగన్ చెప్పిన మాట ప్రకారం.. మొత్తం 200 స్థానాల్లో సగం స్థానాలను(100 సీట్లు) బీసీలకు ఇవ్వాలి. కానీ.. అసెంబ్లీ, పార్లమెంటు రెండు కలిపి కేవలం 59 స్థానాలకే బీసీలను పరిమితం చేశారు. ఇదే సమయంలో 200 స్థానాలలో 100 సీట్లను అగ్రవర్ణాలకు కేటాయించారు. 25 లోక్‌సభ స్థానాల్లో 4 ఎస్సీ, 1 ఎస్టీ, 11 బీసీలకు, 9 అగ్రవర్ణాలకు కేటాయించారు. 2019తో పోల్చితే.. 2024లో మహిళలకు 4స్థానాలు అధికంగా ఇచ్చామని చెప్పారు. 2019లో 15గా ఉన్న మహిళల సీట్లను 19కు పెంచామని తెలిపారు. ఈ గణాంకాల మాటెలా ఉన్నా.. 175 మంది అభ్యర్థులలో 49మంది రెడ్లకే సీట్లు దక్కాయి. రాష్ట్రంలో రెడ్ల జనాభా అంతంతగానే ఉన్నప్పటికీ.. వెనుకబడ్డవారికి కేటాయించిన 48 స్థానాల కంటే ఒక స్థానం అధికంగా కేటాయించి వారిదే పైచేయిగా చూపించారు. బడుగు బలహీనవర్గాలను కసిరి కొట్టి సొంత సామాజికవర్గం రెడ్డి నేతలు 49 మందికి జగన్ అవకాశం కల్పించడంపై రాజకీయపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. బీసీలకు అన్యాయం చేస్తూనే చారిత్రాత్మక జాబితా అంటూ జగన్ ప్రకటించుకోవడం ఏంటని నిలదీస్తున్నారు.

అలా ప్రకటించి.. ఇలా తీసేసి!

అనకాపల్లి లోక్‌సభ స్థానానికి సీఎం జగన్ తొలుత సామాజికంగా వెనుకబడ్డ వర్గానికి చెందిన రమాదేవి పేరును ప్రకటించారు. కానీ.. ఇప్పుడు అర్ధంతరంగా ఆమెను పక్కన పెట్టేశారు. అనకాపల్లి నుంచి బీజేపీ బరిలోకి దిగే చాన్సుందని భావిస్తున్న ఆయన.. అక్కడ నుంచి బలమైన సామాజికవర్గానికి చెందిన నేతను బరిలోకి దింపే వ్యూహంలో ఇక్కడ అసలు అభ్యర్థినే ప్రకటించకపోవడం గమనార్హం.

ఓడిపోతారని తెలిసీ..

వైసీపీ ఎంపీలు రఘురామకృష్ణరాజు(నరసాపురం), సంజీవ్‌కుమార్(కర్నూలు), లావు శ్రీకృష్ణదేవరాయలు(నరసరావుపేట), మాగుంట శ్రీనివాసులు రెడ్డి(ఒంగోలు), వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి(రాజ్యసభ), వల్లభనేని బాలశౌరి(మచిలీపట్నం)లు వైసీపీకి దూరమయ్యారు. దీంతో.. వైసీపీకి బలమైన అభ్యర్థులు దొరకడమే కష్టమైపోయింది. దీంతో.. కొత్తగా ఎవరు వచ్చినా కండువా కప్పి టికెట్ ఇచ్చేయడం వైసీపీలో పరిపాటిగా మారింది. విజయవాడ ఎంపీ కేశినేని నాని టీడీపీ నుంచి వైసీపీలోకి చేరకముందే, జగన్ చేతుల మీదుగా కండువాను కప్పుకోకముందే ఆయనకు టికెట్ ప్రకటించేశారు. అదేవిధంగా ఇటీవలే వైసీపీ గూటికి చేరిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకు రాజోలు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. మంత్రులు అంబటి రాంబాబు, ఆర్కే రోజా, మాజీ మంత్రి కొడాలి నాని, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వంటి వారికి టికెట్ దక్కదంటూ సొంత పార్టీనేతలే ప్రచారం చేశారు. కానీ, అభ్యర్థుల కొరతతో వీరు ఓడిపోతారని తెలిసినా టికెట్లు ఇచ్చారంటే పార్టీ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతుందని ప్రతిపక్ష నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రజలపై నమ్మకంతోనే మార్పులు చేశాం

టికెట్ రానివారికి మళ్లీ గెలిచాక గుర్తింపు: సీఎం

కడప, మార్చి 16(ఆంధ్రజ్యోతి): "ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే 50శాతం పదవులు అమలయ్యేలా చట్టం చేసిన ప్రభుత్వం మనదే. ఆ మేరకు సీట్లలోనూ వారికి 50 శాతం కేటాయించాం" అని సీఎం జగన్ అన్నారు. శనివారం ఇడుపులపాయలో వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత తండ్రి వైఎస్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం జాబితా విడుదల కార్యక్రమంలో మాట్లాడారు. 25పార్లమెంట్ స్థానాలకు, 175 ఎమ్మెల్యే స్థానాలకు తుది జాబితా విడుదల చేశామన్నారు. దీనిలో అనకాపల్లి ఎంపీ స్థానం ఒక్కటి పెండింగ్‌లో పెట్టామన్నారు. ఎప్పుడూ చూడని విధంగా సామాజిక న్యాయం అన్నది మాటల్లోనే కాదు చేతల్లో కూడా చేసి చూపించగలిగామని చెప్పారు. ఈ ఎన్నికల్లో దాదాపు 81 స్థానాల్లో ఎమ్మెల్యేలను మార్చినట్టు చెప్పారు. 18ఎంపీ స్థానాలకు మార్పు జరిగిందన్నారు. ప్రజల మీద నమ్మకంతోనే మార్పులు చేశామన్నారు. టికెట్ రాని వాళ్లకు వైసీపీ ప్రభుత్వం ఏర్పడితే సముచితస్థానం కల్పిస్తామన్నారు. కాగా, సీఎం మాట్లాడటానికి ముందు ఎంపీ అభ్యర్థుల జాబితాను ఎంపీ నందిగం సురేశ్‌బాబు, ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను ఎమ్మెల్యే ధర్మాన ప్రసాద్ చదివి వినిపించారు.

మోగింది భేరి.. హోరాహోరీ!

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల షెడ్యూల్

- నోటిఫికేషన్ : 18-4-2024
- నామినేషన్ల గడువు : 25-04-2024
- నామినేషన్ల పరిశీలన : 26-04-2024
- ఉపసంహరణ : 29-04-2024
- పోలింగ్ తేదీ : 13-05-2024
- ఓట్ల లెక్కింపు : 4-06-2024

విడుదలైన సమయానికే ఎన్నికల వాతావరణం వేడెక్కింది. షెడ్యూలుకు... పోలింగ్ తేదీకి మధ్య 52 రోజుల గడువు ఉంది. దీంతో... వ్యూహ ప్రతివ్యూహాలకు, విస్తృత స్థాయి ప్రచారానికి తగినంత గడువు లభించినట్లయింది.

ఖరారైన పొత్తులు... అభ్యర్థులు

షెడ్యూల్ విడుదలయ్యే సమయానికే రాష్ట్రంలో ప్రధాన పార్టీల మధ్య పొత్తులు, సీట్ల సర్దుబాటు పూర్తయిపోయింది. టీడీపీ, జనసేన మధ్య అంతకు ముందే పొత్తు కుదరగా... తాజాగా బీజేపీ కూడా వారితో జతకట్టింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగించింది. కలిసి ప్రయాణం చేయాలనుకున్న వెంటనే... ఆ పార్టీల మధ్య శరవేగంగా సీట్ల సర్దుబాటు కూడా పూర్తయింది. ఎవరెవరు ఎక్కడ పోటీచేయాలనే అంశంపై అంగీకారం కూడా కుదిరింది. ఈ సర్దుబాటుకు అనుగుణంగా టీడీపీ ఇప్పటికే 128 అసెంబ్లీ సీట్లలో అభ్యర్థులను ప్రకటించింది. జనసేన 16 సీట్లకు అభ్యర్థులను ఖరారు చేసింది. బీజేపీ ఇంకా తమ అభ్యర్థులను ప్రకటించలేదు. అధికార పక్షం వైసీపీ 13 విడతల్లో జాబితాలు ఇస్తూ ఇస్తూ... మార్పులు చేస్తూ... చివరికి శనివారం పూర్తి జాబితా విడుదల చేసింది. ఒక్క అనకాపల్లి ఎంపీ సీటు మాత్రం పెండింగ్‌లో ఉంచింది.

జోరుగా ప్రచార హోరు...

అభ్యర్థుల ఎంపికపై చాలా రోజులుగా కసరత్తు చేస్తున్న ప్రధాన పార్టీలు ఎప్పుడో ప్రచార భేరీ మోగించాయి. 'రా... కదలిరా' పేరుతో చంద్రబాబు రాష్ట్రంలోని పాతిక లోక్‌సభ స్థానాల పరిధిలో ఇప్పటికే బహిరంగ సభలు నిర్వహించారు. ఆయన కుమారుడు లోకేశ్ 'శంఖారావం' పేరుతో అసెంబ్లీ నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి వారిని ఉత్సాహపరుస్తున్నారు. టీడీపీ చరిత్రలో మొదటిసారిగా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కూడా ఈసారి ప్రచార రంగంలోకి దిగారు. 'నిజం గెలవాలి' పేరుతో ఆమె రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ చంద్రబాబు అరెస్టు సమయంలో చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తూ ప్రజలను, పార్టీ కార్యకర్తలను కలుస్తున్నారు. మూడు పార్టీల పొత్తు తర్వాత ఆదివారం చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. దీనికి ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ హాజరవుతున్నారు. సుమారు ఆరేళ్ల తర్వాత ఒకే వేదికపైకి మోదీ, చంద్రబాబు వస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు అధికార పక్షం వైసీపీ కూడా వేగంగా ప్రచారంలోకి దిగింది. 'సిద్ధం' పేరుతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆ పార్టీ నాలుగు భారీ బహిరంగ సభలు నిర్వహించింది. సోమవారం నుంచి నియోజకవర్గాల పర్యటనలకు జగన్మోహన్ రెడ్డి రంగం సిద్ధం చేసుకొంటున్నారు. అధికారం అండ, వనరులు దండిగా ఉండటంతో ఆ పార్టీ నేతలు వారం పది రోజులుగా రాష్ట్రంలో వివిధ వర్గాల వారిని కానుకలతో ముంచెత్తుతున్నారు. వలంటీర్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల దాకా ఎవరినీ వదలకుండా కుక్కర్లు, ఫ్లాస్కులు, చీరలు, నగదు పంచుతున్నారు. మరోపక్క జగన్ మేనత్త విమలా రెడ్డి క్రైస్తవ మత ప్రబోధకుల సమావేశాలు పెట్టి కానుకలు, వస్త్రాలు, నగదు పంపిణీ చేయిస్తున్నారు.

మేమూ ఉన్నాం అంటున్న కాంగ్రెస్...

రాష్ట్ర విభజన పరిణామాల్లో రాష్ట్రంలో కుప్పకూలిన కాంగ్రెస్ పార్టీ ఈసారి ఉత్సాహంతో ముందుకు వస్తోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోదరి షర్మిలను పీసీసీ అధ్యక్షురాలిగా చేయడం... అన్నపై ఆమె విరుచుకుపడుతుండటంతో ఆ పార్టీ కార్యక్రమాలకు ఆకర్షణ పెరిగింది. వామపక్షాలు కూడా కాంగ్రెస్‌తో జట్టు కడుతున్నాయి.

పురోగతా... పథకాలా?

ఈసారి పోరు కీలకమైన అంశాలతో మోతెక్కనుంది. అభివృద్ధి గురించి చెప్పుకోవడానికి ఏమీ లేకపోవడంతో అధికార పక్షం కేవలం 'బటన్‌నొక్కుడు'నే నమ్ముకుని జనంలోకి వెళ్తోంది. టీడీపీ దీనికి భిన్నంగా 'అభివృద్ధి - సంక్షేమం' రెండూ తమతోనే సాధ్యమని ప్రచారం చేస్తోంది. జగన్ పాలనలో రాష్ట్రం ఇరవై ఏళ్లు వెనక్కు వెళ్లిందని, మళ్లీ తాము వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి ఉంటుందని ఆ పార్టీ చెబుతోంది. 'సూపర్ సిక్స్' పేరుతో కొత్త పథకాలను ప్రచారంలో పెట్టింది. బీజేపీని కలుపుకోవడం వల్ల రాష్ట్రానికి కేంద్రం నుంచి ఇతోధికంగా సాయం అందుతుందని కూడా ఆ పార్టీ నేతలు ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు. వలంటీర్లు, పోలీసులు, అధికార యంత్రాంగాన్ని వైసీపీ వాడుకొనే ప్రయత్నం చేస్తుండగా... కౌరవులు ఎందరున్నా పాండవులదే విజయమని టీడీపీ కూటమి బలంగా ముందుకెళుతోంది.

జనసేనకు పాలకొండ... పోలవరం!

▸▸ పి.గన్నవరం, అవనిగడ్డ, రైల్వేకోడూరు కూడా...

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన 21 అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటి వరకూ 16 సీట్లలో అభ్యర్థులను ఖరారు చేసింది. వీటిలో ఏడుగురి పేర్లు ప్రకటించగా, మరో 9చోట్ల అభ్యర్థులకు కూడా లేఖలు అందించారు. మరో 5 స్థానాలపై రెండు రోజుల్లో స్పష్టత రానుంది. శ్రీకాకుళం జిల్లాలో పాలకొండ సీటును జనసేనకి ఇవ్వాలని టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయించారు. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం సీటు జనసేన కోరింది. అక్కడ టీడీపీ బలంగా ఉండటం, స్థానిక పరిస్థితుల నేపథ్యంలో పి.గన్నవరం సీటు ఆ పార్టీకి ఇవ్వనున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం, నర్సాపురం, ఉంగుటూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం స్థానాలు జనసేనకు కేటాయించారు. అదనంగా పోలవరం కూడా ఆ పార్టీ ఖాతాలోకి రానుంది. ఇక కృష్ణా జిల్లాలో విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ జనసేన ఖాతాలోకి వస్తాయని భావించారు. అయితే పొత్తుల్లో భాగంగా విజయవాడ పశ్చిమను బీజేపీకి కేటాయించడంతో జనసేన అవనిగడ్డకు పరిమితమైంది. రాయలసీమలో జనసేన పార్టీకి తిరుపతి అసెంబ్లీ సీటు కేటాయించారు. రైల్వేకోడూరు నుంచి కూడా ఆ పార్టీ పోటీ చేసే అవకాశం ఉంది. కాగా, తిరుపతి అసెంబ్లీ సీటుకు ఆరణి శ్రీనివాసులును అభ్యర్థిగా ప్రకటించడంపై జనసేన, టీడీపీ స్థానిక నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానిక నాయకులతో చర్చించేందుకు పార్టీ అధికార ప్రతినిధి అజయ్‌కుమార్ ఆదివారం తిరుపతి వెళ్లి అసమ్మతి వర్గంతో సమావేశం కానున్నారు.

పార్టీ ఆదేశించిన చోటే పోటీచేస్తా: కళా వెంకట్రావు

ఎన్నికల్లో పోటీపై పార్టీ ఆదేశాలను పాటిస్తానని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా వెంకట్రావు స్పష్టం చేశారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా అంగీకరించాలని చంద్రబాబు చెప్పారని, అందుకు సరేనని అన్నానని శనివారం ఉండవల్లిలో చెప్పారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వైసీపీ టికెట్..

అర గుండు.. అర మీసంతో సజ్జల బంధువు నిరసన

▸▸ శ్రీధర్‌రెడ్డికి టికెట్ రాదని చాలెంజ్ చేసిన సజ్జల మహేశ్వర్ రెడ్డి

▸▸ పుట్టపర్తిలో శ్రీధర్ రెడ్డిని ఓడించాలని పిలుపు



అరగుండు, అరమీసంతో మహేశ్వరరెడ్డి

పుట్టపర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి మళ్లీ వైసీపీ టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ.. ఆయన మాజీ డ్రైవర్ సజ్జల మహేశ్వర్ రెడ్డి అరగుండు, అర మీసం గీయించుకున్నారు. పుట్టపర్తిలోని సత్తెమ్మ ఆలయం ఎదుట.. నడిరోడ్డుపై శనివారం ఆయన నిరసన తెలిపారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సమీప బంధువు, కడప జిల్లా తొండూరు మండలం టి.తుమ్మలపల్లికి చెందిన సజ్జల మహేశ్వర్ రెడ్డి గతంలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి వద్ద వాహన డ్రైవర్‌గా పనిచేశారు. శ్రీధర్ రెడ్డికి మళ్లీ వైసీపీ టికెట్ వస్తే తాను అరగుండు గీయించుకుని, అర మీసం తీయించుకుంటానని నెల కిందట మహేశ్వరరెడ్డి చాలెంజ్ చేశారు. శనివారం వైసీపీ ప్రకటించిన జాబితాలో శ్రీధర్ రెడ్డి పేరు ఉండటంతో మహేశ్వరరెడ్డి.. సత్తెమ్మ ఆలయం వద్దకు వెళ్లి.. రోడ్డుపై కూర్చుని అర గుండు, అరమీసం గీయించుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. 'శ్రీధర్ రెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. ఆయనకు ఓటు వేస్తే ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఆయన డ్రైవర్‌గా 23 ఏళ్లపాటు పని చేసిన నేను.. పడిన అవమానాలు, ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. శ్రీధర్‌రెడ్డికి మరోసారి ఎమ్మెల్యే అయితే నియోజకవర్గం అధోగతిపాలవుతుంది. ఆయన స్వార్థానికి అందరూ బలైపోయారు. ఇలాంటి వ్యక్తికి ఓట్లు వేయొద్దని ప్రజలు, వైసీపీ శ్రేణులకు విన్నవిస్తున్నా. సీఎం జగన్ 175కి 175 గెలవాలని అంటున్నారు. ఈ ఒక్కచోట ఓడిపోయినా ఏమీ కాదు. శ్రీధర్ రెడ్డిని ఓడించండి' అని పిలుపునిచ్చారు.

వైసీపీ ఎంపీ అభ్యర్థులు

పార్లమెంట్ స్థానం	అభ్యర్థి
శ్రీకాకుళం	పేరాడ తిలక్
విజయనగరం	బెల్లాన చంద్రశేఖర్
విశాఖపట్నం	బొత్స ఝాన్సీలక్ష్మి
అనకాపల్లి	—
అరకు	చెట్టి తనూజ రాణి
కాకినాడ	చలమలశెట్టి సునీల్
అమలాపురం	రాపాక వరప్రసాద్
రాజమండ్రి	గూడూరు శ్రీనివాసులు
నరసాపురం	గూడూరు ఉమాబాల
ఏలూరు	కారుమూరి సునీల్‌కుమార్
మచిలీపట్నం	సింహాద్రి చంద్రశేఖరరావు
విజయవాడ	కేశినేని శ్రీనివాస్(నాని)
గుంటూరు	కిలారి వెంకట రోశయ్య
నరసరావుపేట	పోలుబోయిన అనిల్‌కుమార్
బాపట్ల	నందిగం సురేశ్
ఒంగోలు	చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి
నెల్లూరు	విజయసాయిరెడ్డి
తిరుపతి	మద్దిల గురుమూర్తి
చిత్తూరు	ఎన్.రెడ్డెప్ప
రాజంపేట	మిథున్‌రెడ్డి
కడప	వైఎస్ అవినాశ్‌రెడ్డి
కర్నూలు	బీవై రామయ్య
నంద్యాల	పోచా బ్రహ్మానందరెడ్డి
హిందూపురం	జోలదరాశి శాంత
అనంతపురం	మాలగుండ్ల శంకరనారాయణ

బడుగులను పాలనలో భాగస్వాములను చేయడమే మా లెక్క: లోకేశ్

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): 'బడుగులను బానిసత్వంలో భాగస్వాములను చేయడం మీ లెక్క... అదే బడుగులను పరిపాలనలో భాగస్వాములను చేయడం మా లెక్క' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ వ్యాఖ్యానించారు. శనివారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'సామాజిక రాజకీయం కాదు... సామాజిక న్యాయం చేయాలి. బడుగులను గుమ్మం బయటే నుంచోబెట్టడమేనా మీరు చేసే సామాజిక న్యాయం?' అని లోకేశ్ వైసీపీని ప్రశ్నించారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లు ఇక పద్ధతులు మార్చుకోవాలి: ఆనం రమణారెడ్డి

జగన్‌రెడ్డి భజన చేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి హెచ్చరించారు. కోడ్ రావడంతో అధికారులు భయపడుతున్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఒక్క విషయం గమనించాలి. ఇక్కడ చంద్రబాబు అధికారంలోకి వస్తే ఢిల్లీ వెళ్లొచ్చని అనుకుంటున్నారేమో.. ఢిల్లీలోనూ వచ్చేది మా ఉమ్మడి ప్రభుత్వమే. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోకపోతే తీవ్ర చర్యలుంటాయి. లోకేశ్‌ను సవాల్ చేసే స్థాయి అనిల్‌కుమార్ యాదవ్‌కు లేదు. నోరు అదుపులో పెట్టుకోవాలి. లోకేశ్ ఎందుకు... నాతో చర్చకు సిద్ధమా? రోజాకు టికెట్ ఇచ్చిన జగన్‌కు ధన్యవాదాలు. రోజాను చిత్తుగా ఓడించడానికి నగరి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. నగరి టీడీపీ అభ్యర్థి 50వేల మెజార్టీతో గెలుస్తాడు' అని ఆనం అన్నారు.

దశ	నోటిఫికేషన్ తేదీ	నామినేషన్ స్వీకరణకు చివరి తేదీ	నామినేషన్ల పరిశీలన	ఉపసంహరణకు ఆఖరు తేదీ	పోలింగ్ తేదీ
తొలి విడత	మార్చి 20	మార్చి 27	మార్చి 28	మార్చి 30	ఏప్రిల్ 19
రెండో విడత	మార్చి 28	ఏప్రిల్ 4	ఏప్రిల్ 5	ఏప్రిల్ 8	ఏప్రిల్ 26
మూడో విడత	ఏప్రిల్ 12	ఏప్రిల్ 19	ఏప్రిల్ 20	ఏప్రిల్ 22	మే 7
నాలుగో విడత	ఏప్రిల్ 18	ఏప్రిల్ 25	ఏప్రిల్ 26	ఏప్రిల్ 29	మే 13
ఐదో విడత	ఏప్రిల్ 26	మే 3	మే 4	మే 6	మే 20
ఆరో విడత	ఏప్రిల్ 29	మే 6	మే 7	మే 9	మే 25
ఏడో విడత	మే 7	మే 14	మే 15	మే 17	జూన్ 1

ఎన్నికలు ఏయే రాష్ట్రాల్లో.. ఎన్ని దశల్లో (కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా)



ఒకే దశలో: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,అరుణాచల్ ప్రదేశ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, కేరళ, నాగాలాండ్, తమిళనాడు, పంజాబ్, ఉత్తరాఖండ్, సిక్కిం, మిజోరాం, మేఘాలయ,అండమాన్, నికోబార్ దీవులు, చండీగఢ్, దాద్రానగర్ హవేలి, లక్షద్వీప్, పుదుచ్చేరి

2 దశల్లో: కర్ణాటక, రాజస్థాన్, త్రిపుర, మణిపూర్

3 దశల్లో: అసోం, ఛత్తీస్‌గఢ్

4 దశల్లో: మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, ఒడిశా

5 దశల్లో: మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్

7 దశల్లో: ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్

పుదుచ్చేరి బీజేపీ సీటుకు 50కోట్లు

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎంపికకు ఆ పార్టీ రాష్ట్ర శాఖ రూ.50 కోట్ల వరకు బేరమాడుతోందని స్వతంత్ర శాసన సభ్యుడు శివశంకరన్ ఆరోపించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే తరఫున బీజేపీ బరిలోకి దిగనుంది. బీజేపీ తరఫు అభ్యర్థిని ఖరారు చేసేందుకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ స్థానిక నాయకులు, శాసన సభ్యులతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో కారైక్కాల్‌కు చెందిన పారిశ్రామికవేత్త రాజశేఖరన్‌ను బీజేపీ అభ్యర్థిగా సిఫారసు చేస్తూ పార్టీ అధిష్ఠానవర్గానికి ప్రతిపాదన పంపాలని నిర్ణయించారు. అయితే, స్థానిక నాయకులు రాజశేఖరన్‌ను వ్యతిరేకించినప్పటికీ నిర్మల్‌కుమార్ టికెట్ అమ్ముతున్నారని శివశంకరన్ ఆరోపించారు.

ఎన్నికలకు మేం సిద్ధం



న్యూఢిల్లీ, మార్చి 16: సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే పూర్తి సంసిద్ధంగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు ఒక విధానం, లక్ష్యం లేవని విమర్శిస్తూ మళ్లీ తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే అతిపెద్ద ప్రజాస్వామ్య పండగ మొదలైందంటూ మోదీ 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టారు. తమ పదేళ్ల హయాంలో దేశం మలుపు తిరిగిందని, సుపరిపాలనలో తమ ట్రాక్ రికార్డు ఆధారంగా ప్రజల ముందుకెళతామని పేర్కొన్నారు. మూడో విడతలో మరిన్ని పనులు చేయవలసి ఉందని, పేదరికం, అవినీతిపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు. 70 ఏళ్ల పాటు దేశాన్ని పాలించినవారు సృష్టించిన అంతరాలను గత పదేళ్లలో రూపుమాపామని, భారత్ స్వయంసమృద్ధి సాధించగలదన్న విశ్వాసాన్ని నింపామని పేర్కొన్నారు. ఇక భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు, యువత కలలను నెరవేర్చేందుకు పనిచేస్తామని తెలిపారు. 'పదేళ్ల క్రితం బీజేపీ అధికారంలోకి వచ్చే వరకు దేశ ప్రజలు మోసానికి గురయ్యామనే భావనలో ఉన్నారు. కుంభకోణాలు జరగని రంగం లేదు. ప్రపంచం మనవైపు చూడటం మానేసింది. అక్కడి నుంచి అద్భుతమైన మలుపు తిరిగింది. ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయుల సహకారంతో అభివృద్ధిలో దేశం దూసుకెళుతోంద'ని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీ దేశ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. వారిని తన కుటుంబ సభ్యులుగా సంబోధిస్తూ 140 కోట్ల మంది భారతీయుల మద్దతు తనకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 'పీఎం-సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకం కింద సబ్సిడీపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు దేశవ్యాప్తంగా కోటి దరఖాస్తులు అందినట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. శనివారం ఆయన ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు.

ఇదే చివరి అవకాశం..


ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి: ఖర్గే



న్యూఢిల్లీ, మార్చి 16: ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాంగాన్ని నియంతృత్వం బారి నుంచి కాపాడుకునేందుకు ఇదే చివరి అవకాశమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. శనివారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఆయన ఈమేరకు వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికలు దేశంలో 'న్యాయానికి తలుపు' తెరుస్తాయన్నారు. విద్వేషం, నిరుద్యోగం, ధరల పెరుగుదలపై కలిసి పోరాడుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. 'భారత ప్రజలమైన మనం విద్వేషం, దోపిడీ, నిరుద్యోగం, ధరల పెరుగుదల, నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం. ఈ 'హస్తం' మన పరిస్థితిని మార్చబోతోంది..' అని ఎక్స్‌లో పేర్కొంటూ కాంగ్రెస్ ఎన్నికల గుర్తును పోస్టు చేశారు. 'ఎలక్టోరల్ బాండ్లు, విపక్ష నేతలను జైల్లో వేయడం, సస్పెండ్ చేయడం, దాడులు చేయించడం, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి నిధులను స్తంభింపజేయడం వంటి కమ్ముకున్న స్కామ్‌ల మేఘాల కింద మైలురాయిగా నిలిచే ఈ ఎన్నికలు జరగబోతున్నాయి' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ఈ ఎన్నికలు చాలా కీలకమైనవి.. ఎందుకంటే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని మనమే రక్షించుకోవాలి లేదా ఓ వ్యక్తి కోరికలు, అభిరుచులు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి.. రాహుల్ చేపట్టిన యాత్రల ద్వారా రైతులు, యువత, మహిళలు, ముఖ్యంగా నిరుద్యోగులకు చేరువై వారి సమస్యలను లేవనెత్తాం. యువత గురించి ఆలోచించే పార్టీని ప్రజలు ఎన్నుకోవాలి' అని కోరారు.

7 దశల్లో సార్వత్రికం

(మొదటి పేజీ తరువాయి)



శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 19వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ మధ్య ఏడు విడతల్లో పోలింగ్ జరగనుంది. మోదీ 'ఎన్డీయే' హ్యాట్రిక్ కొడుతుందా? రాహుల్ 'ఇండియా' గెలుస్తుందా? జూన్ 4వ తేదీ వెలువడే ఫలితాలతో తేలిపోతుంది.

పోలింగ్ సాగేదిలా...

రెండు నెలల పాటు సుదీర్ఘంగా సాగే ఎన్నికల ప్రక్రియ వివరాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, సహచర కమిషనర్లతో కలిసి వెల్లడించారు. మొత్తం ఏడు దశల్లో సాగే ఈ ఎన్నికల్లో దేశంలోని మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలలోని మొత్తం శాసనసభ స్థానాలకు, వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 26 శాసనసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. తొలివిడత పోలింగ్ ఏప్రిల్ 19న జరగనుంది. కీలకమైన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన మే 13న(సోమవారం) నాలుగో దశలో జరగనున్నాయి. అదే రోజు తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు కూడా పోలింగ్ జరగనుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక కూడా నాలుగో దశ పోలింగ్‌లో భాగంగానే జరుగుతుంది. జూన్ 1న తుది ఏడో విడత పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. జూన్ 16న ప్రస్తుత లోక్‌సభ కాలం పూర్తవుతున్నందువల్ల ఆ లోపే కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు వీలుగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది. మణిపూర్‌లో కల్లోలం దృష్ట్యా వివిధ శరణార్థుల శిబిరాల్లో ఉన్న వారికి కూడా ఓటు సౌకర్యం కల్పించాలని కమిషన్ నిర్ణయించింది. ఇక్కడ రెండు లోక్‌సభ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కశ్మీర్ నుంచి వలస వెళ్లిన వారికి కూడా వారు ఎక్కడున్నా అక్కడి నుంచే ఓటు సౌకర్యం కల్పిస్తారు. శనివారం మధ్యాహ్నం నుంచే దేశ వ్యాప్తంగా ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని ఎన్నికల కమిషన్ తెలిపింది. విలేకరుల సమావేశంలో కొద్ది రోజుల క్రితం నియమితులైన నూతన కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

22 రాష్ట్రాల్లో ఒకే దశ

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి 22 చోట్ల ఒకే దశలో పోలింగ్ జరగనుంది. అవి... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, అండమాన్, చండీగఢ్, దాద్రానగర్ హవేలీ, ఢిల్లీ, గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, కేరళ, లక్షద్వీప్, లద్దాఖ్, మిజోరం, మేఘాలయం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, తమిళనాడు, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు. కర్ణాటక, రాజస్థాన్, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల్లో రెండు దశల్లో, ఛత్తీస్‌గఢ్, అసోంలలో మూడు దశల్లో, ఒడిసా, మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లలో నాలుగు దశల్లో, మహారాష్ట్ర, జమ్ము కశ్మీర్ లలో అయిదు దశల్లో, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఏడు దశ ల్లో వేర్వేరు తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఒడిసా శాసనసభ ఎన్నికలు మే 13, 20, 25, జూన్ 1వ తేదీల్లో నాలుగు దశల్లో జరగనున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం శాసనసభ ఎన్నికలు ఏప్రిల్ 19న జరగనున్నాయి.

ఇంట్లోనే ఓటేయొచ్చు

85 ఏళ్ల వయసు దాటిన వాళ్లందరికీ, 40 శాతానికి మించి అంగ వైకల్యం కలిగిన వారికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇంతకుముందే పలు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టామని, ఈసారి దేశమంతటా అమలు చేస్తున్నామని ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జమ్ము కశ్మీర్ శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తామని రాజీవ్ కుమార్ ప్రకటించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌లో జమ్మూ కశ్మీరు కూడా ఉంది.

పారదర్శకత మంచిదే

రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చే పద్ధతిని సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ స్వాగతించారు. ప్రజాస్వామ్యంలో దాపరికాలకు తావుండరాదని చెప్పారు. సుప్రీంకోర్టులో తమ వాదనలు వినిపించినపుడు కూడా పారదర్శకతకు మద్దతు పలికామన్నారు.

44 రోజుల సుదీర్ఘ ప్రక్రియ

ఈ సారి లోక్‌సభ ఎన్నికల 'ఓటింగ్ కాలం' 44 రోజుల పాటు కొనసాగనుంది. తొలి పార్లమెంటు ఎన్నికల (1951-52) తర్వాత ఇదే సుదీర్ఘ కాలావధి! నాటి ఎన్నికలలో ఈ గడువు నాలుగు నెలలకు పైనే! ఈ సారి మొదటి దశ పోలింగ్ 19న, చివరిది జూన్ 1న జరగనున్నాయి. ఈ రెండు తేదీల మధ్య 44 రోజుల గడువు ఉంది. అదే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన శనివారం నుంచి ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4 వరకు లెక్కిస్తే 82 రోజులు! ఎన్నికల క్రతువు ఇన్ని రోజుల పాటు కొనసాగడానికి కారణం ఏమిటన్న విలేకరుల ప్రశ్నకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బదులిస్తూ ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, సెలవులు, పండుగలు, పరీక్షల వంటి ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ తేదీలను నిర్ణయించడమేనని తెలిపారు. 1980లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అతి తక్కువగా నాలుగు రోజుల్లోనే పూర్తయింది.

10.5 లక్షలు పోలింగ్ జరగనున్న బూతులు

55 లక్షలు ఈ సార్వత్రిక ఎన్నికల కోసం ఉపయోగించే ఈవీఎంల సంఖ్య

1.5 కోట్లు ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సిబ్బంది

3.4 లక్షలు ఎన్నికల నిర్వహణకు భద్రతా విధుల్లో ఉండే కేంద్ర బలగాలు

ఓటర్లు 97 కోట్ల మంది

ఈ సారి ఎన్నికలకు 97.89 కోట్ల మంది ఓటర్లు నమోదయ్యారని ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ చెప్పారు. వారిలో 47.1 కోట్ల మంది మహిళలు ఉన్నారన్నారు. 12 రాష్ట్రాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. 48 వేల మంది ట్రాన్స్‌జెండర్లుగా ఓటు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

కోడ్ ఉల్లంఘిస్తే సీరియస్

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో నాలుగు 'ఎం'లు సవాళ్లుగా నిలిచాయని ప్రధాన కమిషనర్ చెప్పారు. డబ్బు(మనీ), కండబలం(మజిల్), తప్పుడు సమాచారం(మిస్‌ఇన్ఫర్మేషన్), ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్) ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణించనున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ప్రచారంలో బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. విద్వేష ప్రసంగాలు, తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో నగదు బదిలీపై గట్టి నిఘా ఉంటుందని చెప్పారు. కుల, మత పరమైన విజ్ఞప్తులు కుదరవని స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితం మీద విమర్శలు చేయరాదన్నారు. తప్పుదోవ పట్టించే ప్రకటనలకు దూరంగా ఉండాలని చెప్పారు. స్టార్ క్యాంపెయినర్ల మీద కూడా మర్యాద బాధ్యత పెడుతున్నామని ప్రకటించారు. స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మతపరంగా, కుల పరంగా ప్రచారాన్ని, విద్వేష ప్రసంగాల్ని ఉపేక్షించబోమని రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. 18 ఏళ్లు దాటిన 1.8 కోట్ల మంది కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారని, వచ్చే ఏప్రిల్ ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండే వారికి కూడా అవకాశం ఇచ్చామన్నారు. నో యువర్ కాండిడేట్ పేరుతో కొత్త యాప్‌ను తీసుకొచ్చామని, ప్రతి ఓటరూ తన అభ్యర్థి నేర చరిత, విద్యార్హతలు, ఆస్తుల గురించి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

ఏ దశలో.. ఏయే రాష్ట్రాల్లో అంటే..

తొలి దశలో దేశంలోని 21 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 స్థానాలకు ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. *ఇందులో అరుణాచల్ ప్రదేశ్(2 స్థానాలకు), అసోం(5), బిహార్(4), ఛత్తీస్‌గఢ్(1), మధ్యప్రదేశ్(6), మహారాష్ట్ర(5), మణిపూర్(2), మేఘాలయ(2), మిజోరం(1), నాగాలాండ్(1), రాజస్థాన్(12), సిక్కిం(1), తమిళనాడు(39), త్రిపుర(1), ఉత్తరప్రదేశ్(8), ఉత్తరాఖండ్(5), పశ్చిమ బెంగాల్ (3), అండమాన్ నికోబార్(1), జమ్మూకశ్మీర్(1), లక్షద్వీప్(1), పుదుచ్చేరి(1) ఉన్నాయి.*

రెండో దశలో దేశంలోని 13 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 89 స్థానాలకు ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది. *ఇందులో అసోం(5), బిహార్(5), ఛత్తీస్‌గఢ్(3), కర్ణాటక(14), కేరళ(20), మధ్యప్రదేశ్(7), మహారాష్ట్ర(8), మణిపూర్(1), రాజస్థాన్(13), త్రిపుర(1), ఉత్తరప్రదేశ్(8), పశ్చిమ బెంగాల్(3), జమ్మూకశ్మీర్(1) ఉన్నాయి.*

మూడో దశలో దేశంలోని 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 94 స్థానాలకు మే 7వ తేదీన పోలింగ్ జరుగుతుంది. *ఇందులో అసోం(4), బిహార్(5), ఛత్తీస్‌గఢ్(7), గోవా(2), గుజరాత్(26), కర్ణాటక(14), మధ్యప్రదేశ్(8), మహారాష్ట్ర(11), యూపీ(10), పశ్చిమ బెంగాల్(4), దాద్రానగర్ హవేలి, దమన్ డీవ్(2), జమ్మూకశ్మీర్(1) ఉన్నాయి.*

నాలుగో దశలో దేశంలోని 10 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 స్థానాలకు మే 13న పోలింగ్ జరుగుతుంది. *ఇందులో ఆంధ్రప్రదేశ్(25), బిహార్(5), ఝార్ఖండ్(4), మధ్యప్రదేశ్(8), మహారాష్ట్ర(11), ఒడిసా(4), తెలంగాణ(17), యూపీ(13), బెంగాల్(8), జమ్మూకశ్మీర్(1) ఉన్నాయి.*

ఐదో దశలో దేశంలోని 8 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 స్థానాలకు మే 20న పోలింగ్ జరుగుతుంది. *ఇందులో బీహార్(5), ఝార్ఖండ్(3), మహారాష్ట్ర(13), ఒడిసా(5), ఉత్తరప్రదేశ్(14), పశ్చిమ బెంగాల్(7), జమ్మూకశ్మీర్(1), లద్దాఖ్(1) ఉన్నాయి.*

ఆరో దశలో దేశంలోని 7 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 57 స్థానాలకు మే 25న పోలింగ్ జరుగుతుంది. *ఇందులో బిహార్(8), హరియాణా(10), ఝార్ఖండ్(4), ఒడిసా(6), ఉత్తరప్రదేశ్(14), పశ్చిమబెంగాల్(8), ఢిల్లీ(7) ఉన్నాయి.*

ఏడో దశలో దేశంలోని 8 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 57 స్థానాలకు జూన్ 1న పోలింగ్ జరుగుతుంది. *బిహార్(8), హిమాచల్ ప్రదేశ్(4), ఝార్ఖండ్(3), ఒడిసా(6), పంజాబ్(13), ఉత్తరప్రదేశ్(13), పశ్చిమ బెంగాల్(9), చండీగఢ్(1) ఉన్నాయి.*

మండే ఎండల్లో ఏపీ, తెలంగాణ పోలింగ్

ఈసారి ఉభయ రాష్ట్రాల్లో పోలింగ్ మండే ఎండల్లో జరగనుంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నీటి సమస్య మొదలైంది. ఎన్నికల ప్రచారం, పోలింగ్ నాటికి ఎండల తీవ్రత పెరుగుతుందని భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఇరు రాష్ట్రాలకు ఒకేసారి తొలిదశలోనే పోలింగ్ పెట్టడంతో ఎండల బాధ తక్కువగా ఉంది. 2014లో కూడా ఏప్రిల్ చివరివారంలో తెలంగాణ, మే మొదటివారంలో ఏపీ ఎన్నికలు పూర్తయ్యాయి.

- *2014లో పది ఫేజుల్లో ఎన్నికలు జరిగినపుడు తెలంగాణ ఎనిమిదవ ఫేజ్‌లో ఏప్రిల్ 30న ఏపీ తొమ్మిదవ ఫేజ్‌లో మే 7న పోలింగ్ జరిగింది. మే 16న ఫలితాలు వెలవడ్డాయి. 2019లో ఏడు దశల్లో లోక్‌సభ పోలింగ్ జరిగినపుడు తెలంగాణ, ఏపీలకు ఒకేసారి మొదటి దశలో ఏప్రిల్ 11న పెట్టారు. మే 23న ఫలితాలు వచ్చాయి. 2024లో ఏడు దశల్లో ఎన్నికలు పెడుతున్నారు. తెలంగాణ, ఏపీలు కలిపి నాలుగో దశలో మే 13న ఎన్నికలు జరుగుతున్నాయి.*

ప్రసార భారతి చైర్మన్‌గా నవనీత్ కుమార్ సెహగల్



న్యూఢిల్లీ, మార్చి 16 : రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నవనీత్ కుమార్ సెహగల్.. ప్రసార భారతి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ.. నూతన చైర్మన్‌గా నవనీత్ కుమార్ సెహగల్‌ను ప్రతిపాదిస్తూ చేసిన సిఫారసుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ప్రసార భారతి చైర్మన్ పదవి నాలుగేళ్లుగా ఖాళీగా ఉంది. చివరిగా ఎ.సూర్యప్రకాశ్ ఈ పదవిలో ఉన్నారు. 2020 ఫిబ్రవరిలో ఆయన రిటైర్ అయ్యారు.

జేకేఎల్ఎఫ్‌పై మరో ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ, మార్చి 16: తీవ్రవాదం, వేర్పాటువాదాన్ని ప్రేరేపిస్తున్న పలు ఉగ్రవాద సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఉగ్రవాది మొహమ్మద్ యాసిన్ మాలిక్ నేతృత్వంలోని జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్‌ను(జేకేఎల్ఎఫ్) ప్రభుత్వం మరో ఐదేళ్లపాటు నిషేధించినట్లు హోంమంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా శనివారం ప్రకటించారు. జమ్మూకశ్మీర్ పీపుల్స్ ఫ్రీడమ్ లీగ్‌పై ఐదేళ్ల నిషేధం విధించారు. .

ఎన్నికల బాండ్ల రద్దు కంటే మెరుగుపరిస్తే బాగుండేది

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 16: రాజకీయాల్లో నల్లధనాన్ని అంతమొందించడానికి తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని పూర్తిగా రద్దు చేయడం కంటే పథకాన్ని మెరుగుపరిస్తే బాగుండేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. ఎలక్టోరల్ బాండ్ల అంశంలో బీజేపీని విమర్శిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం అన్నారు. ఎలక్టోరల్ బాండ్లు రద్దు వల్ల రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల్లో మళ్లీ నల్లధనం వచ్చే ముప్పు ఉందన్నారు. "బీజేపీ సహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.20,000 కోట్లు వచ్చాయి. ఇందులో బీజేపీకి రూ.6వేల కోట్లు వచ్చాయి. మిగిలిన రూ.14వేల కోట్ల మాటేంటి? బీజేపీని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు బదులివ్వాలి" అని షా నిలదీశారు.

ఎన్నికల విధుల్లో టీచర్లు

- వారు లేకుండా ఎన్నికలు జరగవు
- సచివాలయ ఉద్యోగులు ఇంకు పెట్టే విధులకే
- వలంటీర్లు ప్రచారంలో పాల్గొనరాదు : సీఈవో మీనా

అమరావతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు పాల్గొంటారని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల్లో 60 శాతం ఉపాధ్యాయులే ఉన్నారని, వారు లేకుండా ఎన్నికలే జరగవన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఎన్నికల విధుల్లో ఇంకు పెట్టడం వంటి విధులకు మాత్రమే వినియోగిస్తామన్నారు. వలంటీర్లు కూడా ప్రభుత్వంలో భాగమేనని, ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదనే నిబంధనలు వారికి వర్తిస్తాయన్నారు. శనివారం అమరావతి సచివాలయంలో కోడ్‌కు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. కోడ్ అమలులో ఉండగా కొత్త పనులు, కొత్త పథకాలు ప్రారంభించకూడదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం, మంత్రుల ఫొటోలు ఉంచకూడదన్నారు. ప్రభుత్వం జారీ చేసే పత్రాలపై నేతల ఫోటోలు ఉండకూడదని తెలిపారు. ప్రభుత్వ విజయాల పేరిట ప్రజాధనంతో ఇచ్చే ప్రకటనలు నిలిపేయాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, కొత్త లబ్ధిదారుల ఎంపిక ఇకపై చేయకూడదన్నారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదన్నారు. మతపరమైన కార్యక్రమాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదని తెలిపారు.

24 గంటల్లో తొలగించండి: "24 గంటల్లో రాజకీయ నేతల ఫొటోలు, కటౌట్లు, బ్యానర్లను ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, ప్రభుత్వ ఆస్తుల నుంచి తొలగించాలి. ప్రభుత్వ ఖర్చుతో అధికార పార్టీ టీవీ, పత్రికల్లో ఇచ్చే ప్రకటనలు తొలగించాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న అనుమతిలేని రాజకీయ ప్రకటనలను 48 గంటల్లో తీసివేయాలి. ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి మంత్రులు, రాజకీయ పార్టీల ప్రస్తావనలు, ఫొటోలు, స్లోగన్లు తీసేయాలి. లబ్ధిదారులకు ఇచ్చే వివిధ కార్డులపై సీఎం ఫొటోలు ఉండేందుకు వీల్లేదు. సీఎంఆర్ఎఫ్ నిధులు ఇచ్చేందుకు కూడా వీల్లేదు. పాస్టర్లు, స్వామీజీలు మతపరమైన దుస్తుల్లో ఒక పార్టీకి ప్రచారం చేయరాదు. ఎన్నికల విధుల్లో, ప్రచారంలో వలంటీర్లు పాల్గొనరాదు" అని మీనా తెలిపారు.

కానుకలు ఇస్తే చర్యలు: 'ఎవరైనా ఓటరును ప్రభావితం చేయడం కోసం, ఓటు అడగడం కోసం కానుకలు, వస్తువులు ఇస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులను బదిలీ చేయరాదు. ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లను మంత్రులు ఉపయోగించరాదు. ఏ ఉద్యోగి కూడా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదు. మంత్రులు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించరాదు" అని మీనా తెలిపారు.

అధికారుల బదిలీలపై ఫిర్యాదులు: ఇటీవల జరిగిన అధికారుల బదిలీల్లో కొంతమందిపై ఫిర్యాదులు వచ్చాయని మీనా తెలిపారు. వీటిపై సమాచారం సేకరించి, కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామని, కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల కోసం వేచి చూస్తున్నామన్నారు.

ఇక ఫామ్-7, 8 దరఖాస్తులకు నో చాన్స్

అమరావతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సగటున 887 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,09,37,352 ఉండగా, మొత్తం 46,165 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఈ వివరాలు చెప్పారు. నామినేషన్ల తేదీకి 10 రోజుల ముందు వరకు కొత్త ఓటర్ల నమోదు కోసం ఫామ్-6 దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే ఇప్పటి నుంచి ఫామ్-7, 8 దరఖాస్తులను అనుమతించేమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే క్రిమినల్ కేసులున్న అభ్యర్థులు మూడు సార్లు ప్రతికల్లో ప్రకటలు ఇవ్వాలన్నారు.

ఓటర్ల వివరాలు: రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,09,37,352. అందులో పురుషులు 2,00,84,276 మంది, మహిళలు 2,08,49,730 మంది, ట్రాన్స్‌జెండర్లు 3,346 మంది ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు 7,763 మంది, సర్వీసు ఓటర్లు 67,393 మంది ఉన్నారు.

- రాష్ట్రవ్యాప్తంగా 46 వేల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. అత్యవసరంగా మరికొన్ని పోలింగ్ కేంద్రాలను పెడుతున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సగటున 887 మంది ఓటర్లు ఉన్నారు. కేవలం మహిళా సిబ్బంది మాత్రమే ఉండేలా 179 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. యువ ఓటర్ల కోసం 50, పీడబ్ల్యూడీ ఓటర్ల కోసం ప్రత్యేకంగా 63, మోడల్ పోలింగ్ కేంద్రాలు 555, ఎక్స్‌పెక్టెడ్ యాగ్జలరీ పోలింగ్ స్టేషన్లు 219 ఏర్పాటు చేయనున్నారు. ఎపిక్ కార్డులు లేనప్పుడు 12 రకాల కార్డులను పోలింగ్ స్టేషన్‌లో గుర్తింపు కార్డుగా వాడుకోవచ్చు.

3.82 లక్షల మంది సిబ్బంది: రాష్ట్ర వ్యాప్తంగా ఈ సారి పోలీసు సిబ్బంది గాక 3,82,218 మంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు. జనరల్ అబ్జర్వర్లు 50,115 మంది, ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు, పోలీస్ అబ్జర్వర్లు 13 మంది రానున్నారు. ఎన్నికల బందోబస్తులో 2,18,515 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటారు. పారామిలటరీ బలగాలను కూడా ఎన్నికల విధులకు కేటాయిస్తారు.

వృద్ధులు ఇంటి నుంచే ఓటు: 85 ఏళ్లు నిండిన ఓటర్లకు ఇంటి నుంచే ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. నోటిఫికేషన్ వచ్చాక ఫామ్-12 ద్వారా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు. దాన్ని పోస్టల్ బ్యాలెట్‌గా గుర్తిస్తారు. 10 రోజుల ముందే ఓటు వేసేలా చర్యలు తీసుకుంటారు.

ఆన్‌లైన్‌లో నామినేషన్: పోటీ చేసే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నామినేషన్ వేసుకునే వెసులుబాటు కల్పించారు. అయితే దీన్ని ప్రింట్ తీసి వ్యక్తిగతంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి. అభ్యర్థులు ఇచ్చే ఎన్నికల అఫిడవిట్‌లో ఎలాంటి ఖాళీ లేకుండా భర్తీ చేయాలి.

నేవీ మాజీ చీఫ్ రాందాస్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

సికింద్రాబాద్, తిరుమలగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళ మాజీ అధిపతి అడ్మిరల్(రిటైర్డ్) లక్ష్మీనారాయణ్ రాందాస్ అంత్యక్రియలు శనివారం ముగిశాయి. సికింద్రాబాద్, తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని స్వర్గ వాటికలో సైనిక లాంఛనాల మధ్య కుటుంబసభ్యులు, త్రివిధ దళాలకు చెందిన అధికారులు ఆయనకు అంతిమ వీడ్కోలు పలికారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాందాస్.. సికింద్రాబాద్ మిలటరీ ఆస్పత్రిలో శుక్రవారం తుది శ్వాస విడిచారు. శనివారం ఉదయం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సైనిక లాంఛనాలలో భాగంగా సైనికులు ఆయన మృతదేహాన్ని అంతిమ సంస్కారాలకు తీసుకువచ్చారు. తుపాకీతో గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించి.. అమర్ రహే.. అమర్ రహే.. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించారు. త్రివిధ దళాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు రాందాస్ పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అలాగే, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సామాజికవేత్త రమా మేల్కొటే, మీరా సంఘమిత్ర, రచయిత దివికుమార్, మానవ హక్కుల వేదిక నుంచి జీవన్‌కుమార్ తదితర ప్రముఖులు రాందాస్‌కు అంతిమ వీడ్కోలు పలికారు.

అమెరికాలో ఆంధ్ర విద్యార్థి హత్య

- అడవిలో మృతదేహం లభ్యం... నల్లజాతీయులపై అనుమానం
- స్వగ్రామం బుర్రిపాలెంలో విషాదం



అమెరికాలో హత్యకు గురైన అభిజిత్

తెనాలి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమెరికాలో తెలుగు విద్యార్థి హత్యకు గురయ్యాడు. గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన పరుచూరి అభిజిత్(21) అమెరికాలోని బోస్టన్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 11న తన పిన్నిని తీసుకువెళ్లేందుకు యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చిన అతను కనిపించకుండా పోయాడు. ఆమె ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం లేదు. దీంతో ఫోన్ నంబర్ ఆధారంగా జీపీఆర్ఎస్ లోకేషన్ సాయంతో వెతికితే యూనివర్సిటీకి 12 కి.మీ. దూరంలోని ఓ అటవీ ప్రాంతంలో శవమై కనిపించాడు. దీంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. అక్కడి నల్లజాతీయుల పనే అయివుంటుందని అనుమానిస్తున్నారు. అయితే దేహంపై ఎటువంటి గాయాలూ లేవని చెబుతున్నారు. బుర్రిపాలెం గ్రామానిక చెందిన పరుచూరి వరదరాజులుకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దకుమారుడు చక్రధర్, శ్రీలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు అభిజిత్. వరదరాజులు ఇద్దరు కుమారులూ అమెరికాలోనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. చక్రధర్ తన కుమారుడిని బోస్టన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. గతేడాదే వీరంతా స్వగ్రామం బుర్రిపాలెం వచ్చివెళ్లారు. తమ కుమారుడు హత్యకు గురికావడంతో ఆ కుటుంబం శోకంలో మునిగిపోయింది. ఇటు బుర్రిపాలెంలోనూ విషాదం నిండింది. శుక్రవారం రాత్రి మృతదేహాన్ని తీసుకొచ్చారు. శనివారం అంత్యక్రియలు పూర్తిచేశారు. కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తదితరులు పరామర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


చిలకలూరిపేట
అవినీతి, అరాచక పాలనపై
సమర శంఖం
పూరిస్తూ,
రాష్ట్ర ప్రజలకు అభయమిస్తూ,
ఎన్డీయే భారీ బహిరంగ సభ
ప్రజాగళం కు
విచ్చేస్తున్న ప్రధాని
శ్రీ నరేంద్ర మోదీ గారికి
స్వాగతం
సుస్వాగతం
భారతీయ జనతా పార్టీ - ఆంధ్రప్రదేశ్



ఒక్కటైన ప్రేమ జంట

సినిమా సెట్స్‌లో ప్రేమలో పడి.. ఆ అనుబంధాన్ని మూడు ముళ్ల బంధంగా మార్చుకుంటున్న జంటల సంఖ్య ఈ మధ్య ఎక్కువైంది. తాజాగా బాలీవుడ్ ప్రేమజంట కృతి కర్బందా, పులకిత్ సమ్రాట్ ఒక్కటయ్యారు. శుక్రవారం గుర్‌గావ్‌లో సన్నిహితుల సమక్షంలో వీరిద్దరూ పెళ్లిపీటలెక్కారు. ఈ పెళ్లి వేడుకలకు సంబంధించిన ఫొటోలను ఈ జంట ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ ప్రేమ జంటకు సెలబ్రిటీల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. రకుల్ ప్రీత్ సింగ్, రిచా చద్దా, బాబీ డియోల్, కృతి సనన్, అర్మాన్ మాలిక్, మౌనీ రాయ్ ఈ జంటకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. కాగా, కృతి కర్బందా 'తీన్‌మార్, మిస్టర్ నూకయ్య, ఒంగోలు గిత్త, బ్రూస్లీ' వంటి తెలుగు చిత్రాల్లో నటించారు. బాలీవుడ్‌లోనూ అనేక సినిమాల్లో తళుక్కుమన్నారు. మరోవైపు పులకిత్ సమ్రాట్ 'ఫక్రే' సిరీస్, సనమ్ రే వంటి సినిమాలు చేశారు. 2019లో వచ్చిన 'పాగల్‌పంతి' చిత్రంలో ఈ జంట కలసి నటించింది. దాదాపు ఆరేళ్లుగా ప్రేమలో ఉన్న వీరిద్దరూ, పెద్దల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు.

ఖుషీ ఖుషీగా...





జగదేకసుందరి శ్రీదేవి కుమార్తె, జాన్వీ కపూర్ సోదరి, ఖుషీ కపూర్ మరో నూతన చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్ తనయుడు ఇబ్రహీం అలీ కథానాయకుడుగా నటిస్తుండటం విశేషం. 'నాదనియాన్' అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు శౌనా గౌతమ్ దర్శకత్వం వహిస్తున్నారు. దర్మా ప్రొడక్షన్స్ సమర్పణలో కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. తాజాగా, ఈ చిత్ర షూటింగ్ సమయంలో లీకైన ఓ పిక్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. పూణేలోని ప్రైవేట్ యూనివర్సిటీలో హీరోహీరోయిన్లపై ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తోన్న సందర్భంలో ఎవరో ఈ ఫొటోని తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు.



పరిశ్రమ ఏదైనా, అగ్రహీరోల సినిమాలపైనే ప్రేక్షకులు ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. తమ అభిమాన హీరో చేయబోయే కొత్త సినిమా విశేషాల కోసం ప్రేక్షకలోకం ఎదురుచూడడం సహజమే. ఇక బాలీవుడ్ హీరోల సినిమాలంటే ఆ క్రేజే వేరు. త్వరలోనే హిందీ హీరోలు కొత్త ప్రాజెక్ట్‌లతో అభిమానులను ఖుషీ చేయబోతున్నారంటూ బాలీవుడ్ పరిశ్రమలో వినిపిస్తున్న సినిమాలు ఇవే.

బాలీవుడ్ టాక్... హీరోల ట్రాక్?



అంతకు మించిన హిట్ కోసం

గతేడాది మూడు చిత్రాలతో అభిమానుల ముందుకొచ్చారు షారూఖ్‌ఖాన్. 'పఠాన్', 'జవాన్' చిత్రాలతో బాక్సాఫీసు దగ్గర సందడి చేశారాయన. ఆ రెండు చిత్రాలు రూ. వెయ్యికోట్ల పైబడి వసూళ్లను సాధించాయి. అలాగే షారూఖ్ ముఖ్య భూమిక పోషించిన 'డంకీ' చిత్రం కూడా ఫర్వాలేదనిపించుకుంది. అయితే ఆయన నటించబోయే కొత్త సినిమా ఇప్పటివరకూ ఖరారు కాలేదు. తర్వాత ప్రాజెక్ట్ కూడా గొప్ప స్థాయిలో ఉండాలనే ఆలోచనతో కథల ఎంపికలో షారూఖ్ జాగ్రత్తగా ఉన్నారట. ప్రస్తుతం రెండు మూడు స్క్రిప్ట్‌లపైన ఆయన దృష్టి సారించారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వసూళ్లలో రికార్డులు సృష్టించిన 'పఠాన్' చిత్రానికి కొనసాగింపు సిద్ధమవుతోందని తెలుస్తోంది. ఆదిత్య చోప్రా ఇప్పటికే కథను సిద్ధం చేసే పనిలో ఉన్నారట. స్పై యాక్షన్ జానర్‌లో ఈ చిత్రం రానుంది. ఈ ఏడాదే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశముందని బాలీవుడ్ వర్గాల సమాచారం.

అలాగే 'కేజీఎఫ్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా అభిమానగణాన్ని సంపాదించుకున్న యశ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'లోనూ షారూఖ్ కీలకపాత్ర పోషించనున్నారని సమాచారం. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాను గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఓ పవర్‌ఫుల్ రోల్ కోసం చిత్రబృందం షారూఖ్‌ను సంప్రదించారట. ఆయనకు కూడా కథ నచ్చడంతో ఈ సినిమా చేసేందుకు అంగీకరించారట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని భావిస్తున్నారు. అలాగే ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ 'ఇన్షా అల్లా' చిత్రం కోసం షారూఖ్‌ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎలాంటి కదలికా రాలేదు.



కొత్త తరహా పాత్రలో రణ్‌బీర్..

దర్శకుడు నితీశ్ తివారి రామాయణం ఆధారంగా ఓ చిత్రాన్ని ప్రకటించారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, హీరోయిన్‌గా సాయిపల్లవి నటిస్తున్నారు. కొన్నాళ్లుగా ప్రచారంలో ఉంది. శ్రీరామ నవమి సందర్భంగా వచ్చే నెల 17న ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశముంది. అయితే ఈ చిత్రం తర్వాత రణ్‌బీర్‌కపూర్ ఓ క్రీడా నేపథ్య చిత్రం చేయబోతున్నట్లు టాక్.

కబడ్డీ ఆట నేపథ్యంలో సాగే కథతో కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.





ఛత్రపతిగా షాహిద్?

ఛత్రపతి శివాజీ జీవిత కథ ఆధారంగా దర్శకుడు అమిత్‌రాయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో షాహిద్‌కపూర్ భాగమవనున్నారని బాలీవుడ్ టాక్. ప్రస్తుతం 'దేవా' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు షాహిద్ కపూర్. శివాజీ మహారాజ్ పాత్రను పోషించేందుకు ఆయన ఉత్సాహం చూపుతున్నారట. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది.

ఈసారి హీరోగా


కొన్నాళ్లుగా తన పంథా మార్చి విలన్ పాత్రలతో అలరిస్తున్నారు సైఫ్ అలీఖాన్. త్వరలోనే ఆయన హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుందని బాలీవుడ్ సమాచారం. ఓ బిడ్డకు తండ్రి అయిన గ్యాంగ్‌స్టర్ జీవితంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'ఉడ్తా పంజాబ్' లాంటి హిట్ చిత్రాన్ని అందించిన అభిషేక్ చౌబే ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని తెలుస్తోంది.

గూఢచారిగా రణ్‌వీర్

ప్రస్తుతం అజయ్ దేవ్‌గణ్ 'సింగమ్ ఎగైన్' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు రణ్‌వీర్‌సింగ్. ఆ తర్వాత ఆయన 'డాన్ 3', 'శక్తిమాన్' చిత్రాలను మొదలుపెట్టాల్సి ఉంది. వీటితో పాటు మరో కొత్త ప్రాజెక్ట్‌కు రణ్‌బీర్ 'ఎస్' చెప్పినట్లు తెలుస్తోంది. స్పై యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో ఆదిత్యాధార్ దర్శకత్వం వహించనున్నారు. 'యురి' లాంటి సూపర్‌హిట్ చిత్రం ఆయన ఖాతాలో ఉంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. వేసవిలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అలాగే సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'బైజు బర్వా' అనే చిత్రాన్ని రణ్‌వీర్ ఓకే చేసినట్లు తెలుస్తోంది.

బాలీవుడ్‌లో ప్రేమకథా చిత్రాలను గ్రాండ్‌గా తెరకెక్కించడంలో దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ సిద్ధహస్తుడు. ఇప్పుడాయన మరో ప్రణయగాథను వెండితెరపైకి తెచ్చేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ చిత్రంలో రణ్‌బీర్‌కపూర్, విక్కీ కౌశల్‌ను హీరోలుగా అనుకుంటున్నారట. ఈ ముక్కోణపు ప్రేమకథలో అలియాభట్ హీరోయిన్‌గా నటించనున్నారట. నవంబర్‌లో ఈ చిత్రం సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు భన్సాలీ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్.





మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ జీవితం ఆధారంగా ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారని సమాచారం. అయితే ఇందులో గంగూలీ పాత్రను పోషించే హీరో ఎవరనేది ఇంకా ఖాయం కాలేదు. ఈ పాత్ర కోసం రణ్‌బీర్‌కపూర్, హృతిక్ రోషన్, ఆయుష్మాన్ ఖురానా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సాజిద్ ఇటీవలే రజనీకాంత్‌తో ఓ సినిమా చేయబోతున్నట్లు ప్రకటించారు. ఆయన నటించబోయేది గంగూలీ బయోపిక్‌లోనే అనే టాక్ పరిశ్రమలో వినిపిస్తోంది. అదే నిజమైతే మరి రజనీకాంత్ ఈ బయోపిక్‌లో ఏ పాత్రలో కనిపిస్తారనేది తెలియాల్సి ఉంది. అలాగే గంగూలీ బయోపిక్‌కు రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహించనున్నారని కోలీవుడ్ వర్గాల సమాచారం.

అక్కినేని బంగారు కుటుంబం ప్రత్యేకత అదే



మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు, దర్శకరత్న దాసరి నారాయణరావు కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న చిత్రాల్లో అధిక శాతం విజయవంతమైనవే. వాటిల్లో నటుడు కైకాల సత్యనారాయణ, ఆయన సోదరుడు నాగేశ్వరరావు కలసి నిర్మించిన 'బంగారు కుటుంబం' చిత్రం కూడా ఒకటి. ఏ తరహా చిత్రాలు తీస్తే ప్రేక్షకులు ఆదరిస్తారో తెలియని అయోమయ పరిస్థితి సినీ పరిశ్రమలో నెలకొన్న సమయంలో విడుదలైన 'బంగారు కుటుంబం' సూపర్ హిట్ అయి, పరిశ్రమకు దిక్సూచిగా నిలిచింది. రూ. 85 లక్షల వ్యయంతో తయారై 30 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం ఆ రోజుల్లో రూ. 3 కోట్లకు పైగా వసూలు చేసింది. కంటెంట్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ తప్పకుండా ఉంటుందని మరోసారి 'బంగారు కుటుంబం' నిరూపించింది. 1993 సెప్టెంబర్ 20న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో 'బంగారు కుటుంబం' చిత్రం ప్రారంభమైంది. ఆ డేట్‌కు ఓ ప్రత్యేకత ఉంది. అదేమిటంటే.. 'సీతారామ జననం' చిత్రంతో అక్కినేని హీరోగా పరిచయమై 50 ఏళ్లు, 'హరిశ్చంద్ర' నాటకంలో చంద్రమతి పాత్రతో రంగస్థలంపై అడుగుపెట్టి 60 ఏళ్లు, నిజ జీవితంలో 70 ఏళ్లు అయిన సందర్భంగా, సెప్టెంబర్ 20 ప్రత్యేకమైన రోజు కావడంతో 'బంగారు కుటుంబం' చిత్రం షూటింగ్ ప్రారంభించారు. అక్కినేని, జయసుధపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు రాఘవేంద్రరావు కెమెరా స్విచ్ఆన్ చేయగా, మెగాస్టార్ చిరంజీవి తొలి క్లాప్ ఇచ్చారు. సూపర్ స్టార్ కృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ చిత్రంలో మొదలియార్ పాత్ర దాసరి పోషించారు. అరవ యాసతో తెలుగు సంభాషణలు పలికి, కథలో కీలకమైన ఆ పాత్రకు ప్రత్యేకత చేకూర్చారు. ఇందులో అక్కినేని కుమారుడిగా తమిళ చిత్ర రంగంలో అగ్ర హీరోగా ఉన్న విక్రమ్ నటించారు. మరో ఇద్దరు కొడుకులుగా రాజ్‌కుమార్, హరీశ్ నటించగా, కోడళ్ల పాత్రలను యమున, రాజీవి, రంభ పోషించారు. చిత్ర సమర్పకుడు కైకాల సత్యనారాయణ కామెడీ, విలనీ కలగలసిన పాత్ర పోషించారు. 1994 ఫిబ్రవరి 18న విడుదలైన 'బంగారు కుటుంబం' చిత్రం ఉత్తమ కథా చిత్రంగా బంగారు నందిని పొందింది. అలాగే ఉత్తమ నటుడిగా అక్కినేని అవార్డ్ అందుకొన్నారు.



బీజేపీలోకి అనూరాధ పౌడ్వాల్

ప్రముఖ గాయని, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత అనూరాధ పౌడ్వాల్ బీజేపీలో చేరారు. శనివారం బీజేపీ నాయకులు ఆమెను సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ప్లేబ్యాక్ సింగర్‌గా కెరీర్ మొదలుపెట్టిన నేను, 35 ఏళ్లుగా కేవలం భక్తి గీతాలనే ఆలపిస్తున్నాను. సనాతన ధర్మంతో వేళ్లూనుకుపోయిన బీజేపీలో చేరడం ఆనందంగా ఉంది. మోదీ దేశాన్ని సుస్థిర ప్రగతి వైపు నడిపిస్తున్నారు. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవంలో రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నాకు పాడే అవకాశం ఇవ్వడంతో నా జీవిత కల సాకారమైంది" అని అన్నారు.




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
3 బాడీ ప్రాబ్లమ్	వెబ్‌సిరీస్	మార్చి 21
ఫైటర్	హిందీ చిత్రం	మార్చి 21
లాల్‌సలామ్	తమిళ చిత్రం	మార్చి 22
అమెజాన్ ప్రైమ్		
ప్లే గ్రౌండ్	హిందీ సిరీస్	మార్చి 17
మరక్కుమ నెంజాం	తమిళ చిత్రం	మార్చి 19
ఏ వతన్ మేరే వతన్	హిందీ చిత్రం	మార్చి 21
రోడ్ హౌస్	హాలీవుడ్ మూవీ	మార్చి 21
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
అబ్రహం ఓజ్లర్	మలయాళ చిత్రం	మార్చి 20
లూటేరా	హిందీ సిరీస్	మార్చి 22
ఆహా...		
భూతద్దం భాస్కర్ నారాయణ	తెలుగు చిత్రం	మార్చి 22
బుక్ మై షో		
ఫ్రాయిడ్స్ లాస్ట్ సెషన్	హాలీవుడ్ మూవీ	మార్చి 19
జియో సినిమా		
ఓపెన్ హైమర్	హాలీవుడ్ మూవీ	మార్చి 21
ఈటీవీ విన్		
సుందరం మాస్టర్	తెలుగు చిత్రం	మార్చి 22







ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 17 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

నోటిఫికేషన్స్



హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ జూనియర్ గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థ నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ సెట్) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ సెట్

తెలంగాణ బీసీ గురుకులాల వివరాలు

రాష్ట్రంలోని 261 బీసీ జూనియర్ గురుకుల కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. వీటిలో బాలురకు కేటాయించిన 130 కళాశాలల్లో మొత్తం 11360 సీట్లు; బాలికలకు కేటాయించిన 127 కళాశాలల్లో మొత్తం 10560 సీట్లు ఉన్నాయి. నాలుగు 'కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)' గురుకులాలు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లతోపాటు ఒకేషనల్ కోర్సులు - అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ప్రీ స్కూల్ టీచర్ ట్రెయినింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులకు ఐఐటీ, నీట్, ఎంసెట్, సీఏ/సీపీటీ, క్లాట్ కోచింగ్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డిజిటల్ క్లాస్‌లు ఉంటాయి. లోకో పేరెంట్ సిస్టమ్‌ను అనుసరిస్తారు. క్రీడలు, కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యమిస్తారు. బెడ్డింగ్ మెటీరియల్, యూనిఫాం, నోట్ బుక్స్, క్లాస్ బుక్స్ ఇస్తారు. ఆధునిక ప్రమాణాలతో ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, రీడింగ్ రూమ్స్, ప్లే గ్రౌండ్స్ ఉంటాయి. బోధన, వసతి ఉచితం. కాస్మోటిక్ ఛార్జీలు ఇస్తారు. కాషన్ డిపాజిట్ కింద రూ.1000; మెయింటెనెన్స్ ఛార్జీల కింద రూ.1000లు చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష ఫీజులను సొసైటీ భరిస్తుంది ఎంజేపీటీబీసీ డబ్ల్యూ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు, ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉన్నవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. ప్రతి గురుకులంలో స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి 'సూపర్-100 సెంటర్ క్యాంపస్'లను నిర్వహిస్తారు.

అర్హత

ప్రస్తుతం పదోతరగతి/తత్సమాన పరీక్షలు రాసే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే పదోతరగతి పూర్తిచేసినవారు, సప్లిమెంటరీ/అడ్వాన్స్ సప్లిమెంటరీ అభ్యర్థులు అనర్హులు. కుటుంబ వార్షికాదాయం నగరాల్లో రూ.2,00,000లు; గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000లు మించకూడదు.

సెట్ వివరాలు

దీనిని 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఒకేషనల్ కోర్సులు సహా అన్ని గ్రూప్‌ల అభ్యర్థులకు ఇంగ్లీష్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ అభ్యర్థులకు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ అభ్యర్థులకు బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్; ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ అభ్యర్థులకు మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒకేషనల్ కోర్సుల్లో సీజీఏ, పీఎస్‌టీటీ, సీజీటీ కోర్సులకు మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ నుంచి; ఏసీపీ, టీ అండ్ హెచ్ కోర్సులకు బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ నుంచి; ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, పీటీ కోర్సులకు బయలాజికల్ సైన్స్ ఫిజికల్ సైన్స్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉంటుంది. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. గ్రూప్ కోర్సులకు జిల్లాస్థాయి మెరిట్ ప్రకారం, ఒకేషనల్ కోర్సులకు రాష్ట్ర స్థాయి మెరిట్ ప్రకారం ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 21 నుంచి
- **ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 28
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

ఏపీ ఈసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్ఈ)- స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షని అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ) నిర్వహిస్తోంది. దీని ద్వారా బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సులకు సంబంధించి రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశాలు కల్పిస్తారు. ఈసెట్‌లో సాధించిన ర్యాంక్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ ప్రొఫెషనల్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

విభాగాలు: అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, సిరామిక్ టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఫార్మసీ.

అర్హత వివరాలు: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (టీఎస్/ఏపీ) నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఫార్మసీ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా/డిగ్రీ స్థాయిలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఏపీ ఈసెట్ 2024 వివరాలు
- పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి.
- ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం(సివిల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కెమికల్/ మెటలర్జికల్/మైనింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- బీఎస్సీ(మేథమెటిక్స్) అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 100, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాగ్నసీ, ఫార్మకాలజీ అంశాలనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; బీసీ అభ్యర్థులకు రూ.550; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **కరక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 25 నుంచి 27 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 1 నుంచి
- **ఏపీ ఈసెట్ 2024 తేదీ:** మే 8
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/ECET

ఏయూ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏయూఈఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీటెక్ (సెల్ఫ్ సపోర్ట్ మోడ్) డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన తరవాత మరో రెండేళ్లు చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



విభాగాలు-సీట్లు: ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొత్తం 510 సీట్లు ఉన్నాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్ 360, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ 60, మెకానికల్ 30, సివిల్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 30 సీట్లు ఉన్నాయి.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు అర్హులు. ఇంటర్ స్థాయిలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఏయూఈఈటీ 2024 వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. మేథమెటిక్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్/పన్నెండో తరగతి స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 24
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 3 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప.
- **ఏయూఈఈటీ 2024 తేదీ:** మే 5
- **ఫలితాలు విడుదల:** మే 7
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

ఎన్ఐఏఎంటీలో అడ్వాన్స్‌డ్ డిప్లొమా

రాంచీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ(ఎన్ఐఏఎంటీ)- అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫౌండ్రీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 58 సీట్లు, ఫోర్జ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 57 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి 18 నెలలు. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లకు ఒక్కోదానికి 26 క్రెడిట్స్ మూడో సెమిస్టర్‌కు 18 క్రెడిట్స్ నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్స్, సెమినార్స్ ల్యాబొరేటరీ సెషన్స్, వర్క్‌షాప్స్, టెక్నికల్ వీడియో సెషన్స్, ఇన్‌ప్లాంట్ ట్రెయినింగ్ తదితరాలు ఉంటాయి. అభ్యర్థులందరికీ మొదటి రెండు సెమిస్టర్లు కామన్‌గా ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇండస్ట్రియల్ ట్రెయినింగ్‌లు ఉంటాయి. అభ్యర్థులను రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన వారికి నెలకు రూ.3,000 స్టయిపెండ్ ఇస్తారు. ఫౌండ్రీ, ఫోర్జ్ టెక్నాలజీ విభాగాల్లో కేంద్ర ప్రభుత్వ సర్వీసులు, ఉద్యోగాల భర్తీకి ఈ కోర్సును అర్హతగా నిర్దేశించారు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మెటలర్జికల్/మెకానికల్/ప్రొడక్షన్/మాన్యుఫాక్చరింగ్/ఆటోమొబైల్/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిప్లొమా/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/కంప్యూటర్ అప్లికేషన్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు అడ్మిషన్ పొందిన 60 రోజులలోపు ప్రావిజనల్ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి.

రిటెన్ టెస్ట్: ఇందులో అనలిటికల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్, మేథమెటికల్ స్కిల్స్, బేసిక్ సైన్సెస్, ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ బేసిక్ లెవెల్ నుంచి డిగ్రీ స్థాయి వరకు ఉంటాయి.

- అభ్యర్థులు గూగుల్ లింక్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని అప్‌లోడ్ చేయాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూన్ 9
- **రిటెన్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కోల్‌కతా, న్యూఢిల్లీ, పుణె
- **ఫలితాలు విడుదల:** జూలై 12
- **అడ్మిషన్స్:** జూలై 23 నుంచి 26 వరకు
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్, రూమ్ నెం 206, అకడమిక్స్ సెక్షన్, లెక్చర్ హాల్ కాంప్లెక్స్, ఎన్ఐఏఎంటీ, హతియా, రాంచీ-834003
- **వెబ్‌సైట్:** www.niamt.ac.in

నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ పోస్టులు

నోయిడాలోని నవోదయ విద్యాలయ సమితి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఎన్‌వీఎస్ ప్రధాన కార్యాలయంతోపాటు దేశవ్యాప్తంగా నెలకొన్న ఎన్‌వీఎస్ ప్రాంతీయ కార్యాలయాలు, ఎన్ఎల్ఐలు, జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ స్టాఫ్ 1,377 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

పోస్టులు
1. ఫిమేల్ స్టాఫ్ నర్స్: 121
2. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: 5
3. ఆడిట్ అసిస్టెంట్: 12
4. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: 4
5. లీగల్ అసిస్టెంట్: 1
6. స్టెనోగ్రాఫర్: 23
7. కంప్యూటర్ ఆపరేటర్: 2
8. క్యాటరింగ్ సూపర్‌వైజర్: 78
9. జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: 381
10. ఎలక్ట్రీషియన్ కం ప్లంబర్: 128
11. ల్యాబ్ అటెండెంట్: 161
12. మెస్ హెల్పర్: 442
13. మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 19



అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ట్రేడ్/ స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, కాకినాడ, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్.

దరఖాస్తు విధానం: కేంద్రీయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1,500(ఫిమేల్ స్టాఫ్ నర్స్ పోస్టులకు), రూ.1000(ఇతర పోస్టులకు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.500. (ఆన్‌లైన్ దరఖాస్తు, పరీక్ష తేదీలు తదితరాలకు వెబ్‌సైట్ పరిశీలిస్తూ ఉండండి.)

వెబ్‌సైట్: navodaya.gov.in/nvs/en/Home1

జాబ్ కార్నర్

ఐఐటీఆర్‌లో టెక్నీషియన్ ఖాళీలు

లఖ్‌నవూలోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రీసెర్చ్(ఐఐటీఆర్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 19
1. టెక్నికల్ అసిస్టెంట్: **8 పోస్టులు**
2. టెక్నీషియన్: **11 పోస్టులు**

విభాగాలు: కెమికల్ సైన్సెస్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్/యానిమల్ హౌజ్ అండ్ జీఎల్‌పీ ఫ్యాకల్టీ/బయలాజికల్ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్/ఎపిడెమియాలజీ/ఇండస్ట్రియల్ రీసెర్చ్/సెన్సర్ అండ్ డివైజ్ డెవలప్‌మెంట్/ప్లంబర్/ఎలక్ట్రీషియన్/రిఫ్రిజిరేషన్-ఏసీ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్.

అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు

జీతం: టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.63,312. టెక్నీషియన్ పోస్టుకు రూ.34,625.

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31

వెబ్‌సైట్: https://www.csir.res.in/

రైల్ కోచ్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

కపుర్తలా(పంజాబ్)లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్)...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 550

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్.

అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: అకడమిక్ స్కోర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 9

వెబ్‌సైట్: https://rcf.indianrailways.gov.in/

లిటిల్స్



మీకు తెలుసా?

- ఖడ్గంలాంటి ఒంటి కొమ్మును కలిగి ఉండటం వల్లనే దీన్ని ఖడ్గమృగము అని పిలుస్తారు. ప్రపంచంలో కేవలం ఇవి ఐదు జాతులు మాత్రమే ఉన్నాయి. ఒకటి ఆఫ్రికాలో తెలుపు, నలుపు ఖడ్గమృగాలు. మూడోది ఆసియన్ రినో. వీటికి కేవలం ఒకే ఒక్క కొమ్ము ఉంటుంది. ఇవి మన దగ్గర ఉంటాయి. వీటితో పాటు సుమత్రా, జావన్ రినో.
- మనకు జుట్టు, గోర్లు పెరిగినట్లే వీటికి కొమ్ము పెరుగుతుంది. ఇది కెరోటిన్ నిర్మితమే. కాకపోతే చాలా గట్టిగా ఉంటుంది. ఇది తలచుకుంటే కారును కూడా కొమ్ముతో బోల్తా కొట్టించగలదు.
- తెలుపు ఖడ్గమృగాలు అతి పెద్దవి. వీటి బరువు సుమారు 3500 కేజీలు ఉంటుంది. అతి చిన్నవి సుమత్రా రినోస్. వీటి బరువు 600 కేజీలు ఉంటాయి.




- మగ జంతువులను 'బుల్స్' అని.. ఆడ జంతువును 'కౌ' అని పిలుస్తారు.
- వీటి చూపు తక్కువ. కేవలం 30 మీటర్ల దూరంలో ఉండేవి కనిపించవు. అయితే ఇవి వాసన పట్టడంలో గ్రేట్. తన దగ్గరకు ఏవి వస్తున్నాయో అంచనా వేయగలవు.
- ఆఫ్రికన్ రినోలతో పోలిస్తే ఆసియన్ రినోలు వేగంగా ఈదగలవు. నదిని సైతం సునాయసంగా ఈదగలవు. ముఖ్యంగా ఏ రినో అయినా బురదలో ఉండటానికి ఇష్టపడుతుంది. బురదను కోటింగ్‌లా వేసుకోవటం వల్ల దోమలు, ఇతర కీటకాల బారినుంచి రక్షించుకోగలుగుతాయి.
- వియత్నాంలో రినో కొమ్ము స్టేటస్ సింబల్. దీంతో పాటు కొన్నిచోట్ల క్యాన్సర్, ఇతర వ్యాధులను అంతమొందించటానికి వీటిని వాడతారట. దీంతో పాటు ఇతర భాగాలు కొన్ని ఔషధాల్లో విలువైనవట. అందుకే వీటిని వేటాడటానికి ప్రత్యేకమైన గ్యాంగ్స్ ఉన్నాయి. గత పదేళ్ల కాలంలో 7,100 రినోలను వేటగాళ్లు అంతమొందించారు. దీన్ని బట్టి వీటి సంఖ్య నానాటికీ ఎంత దిగజారిపోతుందో అర్థం చేసుకోవచ్చు. వీటిని వేటాడటానికి హెలికాప్టర్లలో వచ్చి కేవలం పది నిముషాల్లోనే ఎత్తుకెళ్లే ముఠాలున్నాయి.
- వీటి మెదడు చిన్నది. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో పరిగెత్తుతాయి.
- సుమత్రా రినో మాత్రం మనుషులకు దగ్గరగా ఉంటుంది.
- రినోల పిల్లలు చిన్నప్పుడే పులుల బారిన పడుతుంటాయి.

సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



జతలేని బొమ్మ ఏది?



డైలీ సుడోకు - 257

2					3		7	
	3		4		9			8
					6	2		
			7			8	1	5
		8				3		
1	7	3			5			
		4	2					
6			3		7		4	
	2		6					3

సుడోకు - 256 సమాధానం

9	2	6	7	3	1	4	8	5
3	4	7	5	8	2	9	6	1
5	8	1	6	4	9	3	2	7
4	1	8	9	5	7	2	3	6
7	3	9	2	6	8	1	5	4
2	6	5	3	1	4	7	9	8
1	9	2	8	7	5	6	4	3
8	7	3	4	2	6	5	1	9
6	5	4	1	9	3	8	7	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.